మంగళవారం 27-12-2022


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 276






SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాధ్యమైనంత మందికి పథకాల లబ్ధి ఎలా ఎగ్గొట్టాలా అన్నది గత పాలకుల వక్ర బుద్ధి..
అడుగడుగునా లంచాలు, వివక్షకు పెద్ద పీట వేసిన అల్ప బుద్ధి..

అయితే మనందరి ప్రభుత్వంలో.. అర్హులందరికీ 100% సంతృప్త స్థాయిలో సంక్షేమ ఫలాలు అందించాలన్నది జగనన్న చిత్తశుద్ధి..

## అర్హులైన ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందకుండా ఉండకూడదన్న స్థిర సంకల్పంతో..

## అర్హులై ఉండి పొరపాటున ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి మరో అవకాశం కూడా ఇస్తూ..

**రాష్ట్ర వ్యాప్తంగా అటువంటి 2,79,065 మంది లబ్ధిదారులకు రూ. 590.91 కోట్లను**
నేడు బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేస్తున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

దేశంలో ఎక్కడా లేని విధంగా – సోషల్ ఆడిట్ కోసం గ్రామ / వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలు డిస్ ప్లే చేసి, పారదర్శకతతో లంచాలకు, కుల, మత, వర్గ, పార్టీల వివక్షకు తావులేకుండా, అర్హులందరికీ నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో పథకాల లబ్ధి అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే...



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

పొరపాటున, ఏ కారణంచేతనైనా సంక్షేమ పథకాల లబ్ధి అందని వారు పథకం లబ్ధి అందించిన నెలలోపు గ్రామ / వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే, వాటిని వెరిఫై చేయించి అర్హులైన వారికి డిసెంబర్ నుండి మే వరకు అమలైన సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిని జూన్ నెలలో.. జూన్ నుండి నవంబర్ వరకు అమలైన సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిని డిసెంబర్ నెలలో.. ఏ ఒక్కరికీ లబ్ధి అందకుండా ఉండకూడదని అందజేస్తున్న జగనన్న ప్రభుత్వం..

**పొరపాటున ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాల లబ్ధి అందుకోలేకపోయిన అర్హులకు మరో అవకాశం ఇచ్చి, వాటిని వెరిఫై చేయించి జగనన్న ప్రభుత్వం నేడు అందిస్తున్న లబ్ధి వివరాలు..**

| పథకం పేరు | ప్రస్తుత లబ్ధిదారుల సంఖ్య | గత మూడున్నరేళ్లలో అందించిన లబ్ధి (రూ. కోట్లలో) | నేడు లబ్ధి అందుకుంటున్న వారి సంఖ్య | నేడు అందిస్తున్న లబ్ధి (రూ. కోట్లలో) | నేటితో మొత్తం లబ్ధిదారుల సంఖ్య | నేటితో మొత్తం లబ్ధి (రూ. కోట్లలో) |
|---|---|---|---|---|---|---|
| వైఎస్సార్ ఈబీసీ నేస్తం | 3,92,674 | 589.00 | 863 | 1.29 | 3,93,537 | 590.29 |
| జగనన్న చేదోడు | 2,98,428 | 583.78 | 725 | 0.73 | 2,99,153 | 584.50 |
| వైఎస్సార్ మత్స్యకార భరోసా | 1,19,875 | 418.00 | 4,457 | 4.46 | 1,24,332 | 422.45 |
| జగనన్న విద్యా దీవెన | 24,74,544 | 9,051.57 | 1,22,833 | 225.05 | 25,97,377 | 9,276.62 |
| జగనన్న వసతి దీవెన | 18,77,863 | 3,349.57 | 18,697 | 16.35 | 18,96,560 | 3,365.92 |
| జగనన్న అమ్మ ఒడి | 44,48,865 | 19,617.53 | 43,710 | 56.82 | 44,92,575 | 19,674.35 |
| వైఎస్సార్ కాపు నేస్తం | 3,38,792 | 1,492.00 | 17,351 | 26.03 | 3,56,143 | 1,518.02 |
| వైఎస్సార్ వాహన మిత్ర | 2,74,015 | 1,032.02 | 9,005 | 9.00 | 2,83,020 | 1,041.02 |
| వైఎస్సార్ చేయూత | 26,39,703 | 14,110.62 | 30,837 | 57.82 | 26,70,540 | 14,688.81 |
| వైఎస్సార్ నేతన్న నేస్తం | 81,783 | 776.13 | 2,577 | 6.18 | 84,360 | 782.31 |
| డా॥ వైఎస్సార్ ఉచిత పంటల బీమా [illegible] | 43,99,631 | 6,497.66 | 28,010 | 187.18 | 44,27,641 | 6,684.84 |
| మొత్తం | | | 2,79,065 | 590.91 | | |

గతంలో పింఛన్ కోసం వృద్ధులు, వికలాంగులు చాంతాడంత క్యూలలో గంటల తరబడి వేచి ఉండే దుస్థితి..





మరి నేడు.. ఠంచన్‌గా ప్రతి నెలా 1వ తేదీ ప్రొద్దున్నే గుడ్ మార్నింగ్ చెప్పి మరీ చిరునవ్వుతో లబ్ధిదారుల గడప వద్దనే పెన్షన్లు అందజేస్తున్న వాలంటీర్లు..





దీనితో పాటు కొత్తగా (జూన్ 2022 నుండి నవంబర్ 2022 వరకు)
అర్హులైన వారికి పెన్షన్ కార్డులు, బియ్యం కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, ఇళ్ళ పట్టాలకు సంబంధించిన వెరిఫికేషన్ ప్రస్తుతం జరుగుతోంది.. ఈ నెల 30న తుది జాబితా ప్రచురించి, 1 జనవరి, 2023 న పెంచిన పెన్షన్‌తో పాటు అన్ని కార్డులు, ఇళ్ళ పట్టాల పంపిణీ.. వాలంటీర్లు మీ ఇంటికే వచ్చి మీ కార్డు అందిస్తారు..

## తేడా గమనించండి..!!

### గతంలో ..

- జన్మభూమి కమిటీలు, అస్మదీయులకు మాత్రమే సంక్షేమ ఫలాలు.. పథకాల అమలులో లంచాలు, వివక్ష.. వీలైనంత మందికి లబ్ధి ఎలా ఎగ్గొట్టాలా అన్న కుతంత్రాలు.. గ్రామానికి ఇంతమందికే లబ్ధి అనే కోటాలు, కోతలు.. ఎవరైనా చనిపోతేనే కొత్త వారికి అవకాశం..
- తమ వర్గం, తమ పార్టీ, తమ వారికే లబ్ధి.. పైగా లంచాలు తీసుకుని అందించే పక్షపాత జన్మభూమి కమిటీలు.. ఇచ్చిందే అరకొర లబ్ధి.. అందులో సగానికి సగం జన్మభూమి కమిటీల లంచాలకే సరి.. పెన్షన్ కావాలన్నా, ఇళ్లు కావాలన్నా, సబ్సిడీలు కావాలన్నా, బీమా కావాలన్నా, రైతుకు ట్రాక్టర్ ఇవ్వాలన్నా, చివరకు మరుగు దొడ్లు కావాలన్నా లంచాలే..
- అసలు ఇన్ని పథకాలు లేవు, ఆ ఉన్న అరకొరలో కూడా లబ్ధిదారుల ఎంపికలో కాలయాపన, పథకాల లబ్ధిని ఎప్పుడు అందిస్తారో, ఎంత అందిస్తారో తెలియని అనిశ్చితి..
- సంక్షేమ పథకాల లబ్ధి కోసం ఆత్మాభిమానాన్ని చంపుకుని వృద్ధులు, దివ్యాంగులు, అక్కచెల్లెమ్మలు కాళ్ళరిగేలా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి మోకరిల్లాల్సిన దీనస్థితి.. వృద్ధులు, వికలాంగులు అన్న కనికరం కూడా లేకుండా వారి పెన్షన్లలో సైతం వాటా కొట్టేసిన వైనం..

### మరి మన జగనన్న ప్రభుత్వంలో..

- నేడు కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా.. లంచాలు, వివక్ష, ఆశ్రిత పక్షపాతానికి తావు లేకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు.. అర్హులై ఉండి ఒకవేళ ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాల లబ్ధి అందని వారికి మరో అవకాశాన్ని కూడా ఇస్తూ.. ప్రతి ఏటా జూన్, డిసెంబర్‌లలో లబ్ధి అందజేత..
- సంక్షేమ పథకాల లబ్ధి కోసం మధ్య దళారీలు, పైరవీకారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.. ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పనిలేకుండా గ్రామ/వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించి మరీ, సోషల్ ఆడిట్ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక.. నేరుగా లబ్ధిదారుల అన్‌ఎన్‌కంబర్డ్ ( గత రుణాలతో పని లేని) ఖాతాలకు నగదు జమ..
- సంక్షేమ క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి, నిర్దిష్ట సమయంలోనే ఠంచన్‌గా లబ్ధి పంపిణీ..
- వాలంటీర్, సచివాలయ సిబ్బంది సేవలు..! తమ పరిధిలోని అవ్వాతాతలు, అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు చేదోడు వాదోడుగా ఉంటూ.. లబ్ధిదారుల ఆత్మాభిమానం నిలబడేలా..!!

డా॥ ఆదిమూలపు సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు

శ్రీ. బూడి ముత్యాల నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు 27 డిసెంబర్, 2022న ఉదయం 11 గంటలకు " అర్హులై ఉండీ లబ్ధి అందని వారికి అందిస్తున్న లబ్ధి "ని సిఎం క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానెళ్ల లైవ్ లో వీక్షించవచ్చు.

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సాక్షి
# ఫ్యామిలీ
II
శ్రీకాకుళం
మంగళవారం ॥ 27-12-2022

## ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com





19 చుక్కలు, 5 వరుసలు,
5 వచ్చే వరకు,
చుక్క వదిలి చుక్క

**శాంతి సర్వా,**
సరూర్ నగర్, హైదరాబాద్





21 చుక్కలు,
11 వచ్చే వరకు,
సంధు చుక్క

**ఎమ్. భారతి**
అనంతపురం

# శునకాలకు కిరాణా స్టోర్

భిన్న ఆలోచన



**మనుషులకు కిరాణా దుకాణాలు ఉన్నాయి. శునకాలకు? పిల్లులకు? ఏవో నాలుగు రకాల తిండి, మెడ పట్టీలు, గొలుసులు... ఇవి అమ్మే పెట్ స్టోర్స్ కాకుండా వాటి ప్రతి అవసరాన్ని పట్టించుకుని వాటికి అవసరమైన టాప్ క్లాస్ వస్తువులను అమ్మే ఓ దుకాణం ఉండాలని భావించింది రాశి నారంగ్. పదేళ్ల నుంచి ఎంతో స్ట్రగుల్ అయ్యి నేడు నంబర్ వన్ స్థాయికి చేరింది. ఆమె 'హెడ్స్ అప్ ఫర్ టెయిల్స్' దేశవ్యాప్తంగా 75 రిటైల్ స్టోర్స్‌తో 30 పెట్ స్పాలతో సంవత్సరానికి 140 కోట్ల రూపాయల అమ్మకాలు సాగిస్తోంది. రాశి నారంగ్ పరిచయం.**

ఢిల్లీకి చెందిన రాశి నేడు దేశంలో అత్యధిక పెట్ స్టోర్లు కలిగిన సంస్థ 'హెడ్స్ అప్ ఫర్ టెయిల్స్'కు ఫౌండర్. పెంపుడు జంతువుల రంగంలో కోట్ల వ్యాపారానికి వీలుంది అని గ్రహించిన తెలివైన అంట్రప్రెన్యూర్.





'మాది వ్యాపార నేపథ్యం ఉన్న కుటుంబం. మా అత్తగారిది కూడా. మా ఇంట్లో చిన్నప్పుడు కుక్కల్ని పెంచేవాళ్లం. అయితే వాటి బాధ్యత మొత్తం కుటుంబం తీసుకునేది. కాని నాకు పెళ్లయిన కొత్తల్లో నాకంటూ ఒక కుక్క కావాలనుకుని 'సారా' అనే బుజ్జి కుక్కపిల్లను తెచ్చుకున్నాను. అదంటే చాలా ఇష్టం నాకు. దాని పుట్టినరోజుకు దానికేదైనా మంచి గిఫ్ట్ కొనిద్దామని ఢిల్లీ అంతా తిరిగాను. ఏవో కాలర్స్, గొలుసులు తప్ప దానికి తొడగడానికి మంచి డ్రస్సు గాని, కొత్త రకం ఆట వస్తువు గాని, మంచి ఫుడ్‌గాని ఏమీ దొరకలేదు. కుక్కలు పడుకునే బెడ్స్ కూడా ఎక్కడా దొరకలేదు. నేను చెబుతున్నది 2008 సంగతి. ఇంటికి ఖాళీ చేతులతో వచ్చి నా సారాను ఒళ్లో కూచోబెట్టుకుని ఆలోచించాక అర్థమైంది... నాలాగే కుక్కలను ప్రేమించేవారు ఎందరో ఉన్నారు. వారు కూడా ఇలాగే ఫీలవుతూ ఉంటారు. నేనే కుక్కలకు అవసరమైన ప్రొడక్ట్స్ ఎందుకు తయారు చేయించి అమ్మకూడదు అనుకున్నాను. అలా నా యాత్ర మొదలైంది' అంటుంది రాశి.

**మొదటి స్టోర్ ఢిల్లీలో...** అయితే ఆ ఆలోచన వచ్చాక పని మొదలెట్టడం అంత సులువు కాలేదు. రాశి హెచ్.ఆర్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. ఉద్యోగం కూడా చేసింది. 'అంత చదువు చదివి కుక్కల వస్తువులు అమ్ముతావా' అని ఫ్రెండ్స్ అన్నారు. 'ఏదో హాబీలాగా కాలక్షేపం చేస్తుందిలే' అని భర్త, అత్తమామలు అనుకుని వదిలేశారు. కాని రాశి ఆలోచన వేరుగా ఉంది. కుక్క అంటే ఆమె దృష్టిలో మరో ఫ్యామిలీ మెంబరే. 'శునకాల పట్ల మన భారతీయుల దృష్టి ఇటీవల మారింది. అంతకుముందు వాటిని ఇంటి బయట కట్టేసి వాచ్ డాగ్‌లుగా చూసుకునేవారు. ఇప్పుడు ఇంట్లోనే ఒక ఫ్యామిలీ మెంబర్‌గా చూసుకుంటున్నారు. వాటికి క్వాలిటీ ఆహారం వస్తువులు మందులు ఇవ్వడంతో వాటి ఆరోగ్యం, వాటితో ఆనందం పొందాలని అనుకుంటున్నారు. కాని అలాంటి వస్తువులు ప్రత్యేకంగా దొరకడం తక్కువ. నేను రంగంలో దిగాను' అంటుంది రాశి.

కుక్కల ఒంటి తీరు, బొచ్చును బట్టి బట్టలు కుట్టి దుస్తులు తయారు చేయడం రాశి చేసిన మొదటి పని. అవి పడుకునే తీరును బట్టి అందమైన బెడ్స్ తయారు చేయడం. అవి ఆడుకోవడానికి రకరకాల వస్తువులు. వాటి ముఖ్య ఆహారం, అల్పాహారం కోసం రకరకాల క్వాలిటీ పదార్థాలు, అందమైన మెడ పట్టీలు, ప్రమాదకర రసాయనాలు లేని షాంపూలు, డియోడరెంట్‌లు... ఇవన్నీ ఒకచోట చేర్చి వాటిని షాపులకిచ్చి అమ్మాలనుకుంది. 'కాని పెట్ స్టోర్లు అమ్మే వ్యాపారులు సగటు వ్యాపారులు. నేను తీసుకెళ్లిన ప్రొడక్ట్‌లు చూసి ఇలాంటివి అమ్మం. ఇవి ఎవరూ కొనరు అని నన్ను వెనక్కు పంపించేసేవారు. ఇక చూసి చూసి నేనే ఒక షాపు తెరిచాను. అలా ఢిల్లీలో హెడ్స్ అప్ ఫర్ టెయిల్స్ మొదటి షాపు మొదలైంది' అంటుంది రాశి.

**సుదీర్ఘ విరామం తర్వాత...** ఢిల్లీలో షాపు నడుస్తుండగానే రాశి భర్తకు సింగపూర్‌లో ఉద్యోగం వచ్చింది. అతనితో పాటు వెళ్లి అక్కడ 7 ఏళ్లు అక్కడే ఉండిపోయి 2015లో తిరిగి వచ్చింది రాశి. 'అన్నాళ్లు నేను షాపును అక్కడి నుంచే నడిపాను. విస్తరించడం వీలు కాలేదు. కాని తిరిగి వచ్చాక ఈ ఐదారేళ్లలోనే ఇంత స్థాయికి తీసుకొచ్చాను' అంటుంది రాశి. ఆమె దార్శనికతను గ్రహించిన సంస్థలు భారీగా ఫండింగ్ చేయడంతో రాశి తన స్టోర్స్‌ను పెంచుకుంటూ వెళ్లింది. అంతే కాదు కుక్కలు, పిల్లులు, కుందేళ్లు, పిట్టలు... వీటి సంరక్షణకు స్పాలు కూడా మొదలెట్టింది. అన్నీ పెట్ ఫ్రెండ్లీ షాపులు. రాశి ఇప్పుడు ఒక అడుగు ముందుకేసి 'క్యాట్ ఓన్లీ స్టోర్' కూడా తెరిచింది. అన్ని మెట్రో నగరాల్లో 'హెడ్స్ ఫర్ టెయిల్స్' షాపులు ఉన్నాయి. కుక్కలకు కావాల్సిన 100కు పైగా వస్తువులు, జాతిని బట్టి వాడాల్సిన వస్తువులు అమ్మడం ఈమె సక్సెస్‌కు కారణం. ఒక పనిలో పూర్తిగా శ్రద్ధతో నిమగ్నమైతే రాశిలా ఎవరైనా విజయం సాధించవచ్చు.

**యూత్‌పార్లమెంటులో ప్రసంగించిన మన గిరిపుత్రిక**
**పార్లమెంటు సెంట్రల్ హాల్ వేదికగా..**
**అయామ్ మౌనిక...**
**ఫ్రం తెలంగాణ.. అని పరిచయం చేసుకుని**
**వాజ్‌పేయి జీవితంపై అద్భుత ప్రసంగం చేసి**
**సర్వత్రా ప్రశంసలు అందుకున్న మౌనిక గురించి...**

దివంగత ప్రధాని వాజ్‌పేయి జీవితంపై యూత్‌పార్లమెంట్ కార్యక్రమంలో ప్రసగించడానికి దేశ వ్యాప్తంగా 25 మందిని ఎంపిక చేయగా, వారిలో ఏడుగురికి భారత పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ప్రసంగించే అవకాశం దొరికింది. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి కేతావత్ మౌనిక ఒక్కరే ఎంపిక కావడం విశేషం. అంతేకాదు, ఈ ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని, తన అద్భుతమైన ప్రసంగంతో అందరి ప్రశంసలు అందుకుంది మౌనిక.



● పార్లమెంటు సెంట్రల్ హాల్ వేదికగా ప్రసంగిస్తూ...

# అయామ్ మౌనిక



●ఇతర రాష్ట్రాలకు చెందిన యూత్‌పార్లమెంటుకు ఎన్నికైన యువతులతో మౌనిక

**చురుకైన ప్రసంగాలు...**

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సొంత గ్రామమైన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని పోచారంకు చెందిన కేతావత్ నర్సింలు, సునీతల కుమార్తె మౌనిక. కామారెడ్డి పట్టణంలోని ఆర్‌కే పీజీ కాలేజీలో ఎంఎస్‌డబ్ల్యు చదువుతోంది. తండ్రి నర్సింలు డీసీఎం డ్రైవర్‌గా, తల్లి సునీత బీడీ కార్మికురాలిగా కామారెడ్డి పట్టణంలో ఉండి తమ ముగ్గురు పిల్లల్ని చదివిస్తున్నారు. మౌనిక ఆర్‌కే కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి, అదే కాలేజీలో పీజీ మొదటి సంవత్సరం చదువుతోంది. చదువుతో పాటు చురుకైన ప్రసంగాలతో కాలేజీలో అందరి మన్ననలను అందుకున్న మౌనికను కాలేజీ సీఈవో ఎం.జైపాల్‌రెడ్డి ప్రోత్సహించారు. దేశవ్యాప్తంగా యూత్ పార్లమెంటుకు కళాశాల విద్యార్థులను ఎంపిక చేయడానికి కళాశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు పోటీలు నిర్వహించారు. అన్నింటా మౌనిక ప్రథమ స్థానంలో నిలిచింది.

**యూత్ పార్లమెంటు కోసం..**

దేశవ్యాప్తంగా యూత్‌పార్లమెంటు ఎంపిక కోసం వివిధ దశల్లో వర్చువల్ పద్ధతిలో ప్రసంగ పోటీలు నిర్వహించారు. మౌనికతోపాటు జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ నుంచి ఏడుగురికి అవకాశం కల్గింది. అందులో మౌనిక మూడోస్థానంలో మాట్లాడే అవకాశం వచ్చింది. మొదట కళాశాల స్థాయిలో పోటీలు నిర్వహించగా 'మేకిన్ ఇండియా- మేడిన్ ఇండియా' అంశాన్ని తీసుకుని ఉపన్యసించి ప్రథమ స్థానంలో నిలిచింది. తరువాత జిల్లా స్థాయి పోటీల్లో 'స్టార్టప్ ఇండియా- స్టాండప్ ఇండియా' అనే అంశంపై ప్రసంగించి ప్రథమ స్థానం సాధించింది. ఆ తరువాత రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా మొదటి స్థానం సాధించింది. తద్వారా పార్లమెంటులో మాట్లాడే అవకాశం లభించింది.

**పార్లమెంటు సెంట్రల్ హాల్ వేదికగా....**

యూత్ పార్లమెంటులో భాగంగా ఈ నెల 25న పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో కేతావత్ మౌనిక మాట్లాడాలని నిర్వాహకులు కోరారు. దీంతో 'ఐ యామ్ మౌనిక ఫ్రం తెలంగాణ' అంటూ ఇంగ్లీషులో తన ప్రసంగాన్ని మొదలుపెట్టింది. దివంగత ప్రధాని వాజ్‌పేయి గురించి మౌనిక చేసిన ప్రసంగానికి అద్భుతమైన స్పందన వచ్చింది. సాధారణ గిరిజన కుటుంబంలో పుట్టిపెరిగిన మౌనిక తల్లిదండ్రులు తమ చదువుల కోసం పడుతున్న శ్రమను చూసి కష్టపడి చదువుతూనే ప్రతిభకు కూడా పదును పెట్టుకుంటోంది. ఉన్నత విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయిలో నిలవాలన్న లక్ష్యంతో మౌనిక మామూలు చదువుతో పాటు ఇంగ్లీషు, హిందీ, తెలుగు భాషల్లో ప్రసంగాలు చేస్తూ ఎంతోమంది మన్ననలు అందుకుంది. యూత్ పార్లమెంటుకు ఎంపికై, తన అద్భుత ప్రసంగంతో ఆకట్టుకున్న మౌనికను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

– సేపూరి వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి


సాగుబడి
**పూర్వాషాఢ కార్తె :**
**డిసెంబర్ 29 నుంచి**



# టీ-17 పందులు సూపర్!

● రైతులకు వరంగా మారిన ఎస్వీవీయూ అభివృద్ధి చేసిన టీ-17 రకం సీమ పందుల జాతి
● సాధారణ పందుల కంటే రైతులకు రెట్టింపు ఆదాయం ● సీమ పందుల పెంపకంపై ఆసక్తి చూపుతున్న యువత

**పొరుగు రాష్ట్రాల రైతుల ఆసక్తి**



శాస్త్రీయ పద్ధతుల్లో సీమ పందుల పెంపకంపై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నాం. ఎస్వీవీయూ టీ-17 జాతి పందులకు మంచి డిమాండ్ ఉంది. పొరుగు రాష్ట్రాల రైతులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. పెంపకంలో మెళకువలతో పాటు వీటికి సంక్రమించే వ్యాధులను గుర్తించి తగిన చికిత్స, నివారణా చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పంది మాంసం ఉత్పత్తుల్లో ఉండే పోషక విలువలపై వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

**- డాక్టర్ కే.సర్జన్‌రావు (99890 51549)**, పరిశోధనా సంచాలకులు, ఎస్వీవీయూ, తిరుపతి

**రైతులకు నిరంతర శిక్షణ**



తిరుపతిలో పందుల పరిశోధనా కేంద్రం ఏర్పాటై 50 ఏళ్లవుతోంది. తాజాగా విడుదల చేసిన ఎస్వీవీయూ టీ-17 రకం పంది జాతికి మంచి డిమాండ్ ఉంది. దేశవాళీ పందులతో పోల్చుకుంటే రెట్టింపు ఆదాయం వస్తుంది. వీటి పెంపకంపై ఆసక్తి గల యువతకు, రైతులకు ఏడాది పొడవునా శిక్షణ ఇస్తున్నాం.

**-డాక్టర్ ఎం.కళ్యాణ్ చక్రవర్తి (94405 28060),**
సీనియర్ శాస్త్రవేత్త,
అఖిల భారత పందుల పరిశోధనా కేంద్రం,
తిరుపతి

తక్కువ పెట్టుబడితో తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఆర్జించే సీమ పందుల పెంపకంపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. తిరుపతిలో శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న పందుల పరిశోధనా కేంద్రం ఎస్వీవీయూ టీ-17 రకం సీమ పందుల జాతిని అభివృద్ధి చేసింది. శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ ఈ జాతి పందులను పెంచుతున్న రైతులు అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. యువ రైతులు సైతం ఆసక్తి చూపుతుండటం విశేషం.

**నెలకు రూ. లక్షకు పైగా నికరాదాయం**



నేనో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. రెండేళ్లుగా పశుపోషణ చేస్తున్నా. గతేడాది తిరుపతి పందుల పరిశోధనా కేంద్రం నుంచి 15 పిల్లలతో పాటు 5 పెద్ద పందులను కొని పెంపకం చేపట్టా. హాస్టళ్లు, హోటళ్ల నుంచి సేకరించే పదార్థాలను పందులకు మేపుతున్నాం. చూడి/పాలిచ్చే పందులకు విడిగా దాణా పెడతున్నా. నెలకు రూ. 49,400 ఖర్చవుతోంది. మాంసం ద్వారా రూ.1.40 లక్షలు, పంది పిల్లల అమ్మకం ద్వారా రూ.13,500 ఆదాయం వస్తోంది. ఖర్చులు పోను నెలకు రూ.లక్షకు పైగా నికరాదాయం వస్తోంది. పందుల పెంపకం లాభదాయకంగా ఉంది.

**- సుంకర రామకృష్ణ**, నూజివీడు, ఎన్టీఆర్ జిల్లా

పంది మాంసాన్ని 'పోర్క్' అంటారు. కండ (హమ్), వారు (బాకన్), సాసెజ్, నగ్గెట్స్, ప్యాటీస్, పోర్క్ పచ్చడి, బ్యాంబూ పోర్క్‌ల రూపంలో సీమ పంది ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నారు. వీటిలో మాంసకృత్తులు, విటమిన్లతో పాటు ఓలిక్ లినోలిక్ ఫాటీయాసిడ్స్ అధికంగా ఉంటాయి. పిల్లలు, వృద్ధులు, క్రీడాకారులకు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి సీమ పంది మాంసం ఉత్పత్తులు ఉపయోగపడతాయని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ నిపుణులు చెబుతున్నారు.

పందుల పెంపకాన్ని లాభదాయకం చేయడంతో పాటు కొత్త పంది రకాల అభివృద్ధికి తిరుపతిలోని పరిశోధనా కేంద్రం గడిచిన ఐదు దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తోంది. స్థానికంగా లభ్యమయ్యే వివిధ వ్యవసాయ ఉప ఉత్పత్తులను 10–15 శాతం వరకు పందుల దాణా తయారీకి వినియోగించి ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు నిరూపించారు. పందులకు సంక్రమించే మేంజ్ అనే చర్మ వ్యాధికి డోరోమెక్టిన్ అనే ఔషధాన్ని కనిపెట్టారు.

**మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తే...**



నేనో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. పందుల పెంపకంపై ఆసక్తితో తిరుపతి పరిశోధనా కేంద్రంలో శిక్షణ పొందాను. ఈ పరిశ్రమ ఎంతో లాభసాటిగా ఉందని గ్రహించాను. త్వరలో పందుల పెంపకం యూనిట్ పెడుతున్నా. మార్కెటింగ్‌పై మరింత అవగాహన కల్పిస్తే యువత ఆసక్తి కనపరుస్తారు.

**-జి.మహేష్,** గాజులమండ్యం, తిరుపతి జిల్లా

**20 శాతం మంది పోర్క్ తింటున్నారు**

దేశంలో 9 లక్షల మిలియన్ల పందులుంటే, ఆంధ్రప్రదేశ్‌లో 92 వేలున్నాయి. దేశంలో 22 శాతం మంది, రాష్ట్రంలో 11 శాతం మంది పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ మాంసాహారుల్లో పంది మాంసం తినే వారి సంఖ్య 18–20 శాతం ఉన్నారని అంచనా. ఏటా రూ.18 కోట్ల విలువైన 894 టన్నుల పంది మాంసం ఉత్పత్తులు మన దేశం నుంచి వియత్నాం, కాంగో, జర్మనీ వంటి దేశాలకు ఎగుమతవుతున్నాయి.

**ఒక పంది... 80 పిల్లలు...**

ఐదేళ్ల క్రితం విదేశీ జాతి పందులతో దేశవాళీ పందులను సంకరపరిచి ఎస్వీవీయూ టీ-17 (75 శాతం లార్జ్‌వైట్ యార్క్‌షైర్, 25 శాతం దేశవాళీ పంది) అనే కొత్త పంది జాతిని అభివృద్ధి చేశారు. వాడుకలో సీమ పందిగా పిలిచే వీటి పెంపకంపై రైతులు అమితాసక్తిని ప్రదర్శిస్తున్నారు. జీవిత కాలంలో ఈతకు 8 చొప్పున 10 ఈతల్లో 80 పిల్లలను పెడుతుంది.

పుట్టినప్పుడు 1.12 కేజీలుండే ఈ పంది పిల్ల వధించే సమయానికి 85 కేజీల వరకు బరువు పెరుగుతుంది. పది ఆడ, ఒక మగ పందిని కలిపి ఒక యూనిట్‌గా వ్యవహరిస్తారు. కేంద్రం నుంచి అభివృద్ధి చేసిన పందులకు సంబంధించి 400 యూనిట్లను రైతులకు పంపిణీ చేశారు. ప్రస్తుతం ఏపీలో రైతుల దగ్గర 20 వేల పైగా ఈ రకం పందులు పెరుగుతున్నాయి.

ఒక యూనిట్ దేశవాళీ పందుల పెంపకం ద్వారా సగటున ఏటా రూ. 3–3.5 లక్షల ఆదాయం వస్తుంటే, ఈ రకం సీమ పందుల పెంపకం ద్వారా రూ. 6–7 లక్షల ఆదాయం వస్తుంది. మాంసం రూపంలో అమ్మితే రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

**- పంపాన వరప్రసాదరావు,** సాక్షి, అమరావతి

# అ(వ్య)ర్థవంతంగా వరి సాగు!

వరి సాగుకు రసాయనిక ఎరువులు, మంచి నీరు అవసరం లేదు.. శుద్ధిచేసిన మున్సిపల్ మురుగు నీటిని క్రమం తప్పకుండా డ్రిప్ ద్వారా అందిస్తే చాలు.. చక్కని దిగుబడులూ వస్తాయి. ఇలా పండించిన వరి బియ్యంలో ప్రొటీన్ (ప్రొటీన్ రిచ్ రైస్) కూడా అధికంగా ఉంటుంది అంటున్నది జపాన్‌కు చెందిన యమగటా విశ్వవిద్యాలయం. అంతేకాదు, రసాయనిక వ్యవసాయం వల్ల వెలువడే కర్బన ఉద్గారాల్లో 70% వరకు తగ్గుతాయి అంటున్నారు 'యమగటా' శాస్త్రవేత్తలు. అర్బన్ వ్యర్థ జలాల పునర్వినియోగం ద్వారా రసాయనిక ఎరువులను, మంచి నీటిని నూటికి నూరు శాతం ఆదా చేసుకోగలగటం హర్షదాయకం. ముఖ్యంగా, వరి బియ్యాన్నే ప్రధాన ఆహారంగా తీసుకునే ఆసియా వాసులకు ఇదెంతో శుభవార్త. పైపులైన్ల ద్వారా నేరుగా వేరు వ్యవస్థకు సాగు నీరందించే మెరుగైన భూగర్భ నీటిపారుదల వ్యవస్థ ఉపయోగం గురించి కూడా యమగటా విశ్వవిద్యాలయం పరిశోధించటం విశేషం.

పట్టణాలు, నగరాల్లో జనావాసాల నుంచి వెలువడే మురుగు నీరు కానే కాదు. నిజానికి శుద్ధి చేసి తిరిగి వాడుకుంటే వ్యవసాయానికి ఇది గొప్ప పోషక జలంలా ఉపయోగపడుతుందని తమ పరిశోధనల ద్వారా నిరూపించారు యమగటా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. జపాన్‌లోని సురుయోకా నగరంలో ఈ విశ్వవిద్యాలయం ఉంది. జనావాసాల నుంచి వెలువడే మురుగు నీటిలో నుంచి హానికారక క్రిములు, భార లోహాలు వంటి కలుషితాలేవీ లేకుండా శుద్ధి చేసి వరి పొలాలకు డ్రిప్ ద్వారా అవసరం మేరకు నిరాటంకంగా అందించాలి. దీనితో పాటు, మురుగునీటిని శుద్ధి చేసే క్రమంలో వెలువడే బురదను కంపోస్టుగా మార్చి, ఆ సేంద్రియ ఎరువును సైతం వరి పొలాల్లో వేసుకుంటే చాలు. అంతకన్నా ఇంక ఏ ఎరువులూ అవసరం లేకుండా వరి పంటలో చక్కని దిగుబడులు సాధించవచ్చు. ఇందుకోసం వినూత్న నీటిపారుదల వ్యవస్థలను రూపొందించి, పరీక్షించి చక్కని ఫలితాలు సాధించాం అంటున్నారు 'యమగటా' పరిశోధకులు.

అర్బన్ మురుగు నీటిని శుద్ధి చేసి పునర్వినియోగించే వరి నీటిపారుదల వ్యవస్థలను అభివృద్ధి చేశారు. శుద్ధి చేసిన మురుగు నీటిని వరి పొలంలో సాధారణ పద్ధతిలో నీటిని నిల్వగట్టి పంటలు పండించారు. అదేవిధంగా, భూగర్భ పైపుల వ్యవస్థ ద్వారా వరి మొక్కల వేరు వ్యవస్థకు నేరుగా నీటిని పొదుపుగా అందించటం ద్వారా వరి సాగు చేసి పంట దిగుబడులు తీశారు.

ఒక్క మాటలో చెప్పాలంటే.. శుద్ధి చేసిన మురుగు నీరు కేవలం నీరు మాత్రమే కాదు, పోషకాలతో కూడిన జలం. తద్వారా రసాయనిక ఎరువుల వాడకాన్ని నూటికి నూరు శాతం నివారించవచ్చు. బోర్లు లేదా కాలువల ద్వారా ఇప్పుడు వరి సాగుకు వాడుతున్న మంచి నీటిని ఆదా చేసుకొని, ఇతర అవసరాలకు వాడుకోవచ్చు. దిగుబడులు తగ్గే అవకాశం లేదు. రసాయనిక సేద్యంలో పండించిన వరి బియ్యంలో కన్నా ఎక్కువ ప్రొటీన్‌తో కూడిన బియ్యం ఉత్పత్తి చేయవచ్చని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.



నీరు నిల్వగట్టి రసాయనాలతో పండించే వరి పొలాల నుంచి విడుదలయ్యే మీథేన్ ఉద్గారాలను 80%, నైట్రస్ ఆక్సైడ్ ఉద్గారాలను కనీసం 60% తగ్గించడానికి ఆస్కారం ఉందని 'యమగటా' పరిశోధనల్లో తేలింది. తద్వారా సాంప్రదాయ వరి పొలాల వల్ల పెరిగే భూతాపాన్ని 70% తగ్గించవచ్చని ఈ ప్రయోగాల్లో నిరూపితమైంది.

పట్టణాలు, నగరాల్లో జనావాసాల నుంచి వెలువడే వ్యర్థ జలాలను శుద్ధి చేసి పునర్వినియోగించడం ద్వారా తక్కువ ఖర్చుతోనే వరి పొలాలకు నీటిని, పోషకాలను అందించడం సాధ్యమేనని ఈ పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ సాంకేతికతపై యమగటా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ మేధోహక్కుల సంస్థ(వైపో) నుంచి పేటెంట్ పొందింది. వాతావరణ మార్పుల్ని దీటుగా ఎదుర్కొనేందుకు ఈ గ్రీన్ టెక్నాలజీ దోహదపడుతుందని అంతర్జాతీయ మేధోహక్కుల సంస్థ(వైపో) ప్రశంసించింది.

**ప్రొటీన్ గణనీయంగా పెరిగింది**

జనావాసాల నుంచి వెలువడే మురుగు నీటిని శుద్ధిచేసి వరి సాగులో డ్రిప్ ద్వారా ఉపయోగించినప్పుడు బియ్యంలో ప్రొటీన్లు, రాగి గణనీయంగా పెరిగాయి. పాషాణం సమస్య 50% తగ్గింది. శుద్ధిచేసిన మురుగు నీటితోపాటు, మురుగు నీటిని శుద్ధి చేసే క్రమంలో వెలువడే బురదతో తయారు చేసిన సేంద్రియ ఎరువులను వాడటం వల్ల భూసారం బాగుంది. లెడ్, జింక్, నికెల్, కాడ్మియం సమస్య రాలేదు. నీటి ఎద్దడి ఉండే ప్రాంతాల్లో వ్యర్థజలాలను శుద్ధి చేసుకొని వరిసాగుకు వాడుకోవటం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించవచ్చని మా అధ్యయనంలో నిర్ధారణ అయ్యింది.

**- నిండియా ఊబా,**
యమగటా విశ్వవిద్యాలయం, జపాన్

నిర్వహణ: **పంతంగి రాంబాబు,** సాగుబడి డెస్క్


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 276

మంగళవారం 27-12-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**నిఖత్ పసిడి పంచ్**

జాతీయ సీనియర్ బాక్సింగ్ 50 కేజీల విభాగంలో విజేతగా జరీన్ - 10లో



**వీడియోకాన్ ధూత్ అరెస్టు**


ఐసీఐసీఐ బ్యాంక్ రుణ మోసం కేసులో అరెస్టు చేసిన సీబీఐ - 11లో



**శాంతి ఫార్ములాకు మద్దతివ్వండి**

రష్యాతో యుద్ధం ముగిసి శాంతి నెలకొనేందుకు సహకారమందించాలని ప్రధాని మోదీని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కోరారు.

వివరాలు 6లో ▸



**అమెరికాను ముంచేసిన మంచు**

అమెరికా మంచు తుపాన్‌లో చిక్కుకొని ఇప్పటివరకు 48 మంది మృతి చెందారు. మృతుల్లో 27 మంది న్యూయార్క్ వాసులే.

వివరాలు 6లో ▸



**కరోనాతో చైనా ఉక్కిరిబిక్కిరి**

కోవిడ్ దెబ్బకు చైనా ఉక్కిరిబిక్కిరవుతోంది. పెద్ద సంఖ్యలో బాధితులు వైద్యం కోసం ఆస్పత్రుల బయట వేచిచూస్తున్నారు.

వివరాలు 6లో ▸



**కొరియా సరిహద్దుల్లో ఉద్రిక్తత**

తమ రాజధాని సియోల్‌కు అతి సమీపంలోకి చొచ్చుకువచ్చిన ఉత్తర కొరియా డ్రోన్లను దక్షిణ కొరియా సైన్యం తరిమి కొట్టింది.

వివరాలు 6లో ▸

# సర్వేతో సరికొత్త చరిత్ర

## దేశంలో వందేళ్ల తర్వాత చేపట్టిన మహాయజ్ఞం ఇది: సీఎం జగన్

## భూముల సమగ్ర సర్వే ఫలాలు ప్రజలకు కచ్చితంగా అందాలి

- మన వద్ద దేశంలో మరెక్కడా లేనంత మంది సర్వేయర్లు, సిబ్బంది.. అందువల్లే పనులు వేగంగా చేయగలుగుతున్నాం
- గ్రామ సచివాలయం యూనిట్‌గా సకాలంలో పూర్తి కావాలి
- సర్వేలో నాణ్యత ఉండాలి.. రాళ్ల తయారీ వేగం పెరగాలి
- అర్బన్ ప్రాంతాల్లోనూ వేగంగా నిర్వహించాలి
- 22 ఏ భూములు, ఇతర సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు వ్యక్తిగతంగా లేఖలు పంపాలి



భూములను సర్వే చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**సాక్షి, అమరావతి:** దేశంలో వందేళ్ల తర్వాత నిర్వహిస్తున్న భూముల సర్వేతో కొత్త చరిత్రను లిఖిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రీ సర్వే అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, ఈ మహాయజ్ఞం ఫలాలు ప్రజలకు కచ్చితంగా అందాలని స్పష్టం చేశారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష (భూముల సమగ్ర రీసర్వే) పథకంపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సోమవారం సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆ వివరాలివీ..

**తొలివిడత గ్రామాల్లో జనవరికి పత్రాలు**

'రీ సర్వే అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమం. వందేళ్ల తర్వాత మళ్లీ సర్వే చేస్తున్నాం అంటే నిజంగానే కొత్త చరిత్ర లిఖిస్తున్నట్లే. సర్వేలో కచ్చితంగా నాణ్యత ఉండాలి. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనంత మంది సర్వేయర్లు, సిబ్బంది మన వద్ద అందుబాటులో ఉన్నందున వేగంగా

మిగతా 2వ పేజీలో ▶

### నేడు ఢిల్లీకి సీఎం వైఎస్ జగన్

- ప్రధాని మోదీతో రేపు భేటీ
- పెండింగ్ అంశాలపై చర్చ

2లో

# మల్లన్న సేవలో రాష్ట్రపతి ముర్ము

## భక్తి శ్రద్ధలతో శ్రీశైల భ్రమరాంబ, మల్లిఖార్జున స్వాముల వార్ల దర్శనం

- రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు
- రూ.43.08 కోట్లతో చేపట్టిన ప్రసాద్ ప్రాజెక్టు శిలాఫలకం ఆవిష్కరణ
- గిరిజనులతో ముఖాముఖి.. సంక్షేమం, జీవన విధానంపై ఆరా
- ప్రభుత్వ ప్రోత్సాహంతో విద్యార్థుల చదువులు బాగున్నాయన్న అడవిబిడ్డలు
- ప్రభుత్వం తరఫున స్వాగతం పలికిన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- రాష్ట్రపతి వెంట కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ తమిళిసై



రాష్ట్రపతికి, తెలంగాణ గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, నాయకులు

**సాక్షి ప్రతినిధి, కర్నూలు:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి వార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, ఆలయ అధికారులు ప్రత్యేక గౌరవ లాంఛనాలతో దర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. మ.12.45 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో సున్నిపెంటకు చేరుకున్న రాష్ట్రపతికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ తమిళిసైతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీశైల ప్రధాన ఆలయంలోకి ప్రవేశించిన తర్వాత ముందుగా రత్నగర్భగణపతి స్వామిని రాష్ట్రపతితో పాటు తెలంగాణ గవర్నర్ దర్శించుకున్నారు. అనంతరం శ్రీ మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ అభిషేకాలు నిర్వహించి

మిగతా 2వ పేజీలో ▶

## న్యూస్‌రీల్


### రంగాను చంపింది టీడీపీయే



పేదల కోసం పాటుపడిన వంగవీటి మోహన రంగాను తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీలోని నాయకులే అత్యంత దారుణంగా హత్య చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని గుర్తు చేశారు. వారే ఇప్పుడు రంగా విగ్రహాలకు దండలు వేసి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.

వివరాలు 3 ▸

### డిజిటల్ గ్రంథాలయాలు సాహసోపేత నిర్ణయం




రాష్ట్రంలో గ్రంథాలయ వ్యవస్థ డిజిటలీకరణ సాహసోపేత నిర్ణయమని పారిస్‌కు చెందిన పరిశోధకుడు డానియల్ నేజర్స్ ప్రశంసించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, సాంస్కృతిక వికాసానికి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు.

వివరాలు 3 ▸

### భారీగా గంజాయి ధ్వంసం



ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా దాడులు చేసి పట్టుకున్న గంజాయిని విశాఖ, తిరుపతి జిల్లాల పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. విశాఖ జిల్లాలో 21,961 కిలోలు, తిరుపతి జిల్లాలో 1,174 కిలోల గంజాయికి నిప్పు పెట్టారు.

వివరాలు 5 ▸

### ఎమ్మెల్యేలకు ఎర కేసు సీబీఐకి




ఎమ్మెల్యేలకు ఎర కేసును సీబీఐకి బదిలీకి చేస్తూ తెలంగాణ హైకోర్టు సోమవారం ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు విచారణ నిమిత్తం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీఓను రద్దు చేసింది. ఇకపై ఈ కేసులో ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సిట్‌కు ఆదేశించింది.

వివరాలు 12 ▸



# విలేజ్ క్లినిక్స్ కేంద్రంగా కరోనా కట్టడి

## నిర్ధారణ పరీక్షలు, మెడికేషన్ సేవలు కూడా అక్కడే: సీఎం జగన్

- వైద్య ఆరోగ్య శాఖ ఎస్‌వోపీలు సిద్ధం చేయాలి
- కరోనా జాగ్రత్తలపై ప్రజలకు మళ్లీ విస్తృత అవగాహన
- ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకూడదు
- కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణ పనులు ఇక వేగవంతం
- జనవరి 26 నాటికి అన్ని చోట్లా పనులు ప్రారంభం కావాలి




**సాక్షి, అమరావతి:** వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు కేంద్రంగా గ్రామ స్థాయిలోనే సమర్థంగా కరోనా నివారణ, నియంత్రణ, చికిత్స చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా నిర్దిష్ట నిర్వహణ విధానాలు (ఎస్‌వోపీ) రూపొందించాలని అధికారులకు సూచించారు. కోవిడ్ నిర్ధారణ పరీక్షలు, మెడికేషన్, ఇతర సేవలు విలేజ్ క్లినిక్‌ల స్థాయిలోనే ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కరోనా నియంత్రణకు ముందస్తు సన్నద్ధత, ఇతర అంశాలపై సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సీఎం జగన్ సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆ వివరాలివీ..

**విస్తృత అవగాహన.. సదుపాయాల తనిఖీ**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణలో విలేజ్ క్లినిక్‌లు పని చేయాలి. వీటిలో ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు అందుబాటులో ఉండాలి. మాస్కులు ధరించడం, చేతులు శుభ్రం చేసుకోవడం, ఇతర కరోనా నియంత్రణ చర్యలపై ప్రజలకు మళ్లీ విస్తృత అవగాహన కలిగించాలి. కరోనా అనుమానిత లక్షణాలు

మిగతా 2వ పేజీలో ▶

# నోటీసులకు మార్గదర్శి సమాధానం ఇవ్వాల్సిందే

### నాలుగు వారాల్లో జవాబు ఇవ్వండి

- మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు హైకోర్టు ఆదేశం
- మార్గదర్శి సమాధానంపై నిష్పాక్షికంగా వ్యవహరించండి
- అప్పటి వరకు ఎలాంటి బలవంతపు చర్యలొద్దు
- అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చిన న్యాయస్థానం



**సాక్షి, అమరావతి:** చిట్‌ల నిర్వహణలో పలు అవకతవకలను ఎత్తిచూపుతూ రిజిస్ట్రార్లు ఈ నెల 20న జారీ చేసిన నోటీసులకు నాలుగు వారాల్లో సమాధానం ఇచ్చి తీరాల్సిందేనని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను హైకోర్టు ఆదేశించింది. చిట్‌ఫండ్ చట్టం సెక్షన్ 46(3)లో నిర్దేశించిన విధి విధానాలను అనుసరించి మార్గదర్శి వివరణ విషయంలో నిష్పాక్షికంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించింది. అప్పటి వరకు మార్గదర్శి విషయంలో ఎలాంటి బలవంతపు చర్యలు వద్దని అధికారులకు చెప్పింది. అనుమతి, రిజిస్ట్రేషన్, డాక్యుమెంట్ల స్వీకరణ, సెక్యూరిటీ డిపాజిట్ విడుదల తదితర విషయాల్లో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని తెలిపింది. అనుబంధ వ్యాజ్యాలపై తదుపరి విచారణను జనవరి 19కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అనుబంధ వ్యాజ్యాల్లోని పూర్వాపరాల జోలికి ప్రస్తుతం వెళ్లడంలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు.

**పెనాల్టీ వద్దంటూ అనుబంధ వ్యాజ్యాలు**

చిట్స్ వ్యవహారంలో అధికారులు నిబంధనల మేర నడుచుకోవడంలేదంటూ మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ అధీకృత అధికారి బి.శ్రీనివాసరావు దాఖలు చేసిన పిటిషన్, ఎలాంటి పెనాల్టీ విధించకుండా ఉండటంతో పాటు ప్రతి దశలోనూ నిబంధనల ప్రకారం నడుచుకునేలా అధికారులను ఆదేశించాలంటూ దాఖలు చేసిన

మిగతా 12వ పేజీలో ▶




# రాష్ట్రంలో 5జీ

### జియో ట్రూ పేరిట అందుబాటులోకి తీసుకొచ్చిన రిలయన్స్

- విజయవాడలో ప్రారంభించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- తొలుత విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుమల కొండపై 5జీ సేవలు
- ఏడాదిలో గిరిజన ప్రాంతాలకు 5జీ సేవల లక్ష్యం
- విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి హామీ

12లో

## ఇదం జగత్




... లాలూ మీద ఎలాగూ కేసులు తిరగ తోడుతున్నాం కదా! ఆఫీసు అవసరమే సార్!!

•కృష్ణా జలాలపై

# తెలంగాణ సర్కారు తొండాట

## 66:34 నిష్పత్తిలో నీటిని పంచుకోవడానికి గతంలో తెలంగాణ అంగీకారం

- ఇప్పుడు 50 శాతం వాటా కావాలని డిమాండ్
- ఏ ఏడాదికి ఆ ఏడాదికే నీటి లెక్కలు ముగుస్తాయన్న కృష్ణా బోర్డు
- వాడుకోని నీటిని మరుసటి ఏడాది కేటాయించాలని డిమాండ్
- హైదరాబాద్‌కు వాడే నీటిలో 20 శాతమే లెక్కించాలంటూ పాత పల్లవి
- ఆర్డీఎస్ డిజైన్ లోపాలను సరి చేయకుండా ఆధునీకరణకు మంకుపట్టు.. ఆర్డీఎస్ కుడి కాలువ ఏపీ చేపట్టకూడదని డిమాండ్
- 11న జరిగే బోర్డు సమావేశం అజెండాలో వీటిని చేర్చాలని లేఖ



**సాక్షి, అమరావతి:** కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం తొండాటకు దిగుతోంది. జలాల్లో వాటా నుంచి క్యారీ ఓవర్ జలాల వినియోగం వరకు అన్ని వివాదాల పరిష్కారానికి కృష్ణా బోర్డు సమావేశాల్లో పలు మార్లు అంగీకరించి.. ఇప్పుడు అడ్డం తిరిగింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో కృష్ణా జలాల్లో సగం వాటా కేటాయించాలని, క్యారీ ఓవర్ జలాలను వాడుకోవడానికి అనుమతించాలని కృష్ణా బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్‌కు తెలంగాణ ఈఎన్‌సీ సి.మురళీధర్ లేఖ రాశారు. ఏడు అంశాలను ఈనెల 11న నిర్వహించే కృష్ణా బోర్డు 17వ సర్వ సభ్య సమావేశం అజెండాలో చేర్చాలని కోరారు. ఇప్పటికే పరిష్కారమైన

మిగతా 3వ పేజీలో ▶

# మార్చి 15 నుంచి ఇంటర్ పరీక్షలు



12లో

- 15 నుంచి ఫస్ట్ ఇయర్, 16 నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం
- ఏప్రిల్ 4తో ముగియనున్న పరీక్షలు
- ఏప్రిల్ 15 నుంచి ప్రాక్టికల్స్
- జేఈఈ మెయిన్‌తో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రాక్టికల్స్ మార్పు

# ఇంటిపన్ను వసూళ్లు ఆన్‌లైన్‌లోనే

- ప్రయోగాత్మకంగా 15 పంచాయతీల్లో అమలు.. పీవోఎస్ మిషన్ల ద్వారా ఇంటిపన్ను వసూళ్లు
- క్యూఆర్ కోడ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులకు వీలు.. ఆన్‌లైన్‌లో వసూళ్లకు యూనియన్ బ్యాంకు సహకారం

2లో



## క్లుప్తంగా...

### నేడు ఢిల్లీకి సీఎం జగన్

- ప్రధానితో రేపు భేటీ
- పెండింగ్ అంశాలపై చర్చ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. రాత్రికి ఢిల్లీలోని జనపథ్-1లో తన నివాసంలో బస చేస్తారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి జగన్ సమావేశం అవుతారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన పలు అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళతారని అధికారవర్గాలు తెలిపాయి.

### కొత్తగా రెండు యూడీఏల ఏర్పాటు

- బాపట్ల కేంద్రంగా బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ..
- నరసరావుపేట కేంద్రంగా పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రాభివృద్ధిలో భాగంగా అభివృద్ధి కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మరో రెండు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసింది. బాపట్ల కేంద్రంగా బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బౌడా)ని, నరసరావుపేట కేంద్రంగా పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా)ని ఏర్పాటు చేస్తూ సోమవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. రెండు మున్సిపాలిటీల పరిధితో పాటు 14 మండలాల్లోని 163 గ్రామాలతో మొత్తం 1864.09 చ.కి.మీ విస్తీర్ణంతో 'బౌడా' ఏర్పాటు చేశారు. పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని 8 యూఎల్బీలు, 28 మండలాల్లోని 349 గ్రామాలతో 7,281.31 చ.కి.మీ పరిధిలో ఏర్పాటు చేశారు. కాగా ఇప్పటికే రాష్ట్రంలో 17 యూడీఏలు ఉండగా, కొత్తగా ఏర్పాటైన రెండు యూడీఏలతో ఆ సంఖ్య 19కి చేరింది.

### ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకూ ఆయిల్‌పామ్ విస్తరణ

- ప్రస్తుతం 236 మండలాల్లో సాగు
- మరో 117 మండలాల్లో విస్తరణ
- కొత్త మండలాలను నోటిఫై చేసిన ప్రభుత్వం
- రైతులకు రూ.617.50 కోట్ల మేర ఆర్థిక చేయూత

సాక్షి, అమరావతి: నీటి సౌకర్యం గల ప్రతి ప్రాంతంలోనూ ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు ఉభయ గోదావరి, ఏలూరు, కోనసీమ, కాకినాడ, కృష్ణా జిల్లాలకే పరిమితమైన ఆయిల్‌పామ్ సాగును ఇకపై ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ పరిధిలోని అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోనూ విస్తరించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 17 జిల్లాల పరిధిలో 236 మండలాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుండగా.. తాజాగా మరో 117 మండలాలను నోటిఫై చేశారు. ఆయిల్‌పామ్ సాగులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా 9 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు ఉండగా.. ఏపీలో 4.81 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. తాజాగా నోటిఫై చేసిన 117 మండలాల్లో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మండలాల పరిధిలో రానున్న నాలుగేళ్లలో రూ.617.50 కోట్లను రైతులకు ప్రోత్సాహకాల రూపంలో అందజేస్తారు. ఆయిల్‌పామ్ మొక్కల కొనుగోలు, అంతర పంటల సాగు, నిర్వహణ, యాంత్రీకరణ కోసం ఈ నిధులను వినియోగిస్తామని వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ వై.మధుసూదనరెడ్డి వెల్లడించారు.

### ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఫేషియల్ రికగ్నిషన్

- జనవరి 16 నుంచి అన్ని క్యాడర్ ఉద్యోగులకు
- 21 నుంచి సచివాలయం, హెచ్‌వోడీలు, జిల్లా అధికారులకు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు


సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి సోమవారం రాత్రి జీవో ఎంఎస్ నం.159 జారీచేశారు. సచివాలయం నుంచి కలెక్టరేట్‌ల వరకు, రాష్ట్ర, జిల్లాస్థాయి విభాగాధిపతుల నుంచి అన్ని క్యాడర్ల ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు తప్పనిసరి చేశారు. జనవరి 16వ తేదీ నుంచి అన్ని క్యాడర్ ఉద్యోగులకు, 21వ తేదీ నుంచి సచివాలయం, హెచ్‌వోడీలు, జిల్లాస్థాయి అధికారులకు వర్తింపజేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### 715 పరీక్షలు.. సున్నా కేసులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో (ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సోమవారం ఉదయం తొమ్మిది గంటల వరకు) 715 నమూనాలకు కరోనా పరీక్షలు నిర్వహించగా ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు యాక్టివ్ కేసులున్నాయి. వైద్యశాఖ ఇప్పటివరకు 33,96,66,264 నిర్ధారణ పరీక్షలు చేపట్టింది.

# అర్హులందరికీ న్యాయం

- పలు కారణాలతో మిగిలిపోయిన అర్హులకూ పథకాల ప్రయోజనం
- నేడు 2.79 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.590.91 కోట్లు
- బటన్ నొక్కి నేరుగా ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్




సాక్షి, అమరావతి: అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కారాదనే స్థిర సంకల్పంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పిలిచి మరీ ప్రయోజనాలను అందచేస్తోంది. ఇందులో భాగంగా అర్హులైనప్పటికీ ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని వారికి మరో అవకాశం కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 2,79,065 మందికి రూ.590.91 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేయనున్నారు. సాధ్యమైనంత వరకు పథకాలను ఎలా ఎగ్గొట్టాలనే గత పాలకుల ఆలోచనలకు పూర్తి భిన్నంగా అర్హులందరికీ వంద శాతం సంతృప్త స్థాయిలో సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన కొనసాగుతోంది.

- ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాలు అందని వారు ఆ పథకం ద్వారా లబ్ధి చేకూర్చిన నెలలోపు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వెరిఫై చేసి ప్రభుత్వం ఏటా రెండు దఫాలు ప్రయోజనాన్ని అందచేస్తోంది. డిసెంబర్ నుంచి మే వరకు అమలైన సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిని జూన్‌లో అందిస్తుండగా జూన్ నుంచి నవంబర్ వరకు అమలైన పథకాల ప్రయోజనాన్ని మిగిలిపోయిన అర్హులకు డిసెంబర్‌లో అందిస్తోంది.
- దీంతోపాటు కొత్తగా జూన్ 22 నుంచి నవంబర్ వరకు పెన్షన్ కార్డులు, బియ్యం కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు, ఇళ్ల పట్టాలకు సంబంధించి అర్హుల వెరిఫికేషన్ ప్రస్తుతం జరుగుతోంది. ఈ నెల 30వ తేదీన తుది జాబితాను ప్రకటిస్తారు. జనవరి 1 నుంచి పెంచిన పెన్షన్‌తో పాటు అన్ని కార్డులను వలంటీర్లు ఇంటికే వచ్చి అందిస్తారు.

**తేడా గమనించండి**

- గతంలో జన్మభూమి కమిటీలు ఆమోదించిన వారికి, అస్మదీయులకు మాత్రమే సంక్షేమ ఫలాలతో లబ్ధి. లంచాలమయంగా పథకాల అమలు. వీలైనంత మందికి ఎగ్గొట్టడమే లక్ష్యం. గ్రామంవారీగా లబ్ధిదారుల సంఖ్యపై పరిమితి. ఎవరైనా చనిపోతేనే కొత్త వారికి అవకాశం. నాడు అరకొర పథకాలే.. లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర కాలయాపన.. ఏది కావాలన్నా లంచాలే. సంక్షేమ పథకాల కోసం ఆత్మాభిమానాన్ని చంపుకుని వృద్ధులు, దివ్యాంగులు, అక్కచెల్లెమ్మలు కాళ్లరిగేలా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి మోకరిల్లాల్సిన దీనస్థితి. కనికరం కూడా లేకుండా పెన్షన్లలోనూ వాటాల వసూలు.
- ఇప్పుడు కులమతాలు, పార్టీలకు అతీతంగా వివక్ష లేకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలతో లబ్ధి. ఏ కారణం చేతనైనా ప్రయోజనం పొందని అర్హులకు మరో అవకాశాన్ని కల్పిస్తూ ఏటా జూన్, డిసెంబర్‌లో లబ్ధి చేకూరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.
- దళారీలు, పైరవీకారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పని లేదు. గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించి సోషల్ ఆడిట్ ద్వారా పారదర్శకంగా ఎంపిక. నేరుగా లబ్ధిదారుల అన్ ఇన్‌కంబర్డ్ (గత రుణాలతో నిమిత్తం లేకుండా) ఖాతాలకు నగదు జమ.
- సంక్షేమ క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి నిర్దిష్ట సమయంలో టంచన్‌గా పంపిణీ. ఆత్మాభిమానాన్ని నిలబెడుతూ ఇంటివద్దే వలంటీర్ల సేవలు.

**పలు కారణాలతో మిగిలిపోయిన అర్హులకు నేడు చేకూరుస్తున్న లబ్ధి ఇలా..**

| పథకం | లబ్ధిదారుల సంఖ్య | లబ్ధి రూ.కోట్లలో |
|---|---|---|
| వైఎస్సార్ ఈబీసీ నేస్తం | 863 | 1.29 |
| జగనన్న చేదోడు | 725 | 0.73 |
| వైఎస్సార్ మత్స్యకార భరోసా | 4,457 | 4.46 |
| జగనన్న విద్యాదీవెన | 1,22,833, | 225.05 |
| జగనన్న వసతి దీవెన | 18,697 | 16.35 |
| జగనన్న అమ్మ ఒడి | 43,710 | 56.82 |
| వైఎస్సార్ కాపు నేస్తం | 17,351 | 26.03 |
| వైఎస్సార్ వాహనమిత్ర | 9,005 | 9.00 |
| వైఎస్సార్ చేయూత | 30,837 | 57.82 |
| వైఎస్సార్ నేతన్న నేస్తం | 2,577 | 6.18 |
| డా. వైఎస్సార్ ఉచిత పంటల బీమా | 28,010 | 187.18 |
| మొత్తం | 2,79,065 | 590.91 |

### సామాజిక పింఛన్ రూ.2,750కి పెంపు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- జనవరి 1 నుంచి జరిగే పింఛన్ల పంపిణీతోనే అమల్లోకి..

సాక్షి, అమరావతి: అవ్వాతాతలతో పాటు వితంతు, ఒంటరి మహిళ, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు తదితరులకు ప్రతి నెలా ఒకటో తేదీన ఇచ్చే సామాజిక పింఛన్ మొత్తాన్ని రూ.2,500 నుంచి రూ. 2,750కి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో నంబర్ 113 జారీ చేసింది. జనవరి 1వ తేదీ నుంచి జరిగే పింఛన్ పంపిణీతోనే ఈ పెంపు అమలవుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీకి గాను ప్రభుత్వం ఇప్పటివరకు ప్రతి నెలా రూ.1,594 కోట్లకు పైగా ఖర్చు చేస్తుండగా.. తాజా పెంపుతో ప్రతి నెలా అదనంగా మరో రూ.131.44 కోట్లు చొప్పున భారం పడుతుందని సెర్ప్ అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నారు.

## గ్రామాల్లో ఇంటిపన్ను వసూళ్లు ఆన్‌లైన్‌లోనే

సాక్షి, అమరావతి: గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా ఇంటిపన్నును ఆన్‌లైన్‌లోనే వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా 15 జిల్లాల్లో ఒక్కొక్కటి వంతున 15 గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ విధానంలో ఇంటిపన్ను వసూలు చేయనున్నారు. ఇందుకోసం పంచాయతీరాజ్ శాఖ 15 పంచాయతీలను ఎంపిక చేసింది. ఆ వివరాలను జిల్లా పంచాయతీ అధికారుల ద్వారా సంబంధిత పంచాయతీ అధికారులకు తెలిపింది. తర్వాత దశలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఆన్‌లైన్‌లోనే ఇంటిపన్ను వసూళ్లకు కసరత్తు చేస్తోంది. పన్ను వసూలుకు పంచాయతీ సిబ్బంది పాయింట్ ఆఫ్ సేల్ డివైసెస్ (పీవోఎస్ మిషన్లు) ఉపయోగిస్తారు. వీటిని యూనియన్ బ్యాంకు సరఫరా చేస్తోంది. ఇంటి యజమానులు ఈ మిషన్ల ద్వారా పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే వంటివాటితో క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి పన్ను చెల్లించవచ్చు. డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా కూడా చెల్లింపులకు అవకాశం ఉంది.

**ఆన్‌లైన్‌లో చెల్లింపుల తీరు..**

- గ్రామాల వారీగా ఇంటి యజమానుల వివరాలు, ఇంటి విస్తీర్ణం, భవన నిర్మాణం తీరు ఆధారంగా గ్రామ పంచాయతీ ముందుగా నిర్ధారించిన ఇంటిపన్ను వివరాలతో కూడిన సమాచారాన్ని పీవోఎస్ మిషన్లతో అనుసంధానం చేసిన సాఫ్ట్‌వేర్‌లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు అప్‌లోడ్ చేస్తారు.
- పంచాయతీ తన పరిధిలోని ప్రతి ఇంటికి ప్రత్యేక కోడ్ నంబరు కేటాయిస్తుంది. ఇంటిపన్ను వసూలు చేసే సమయంలో ఆ పంచాయతీ కార్యదర్శి లేదంటే బిల్లు కలెక్టరు సంబంధిత ఇంటి కోడ్ నంబరును పీవోఎస్ మిషన్‌లో నమోదు చేయగానే వారు చెల్లించాల్సిన పన్ను వివరాలు మిషన్ స్క్రీన్‌పై కనిపిస్తాయి.
- పీవోఎస్ మిషన్‌లో ఆ పన్ను చెల్లింపునకు సంబంధించి బటన్ నొక్కాలి. ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే మార్గాలను ఎంచుకుని క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసిగానీ, డెబిట్ లేదా క్రెడిట్ కార్డును అనుసంధానం చేసిగానీ చెల్లించవచ్చు.
- ఇలా చెల్లించే డబ్బులు ఆ పంచాయతీ బ్యాంకు ఖాతాలో జమయ్యేలా పంచాయతీల వారీగా యూనియన్ బ్యాంకులో ప్రత్యేక ఖాతాలు తెరుస్తున్నారు. ఈ ఖాతాల్లో జమయ్యే డబ్బులు నేరుగా మళ్లీ సంబంధిత పంచాయతీ పేరిట ఉండే ట్రెజరీ అకౌంట్‌కు చేరే ఏర్పాట్లుంటాయి.


**ప్రయోగాత్మక అమలుకు ఎంపిక చేసిన 15 పంచాయతీలు..**

కంకిపాడు(కృష్ణా జిల్లా), గొల్లపూడి(ఎన్టీఆర్ జిల్లా), పెదకాకాని(గుంటూరు జిల్లా), పడుగుపాడు (నెల్లూరు), వట్లూరు(పశ్చిమ గోదావరి), తుమ్మపాల( విశాఖపట్నం), చింతపల్లి(మన్యం), శ్రీకూర్మం(శ్రీకాకుళం), గుణకలం(విజయనగరం), బి.కొట్రగడ్డ(అల్లూరి సీతారామరాజు), యర్రగొండపాలెం (ప్రకాశం), ఇప్పపెంట (వైఎస్సార్), దిన్నెదేవరపాడు (కర్నూలు), రాజీవ్‌కాలనీ (అనంతపురం), బంగారుపాలెం (చిత్తూరు).

# కరోనా నియంత్రణకు సన్నద్ధం

సాక్షి, అమరావతి: చైనాతోపాటు మరికొన్ని దేశాల్లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఇప్పటికే కరోనా నియంత్రణపై రాష్ట్ర వైద్యశాఖ ముందు జాగ్రత్త చర్యలను ప్రారంభించింది. ఇదే క్రమంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలని నిర్ణయించింది. మాక్‌డ్రిల్ నిర్వహణ, కరోనా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలకు వైద్య, ఆరోగ్యశాఖ సోమవారం ఆదేశాలు జారీచేసింది. కరోనా కేసులు పెరిగితే ఆస్పత్రుల్లో ఉన్న సదుపాయాలు, నియంత్రణ కోసం చేయాల్సిన ఏర్పాట్లు, సన్నద్ధతపై సమీక్షించుకోవడమే ఈ మాక్ డ్రిల్ నిర్వహణ ముఖ్య ఉద్దేశం. మాక్ డ్రిల్‌లో భాగంగా అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ ఆస్పత్రులు ఉన్నాయా.. లేదా.. అని పరిశీలిస్తారు. ఆయా ఆస్పత్రుల్లో ఐసీయూ, ఆక్సిజన్, సాధారణ పడకల సామర్థ్యం, వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ల్యాబ్‌లలో కరోనా పరీక్షల సామర్థ్యం, ఆర్టీపీసీఆర్, ఆర్ఏటీ కిట్స్, పరీక్షల నిర్వహణకు అవసరమైన రీఏజెంట్స్ సరిపడా అందుబాటులో ఉన్నాయా.. లేదా.. అని చూస్తారు. తప్పనిసరి మందులు, వెంటిలేటర్లు, పీపీఈ కిట్లు, ఎన్-95 మాస్క్‌లు, ఇతర మందులు, సర్జికల్స్ నిల్వలను పరిశీలిస్తారు. ఆక్సిజన్ కాన్సెంట్రేటర్‌లు, సిలిండర్‌లు, పీఎస్ఏ ప్లాంట్‌లు, లిక్విడ్ ఆక్సిజన్ స్టోరేజ్ ట్యాంక్, మెడికల్ గ్యాస్ పైప్‌లైన్ వ్యవస్థ గురించి తెలుసుకుంటారు. ఆక్సిజన్ నాణ్యత, పైప్‌లైన్ ఏ విధంగా ఉన్నాయనేది కూడా చూస్తారు.

**నేడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో మాక్ డ్రిల్**



### జీనోమ్ ల్యాబ్‌కు విదేశీ ప్రయాణికులకు నమూనాలు

ప్రతి అంతర్జాతీయ విమానంలో విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల్లో ర్యాండమ్‌గా రెండు శాతం మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయాలని అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్న జిల్లాల డీఎంహెచ్‌వోలకు సోమవారం వైద్యశాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వ్యక్తుల నమూనాలను విజయవాడలోని జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌కు పంపాలని ఆదేశించింది. ర్యాండమ్ పరీక్షల నుంచి 12ఏళ్లలోపు పిల్లలను మినహాయించింది. రాష్ట్రంలోని గన్నవరం, విశాఖపట్నం, రేణిగుంట, కర్నూల్, కడప, రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టులలో ప్రయాణికులందరికీ థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించాలని ఆయా జిల్లాల డీఎంహెచ్‌వోలకు ఆదేశాలు జారీచేసింది. పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వ్యక్తులను కరోనా నిబంధనలకు అనుగుణంగా ఐసోలేషన్‌లో ఉంచాలంది. అంతర్జాతీయ ప్రయాణాలు చేసి వచ్చిన వారికి కరోనా అనుమానిత లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రిని సంప్రదించాలని, లేదా 104కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చి సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలిపింది.

# సర్వేతో సరికొత్త చరిత్ర

▶ మొదటి పేజీ తరువాయి

చేయగలుగుతున్నాం. తొలివిడత సర్వే పూర్తైన 2 వేల గ్రామాలకు సంబంధించి భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం జనవరి నాటికి పూర్తి కావాలి' అని సీఎం సూచించారు.

**మరో 2 వేల గ్రామాల్లో..**

సర్వే పూర్తయిన రెండు వేల గ్రామాల్లో ఇప్పటివరకు 2 లక్షల మ్యుటేషన్లు, 92 వేల ఫస్ట్ టైం ఎంట్రీస్ జరిగాయని, 7,29,000 మందికి భూహక్కు పత్రాలు అందజేశామని అధికారులు తెలిపారు. 4.30 లక్షల సబ్ డివిజన్లు పూర్తి కాగా 19 వేల భూ వివాదాలు పరిష్కారమయ్యాయని వివరించారు. ఫలితంగా ప్రజలకు రూ.37.57 కోట్ల మేర డబ్బు ఆదా అయిందని వెల్లడించారు. మరో 2 వేల గ్రామాల్లో రీసర్వే ప్రక్రియకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను అధికారులు సీఎంకు తెలియచేశారు. 2023 ఫిబ్రవరి 15 నాటికి సర్వే పూర్తి చేసి అదే నెల చివరికల్లా భూహక్కు పత్రాలను కూడా అందజేస్తామని చెప్పారు.

**గ్రామ సచివాలయం యూనిట్‌గా..**

సమగ్ర సర్వేను సకాలంలో పూర్తి చేసేందుకు సిబ్బంది కొరత లేకుండా చూడాలని సీఎం జగన్ సూచించారు. గ్రామ సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని కావల్సినంత మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 వేల గ్రామ, వార్డు సచివాలయాల్లో తగినంత సిబ్బందిని సమకూర్చుకుని ఖాళీలున్న చోట వెంటనే నియామకాలు చేపట్టాలని ఆదేశించారు.

**సమస్యలు పరిష్కారమైన లబ్ధిదారులకు వ్యక్తిగత లేఖలు..**

'ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న '22 ఏ' భూములు, ఇతర సమస్యలను పరిష్కరించి హక్కు పత్రాలు అందజేసిన లబ్ధిదారులకు లేఖలు రాయాలి. వారికి జరిగిన మేలును వివరిస్తూ లబ్ధి పొందిన ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత లేఖలు పంపాలి. సర్వే రాళ్ల ఉత్పత్తి వేగాన్ని పెంచాలి. రాళ్ల తయారీ వేగం పెరిగేలా భూగర్భ గనుల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇందులో ఎలాంటి జాప్యానికి తావుండరాదు' అని సీఎం జగన్ స్పష్టం చేయగా మార్చికల్లా సర్వేకు అవసరమైన రాళ్లు సిద్ధంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

**పట్టణ ప్రాంతాల్లో సర్వేపై..**

అర్బన్ ప్రాంతాల్లోనూ భూముల సర్వేను వేగవంతం చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. 123 కార్పొరేషన్లు, మున్సిపాల్టీల పరిధిలో 4,119 వార్డు సచివాలయాల్లో సర్వే బృందాల ఏర్పాటు, శిక్షణ ఇప్పటికే పూర్తయిందని అధికారులు తెలిపారు.


తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

హద్దుల మార్కింగ్, రోవర్ల సహాయంతో జీసీపీ ఐడెంటిఫికేషన్ ప్రక్రియను 2023 జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేస్తామన్నారు. ఇప్పటివరకు 123 కార్పొరేషన్లు, మున్సిపాల్టీల పరిధిలో 1,16,685 ప్రభుత్వ, పోరంబోకు ల్యాండ్ పార్సిల్స్‌కు సంబంధించి 3,37,702 ఎకరాలను గుర్తించినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. 2023 జూలై నాటికి పట్టణ ప్రాంతాల్లో సమగ్ర సర్వే హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ జి.సాయిప్రసాద్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, సర్వే సెటిల్మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్, పంచాయతీరాజ్ కమిషనర్ కోన శశిధర్, సీసీఎల్ఏ కార్యదర్శి ఇంతియాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, మైనింగ్ శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విలేజ్ క్లినిక్స్ కేంద్రంగా కరోనా కట్టడి

▶ మొదటి పేజీ తరువాయి



దగ్గు, జలుబు, జ్వరం, ఇతర సమస్యలున్న వారికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు చేయాలి. ఆసుపత్రుల్లో ఉన్న సౌకర్యాలపై మరోసారి విస్తృత తనిఖీలు చేపట్టాలి. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వీలుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సన్నద్ధత అవసరం. మాస్కులు, పీపీఈ కిట్లు, టెస్టింగ్ సామర్థ్యంపై మరోసారి సమీక్షించాలి. అన్ని ఆసుపత్రుల్లోనూ మందులు అందుబాటులో ఉంచాలి. కోవిడ్ లక్షణాలున్న వారిని తక్షణమే విలేజ్ క్లినిక్స్‌కు రిఫర్ చేసేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చర్యలు తీసుకోవాలి.

**జనవరి 26 నాటికి అన్ని చోట్లా పనులు**

రాష్ట్రంలో ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలలను నెలకొల్పుతున్నాం. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలల పనులు వేగవంతం చేయాలి. ఇటీవల కొత్తగా మంజూరు చేసిన పార్వతీపురం కళాశాల సహా ఇంకా ప్రారంభం కాని చోట్ల పనులను వెంటనే ప్రారంభించాలి. వచ్చే జనవరి 26 నాటికి పార్వతీపురం సహా రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా చేపడుతున్న అన్ని వైద్య కళాశాలల నిర్మాణ పనులు మొదలవ్వాలి. జనవరి 26 నాటికి అన్ని విలేజ్ క్లినిక్స్ ఏర్పాటుకావాలి. విలేజ్ క్లినిక్స్ నుంచి బోధనాస్పత్రుల వరకు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం అందుబాటులో ఉండేలా ఎస్‌వోపీలు రూపొందించాలి.ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే సిబ్బందికి అవసరమైన వసతికల్పించాలి.

**104 ఎంఎంయూ సేవల తనిఖీ**

ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుకు అవసరమైన అదనపు 104 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ)వాహనాలను జనవరి 26 నాటికి సిద్ధం చేసుకోవాలి. ఆరోగ్యశ్రీ రిఫరల్‌కు సంబంధించిన యాప్ ఏఎన్ఎం, ఆరోగ్యమిత్రతో సహా అందరికీ అందుబాటులో ఉండాలి. ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపులో ఫాలో అప్ మెడిసిన్ అందుతుందా లేదా? అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఏఎన్ఎంలు ఫీడ్ బ్యాక్ తీసుకునే సమయంలో దీన్ని తెలుసుకోవాలి.

**కోవిడ్ కట్టడికి సన్నద్ధత ఇలా..**

కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ బీఎఫ్ 7 కేసులేవీ ఇప్పటివరకూ రాష్ట్రంలో నమోదు కాలేదని సమీక్ష సందర్భంగా అధికారులు తెలిపారు. ఆసుపత్రుల్లో ఆక్సిజన్ లభ్యత, ప్లాంట్లు, మందులపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు ఫీవర్ సర్వేను కొనసాగిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ ప్రయాణికులకు విమానాశ్రయాల్లో తప్పనిసరిగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీపీసీఆర్ పరీక్షల నిర్వహణకు వీలుగా ప్రస్తుతం 13 ల్యాబ్‌లు అందుబాటులో ఉండగా అన్ని చోట్లా సిబ్బంది ఉన్నారని వివరించారు. వీటి ద్వారా రోజుకు 30 వేల పరీక్షలు నిర్వహించవచ్చన్నారు. మరో 19 చోట్ల టెస్టింగ్ ల్యాబ్‌లు సిద్ధంగా ఉన్నాయని అవి కూడా అందుబాటులోకి వస్తే రోజుకు 60 వేల నుంచి 80 వేల వరకూ పరీక్షలు నిర్వహించే వీలుంటుందన్నారు. 320 టన్నుల మెడికల్ లిక్విడ్ ఆక్సిజన్ అందుబాటులో ఉందని చెప్పారు. వైద్యులు, సిబ్బంది భర్తీ, ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ అమలు, కొత్త వైద్య కళాశాలల నిర్మాణం, నాడు-నేడు కార్యక్రమం పురోగతి తదితరాలను సమీక్షలో అధికారులు సీఎంకు వివరించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, వైద్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు, కార్యదర్శి నవీన్‌కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న సేవలో రాష్ట్రపతి ముర్ము

▶ మొదటి పేజీ తరువాయి

స్వామివారిని స్పర్శ దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి భ్రమరాంబదేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన జరిపించారు. వేదపండితులు రాష్ట్రపతి, తెలంగాణ గవర్నర్‌ను వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలను, శేషవస్త్రాలను, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి చిత్రపటాల జ్ఞాపికలను ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ లవన్న అందజేశారు. స్వామి దర్శనం అనంతరం నందిసర్కిల్ సమీపంలోని టూరిజం ఫెసిలిటేషన్ సెంటర్‌లో రూ.43.08 కోట్లతో చేపట్టిన ప్రసాద్ ప్రాజెక్టు శిలాఫలకాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు విశిష్టత.. భక్తులు, యాత్రికులకు అందే సౌకర్యాలు, సదుపాయాలను ఆలయ అధికారులు రాష్ట్రపతికి వివరించారు.

**చెంచులతో ముఖాముఖి**

ఆలయ ప్రాకారానికి సమీపంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని మ.2.40గంటలకు రాష్ట్రపతి సందర్శించారు. రాష్ట్రపతి, తెలంగాణ గవర్నర్ తమిళిసైకి గిరిజన విద్యార్థులు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అక్కడ చెంచు మహిళలతో రాష్ట్రపతి ముఖాముఖి నిర్వహించారు. 26మంది చెంచులతో ప్రతి ఒక్కరినీ పేరు అడిగి తెలుసుకుని జీవన విధానం, ప్రస్తుత పరిస్థితులను ఆరా తీశారు. ఎలా జీవనం సాగిస్తున్నారు? భూములు ఉన్నాయా? సాగులోని భూములకు పట్టాలిచ్చారా? పింఛన్లు అందుతున్నాయా? చదువుకున్న గిరిజనులకు ఉద్యోగాలు ఎలా వస్తున్నాయి? తదితర అంశాలను ఆరా తీశారు. దీనికి గిరిజనులు స్పందిస్తూ.. ప్రభుత్వం రేషన్ అందిస్తోందని, పింఛన్లు, ఇళ్లు అందుతున్నాయన్నారు. పిల్లల చదువుపై ఆరా తీసిన సమయంలో సీఎం జగన్ అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టారని, పిల్లలను స్కూలుకు పంపే ప్రతి తల్లికి డబ్బులు బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఇళ్లు నిర్మిస్తోందన్నారు. కొంతమంది గిరిజనులకు ఇళ్ల స్థలాలు లేవన్నారు. టైగర్ రిజర్వ్ ఫారెస్టు కావడంతో గూడేల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ఫారెస్టు అధికారులు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. దీనికి రాష్ట్రపతి స్పందిస్తూ.. ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తామన్నారు. ఎలాంటి పంటలు సాగుచేసుకుంటున్నారని అడిగితే అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించేవాళ్లమని, ఇప్పుడు అటవీ భూముల్లో పంటలు పండించుకుంటున్నామన్నారు. గిరిజన విద్యార్థినులతో రాష్ట్రపతి ముచ్చటిస్తూ.. కోరికలుంటే చాలదని, రోజుకు 10గంటలు తక్కువ కాకుండా కష్టపడి చదువుకోవాలని సూచించారు.

**తక్కువ ధరకే దేవస్థానంలో దుకాణాలు**

గతంలో గిరిజనులకు ఆలయ పరిధిలో 16 దుకాణాలే ఉండేవని, సీఎం జగన్, ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి చొరవతో ప్రస్తుతం 30 దుకాణాలు ఇచ్చారన్నారు. మార్కెట్‌లో రూ.40-50వేల అద్దె ఉంటే, కేవలం రూ.2-3వేల అద్దే తీసుకుంటున్నారని, దుకాణాల నిర్వహణకు రుణాలూ ఇచ్చారన్నారు. తనను చూసేందుకు వచ్చిన వారితో రాష్ట్రపతి సరదాగా ఫొటోలు దిగారు. అందరితో సరదాగా, ఓపిగ్గా ముచ్చటించారు. అనంతరం రాష్ట్రపతి హైదరాబాద్‌కు పయనమయ్యారు. రాష్ట్రపతి పర్యటనలో పర్యాటకశాఖ మంత్రి రోజా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీసామూన్, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ మేధా జ్యోష్ణవి, ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, శివాజీ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు టీజీ వెంకటేశ్ పాల్గొన్నారు.


శివాజీ స్ఫూర్తి కేంద్రంలో రాష్ట్రపతితో తెలంగాణ గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, ఆర్కే రోజా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బీజేపీ నేతలు

## క్లుప్తంగా...

### డిజిటల్ గ్రంథాలయాలు సాహసోపేత నిర్ణయం

పారిస్ పరిశోధకుడు డానియల్ నేజర్స్



డానియల్‌ను సన్మానిస్తున్న శేషగిరిరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డిజిటల్ గ్రంథాలయాలు, గ్రంథాలయ వ్యవస్థ డిజిటలీకరణ సాహసోపేత నిర్ణయమని పారిస్‌కు చెందిన పరిశోధకుడు డానియల్ నేజర్స్ అన్నారు. ఆయన సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో చైర్మన్ మందపాటి శేషగిరిరావుతో భేటీ అయ్యారు. ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, సాంస్కృతిక వికాసానికి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని డానియల్ కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ డిజిటల్ గ్రంథాలయాలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ వ్యవస్థకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. మందపాటి మాట్లాడుతూ సీఎం జగన్ దూరదృష్టిని ప్రపంచ దేశాలు సైతం ప్రశంసిస్తున్నాయన్నారు. డానియల్ తెలుగు కళలపై అనేక పరిశోధనలు చేశారని, గ్రంథాలయ వ్యవస్థ పనితీరు నచ్చి వివరాలు తెలుసుకునేందుకు వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహ పరిశోధకుడు చిన్నం యువరాజు పాల్గొన్నారు.

### కాపులకు రిజర్వేషన్ అమలుకు కృషిచేయాలి

సీఎం జగన్‌కు ముద్రగడ లేఖ



కిర్లంపూడి: కాపు జాతికి రిజర్వేషన్ల అమలుకు కృషి చేయాలని కోరుతూ సీఎం వైఎస్ జగన్‌కు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం లేఖ రాశారు. ఈ మేరకు సోమవారం కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో లేఖ ప్రతులను మీడియాకు విడుదల చేశారు. బలిజ, కాపు, తెలగ, ఒంటరి జాతులు కోల్పోయిన రిజర్వేషన్ విషయమై గతంలో రాసిన లేఖ సారాంశాన్ని ఆయన గుర్తుచేశారు. ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈడబ్ల్యూఎస్‌పై ఇచ్చిన తీర్పు, రాజ్యసభలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు సోషల్ జస్టిస్ మంత్రి స్పందిస్తూ రాజ్యాంగ సవరణలు 103, 105–2019, 2021 యాక్ట్‌ను అనుసరించి ఆర్టికల్ 342ఎ(3) ప్రకారం రిజర్వేషన్లు రాష్ట్రంలో అమలు చేసుకోవచ్చని చెప్పారని తెలిపారు. తదనుగుణంగా కాపులకు రిజర్వేషన్ ఇచ్చేందుకు దృష్టి పెట్టాలని కోరుతున్నామని తెలిపారు. ప్రజల ఆర్థికాభివృద్ధికి దోహదపడే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, తమ సామాజికవర్గానికి కూడా రిజర్వేషన్ కల్పించి వెలుగు నింపాలని ముద్రగడ తన లేఖలో కోరారు.

### కాపు కార్పొరేషన్ కార్యాలయంలో రంగా వర్ధంతి



రంగా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

సాక్షి, అమరావతి: కాపు సంక్షేమ అభివృద్ధి సంస్థ (కార్పొరేషన్) ప్రధాన కార్యాలయంలో వంగవీటి మోహనరంగా 34వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరిరావు ఆధ్వర్యంలో తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. రంగా చిత్రపటానికి అడపా శేషు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు పిన్నింటి మహేష్, లీలా వెంకట్రావు, దాడి లక్ష్మిరాజ్యం, రామాయణపు సాంబశివరావు, దామోదరరావు, తోట సాంబశివరావు, బడేటి ధర్మారావు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగాకు ఘనంగా నివాళి అర్పించారు.

### శ్మశాన వాటికల ఏర్పాటు నిర్ణయం చరిత్రాత్మకం

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా)/సాక్షి, అమరావతి: దేశ చరిత్రలోనే ప్రతి దళితవాడకు ఒక ఎకరం భూమిని శ్మశాన వాటికకు కేటాయించేందుకు సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. ఆయన సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తాము సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి దళిత గ్రామాలకు శ్మశాన వాటిక ఏర్పాటుపై యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించడం ద్వారా ముఖ్యమంత్రికి దళితుల పట్ల ఉన్న మమకారం ఏమిటో అర్థమవుతోందన్నారు. పేద దళితులకు భూములివ్వాలనే ఆలోచన ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. కాగా, రాష్ట్రంలో దళితుల శ్మశాన వాటికలకు భూములు కేటాయించేలా చర్యలు తీసుకోవడంపై సీఎం జగన్‌కు దళిత జేఏసీ చైర్మన్ పెరికే వరప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామస్థాయికి భూముల సర్వే సేవలు

## ఎఫ్ లైన్ పిటిషన్ల బాధ్యత గ్రామ సర్వేయర్లకు

- మండల సర్వేయర్ల నుంచి ఆ బాధ్యతల బదలాయింపు
- సర్వే సమస్యల పరిష్కారంలో జాప్యంతో ప్రజల నుంచి ఫిర్యాదులు
- దీంతో సర్వేచేసి నివేదిక ఇచ్చే బాధ్యత ఇకపై గ్రామ సర్వేయర్లకు అప్పగింత
- హద్దులు, విస్తీర్ణాల తేడాలు సరిచేసుకునేందుకే ఎఫ్ లైన్ పిటిషన్లు
- రీ సర్వే నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం
- సర్వే సమయం 30 నుంచి 15 రోజులకు కుదింపు



సాక్షి, అమరావతి: భూముల సర్వే సేవలను మండలస్థాయి నుంచి గ్రామస్థాయికి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు మండల సర్వేయర్ల చేతిలో ఉన్న ఎఫ్ లైన్ పిటిషన్ల (సరిహద్దు వివాదాలు, హద్దులు–విస్తీర్ణంలో తేడాలు వంటివాటిపై వచ్చే దరఖాస్తులు) బాధ్యతను గ్రామ సర్వేయర్లకు అప్పగించింది. రీ సర్వే నేపథ్యంలో తీసుకున్న ఈ నిర్ణయం ఆ కార్యక్రమం మరింత వేగం పుంజుకోవడానికి, సాధారణంగా సర్వే వ్యవహారాల్లో జరిగే జాప్యాన్ని నివారించడానికి ఎంతో దోహదపడుతుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో తమ భూమికి సంబంధించి హద్దుల్లో ఏమైనా తేడాలు వచ్చినా, విస్తీర్ణంలో తప్పులు చోటుచేసుకున్నా, ఇతరత్రా తమ భూమి గురించి అనుమానాలు నివృత్తి చేసుకోవాలన్నా భూ యజమానులు సర్వేకోసం దరఖాస్తు చేసుకుంటారు. దీనిని రెవెన్యూ పరిభాషలో ఎఫ్ లైన్ పిటిషన్‌గా పిలుస్తారు. ఇప్పటి వరకు ఈ సర్వే బాధ్యతను మండల సర్వేయర్లు నిర్వర్తించేవారు. మండలానికి ఒక్కరే సర్వేయర్ ఉండడం, పిటిషన్లు కుప్పలుతెప్పలుగా వస్తుండడంతో సర్వే తీవ్ర జాప్యమవుతుండేది. భూముల రీ సర్వే సందర్భంగా ఎఫ్ లైన్ పిటిషన్లలో జాప్యాన్ని గుర్తించారు.

**ఇకపై పిటిషన్లు నేరుగా గ్రామ సర్వేయర్ల లాగిన్‌కు...**

ఈ నేపథ్యంలో ఆ బాధ్యతను మండల సర్వేయర్ల నుంచి గ్రామ సర్వేయర్లకు బదలాయించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల వెబ్‌సైట్ ద్వారా వచ్చే ఎఫ్ లైన్ దరఖాస్తులు ఇకపై నేరుగా గ్రామ సర్వేయర్ లాగిన్‌కు చేరతాయి. సర్వేకు నోటీసులు జారీచేయడం, సర్వే నిర్వహించడం, ఆ వివరాలతో నివేదిక తయారు చేసి డిప్యూటీ తహసీల్దార్‌కు పంపడం వంటి పనులన్నీ ఇకపై గ్రామ సర్వేయర్లే చేస్తారు. డిప్యూటీ తహసీల్దార్ ఆ నివేదికను పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. డిప్యూటీ తహసీల్దార్ డిజిటల్ లాగిన్ నుంచే సర్వే ఎండార్స్‌మెంట్ జనరేట్ అవుతుంది. గ్రామ సర్వేయర్లు నిర్వహించే సర్వేపై మండల సర్వేయర్లు మొదటి అప్పిలేట్ అధికారులుగా వ్యవహరిస్తారు. ఎఫ్ లైన్ పిటిషన్‌తో నిర్వహించే సర్వే సమయాన్ని కూడా 30 రోజుల నుంచి 15 రోజులకు తగ్గించారు.

### ప్రజల చెంతకే..

భూముల సర్వే సేవలు ప్రజలకు చేరువకావడం ఇదే ప్రథమం. ఇప్పటివరకు మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో ఉండే మండల సర్వేయర్ల వద్దకు భూయజమానులు వెళ్లాల్సి ఉండేది. ఇకనుంచి తమ గ్రామంలోని సచివాలయంలో పనిచేసే సర్వేయర్లే ఈ పని చేయనున్నారు. దీనిద్వారా సర్వేలో జాప్యం తగ్గడంతోపాటు భూయజమానులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగే పని తప్పుతుంది. భూముల రీ సర్వే సందర్భంగా వచ్చే ఎఫ్ లైన్ పిటిషన్లపైనా ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ఈ పిటిషన్లను ఇష్టానుసారం తిరస్కరించకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తిరస్కరించిన దరఖాస్తుల్ని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారుల స్థాయిలో పూర్తిగా పరిశీలించాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్ ఆదేశాలిచ్చారు.

# సౌర విద్యుత్‌కు ట్రాన్స్‌మిషన్ లైన్లు

- ఏపీలోని మూడు సోలార్ ఎనర్జీ జోన్లలో ఏర్పాటుకు త్వరలో టెండర్లు
- మొత్తం 6 గిగావాట్ల సామర్థ్యం గల లైన్ల నిర్మాణం
- ఎన్‌సీటీ సమావేశంలో నిర్ణయం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం కొత్తగా అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ లైన్లు ఏర్పాటు కానున్నాయి. కర్ణాటకతో పాటు ఏపీలోని మూడు సోలార్ ఎనర్జీ జోన్లలో ఈ లైన్లు ఏర్పాటు చేసేందుకు త్వరలో టెండర్ల ప్రక్రియ మొదలుకానుంది. బీదర్‌లోని సోలార్ ఎనర్జీ జోన్ 2.5 గిగావాట్లు, అనంతపురంలో 2.5 గిగావాట్లు, కర్నూలులోని సోలార్ ఎనర్జీ జోన్‌లో 1 గిగావాట్ సామర్థ్యంతో.. మొత్తం 6 గిగావాట్ల సామర్థ్యం గల లైన్ల నిర్మాణం చేపట్టాలని ఇటీవల ఢిల్లీలో జరిగిన నేషనల్ కమిటీ ఆన్ ట్రాన్స్‌మిషన్ (ఎన్‌సీటీ) సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలో విండ్, సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టుల స్థాపన ద్వారా పెట్టుబడిదారులను ఆకర్షించడానికి పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. 29 ప్రాంతాల్లో 33,240 వేల మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్ట్‌లను నెలకొల్పడానికి ప్రణాళిక సిద్ధమైంది. మరో 10 వేల మినీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను ఇటీవల గుర్తించింది. మొత్తంగా 44,240 మెగావాట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. వీటి కోసం కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని 1.45 లక్షల ఎకరాల భూమితో టెక్నో కమర్షియల్ ఫీజిబిలిటీ స్టడీస్ నిర్వహించింది. పెట్టుబడులు, పరికరాల తయారీ సౌకర్యాల ప్రాజెక్ట్ డెవలపర్ల కోసం సుమారు 5 లక్షల ఎకరాలను లీజుకు ఇవ్వడానికి ప్రభుత్వం భూమిని సమకూరుస్తోంది. తొలి దశలో వైఎస్సార్ జిల్లా గండికోట, అనంతపురం జిల్లా చిత్రావతి, నెల్లూరు జిల్లా సోమశిల, కర్నూలు జిల్లా ఓక్ రిజర్వాయర్, విజయనగరం జిల్లా కురుకూటి, కర్రివలస విశాఖపట్నం జిల్లా ఎర్రవరంలో 6,600 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల ఈ ఏడు పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నారు. వీటి నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్ పంపిణీకి ఏపీ ట్రాన్స్‌కోకు సంబంధించిన 400 కేవీ సబ్ స్టేషన్లతో లైన్లను అనుసంధానం చేయనున్నారు. ఆరు జిల్లాల్లో 361.86 కిలోమీటర్ల విద్యుత్ లైన్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

**ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఎగుమతి**

సోలార్ పవర్ పాలసీలో భాగంగా రాష్ట్రంలో రానున్న ఐదేళ్లలో కనీసం 5 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తోంది. సోలార్ పార్కులను అభివృద్ధి చేయడం, ఉత్పత్తిని ప్రోత్సహించడం, సౌరశక్తితో నడిచే వ్యవసాయ పంపుసెట్‌లను తీసుకురావడం, స్థానిక తయారీ సౌకర్యాలను ప్రోత్సహించడం వంటివి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టులను స్థాపించడం ద్వారా రాష్ట్రంలో ఇంధన రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా ఆదాయాన్ని సృష్టించడం, స్థానిక ఉపాధిని కల్పించడం, రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధిని పెంచడం వంటి ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. ట్రాన్స్‌మిషన్ లైన్ల ఏర్పాటుతో పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే వీలు కలుగుతుంది. అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీల నుంచి కేంద్రం మినహాయింపునివ్వడంతో ఆ మేరకు కూడా రాష్ట్రానికి ప్రయోజనం చేకూరనుంది.

# కృష్ణా జలాలపై తెలంగాణ సర్కారు తొండాట

▶ మొదటి పేజీ తరువాయి

ఈ వివాదాలను తెలంగాణ సర్కార్ తిరగదోడటంచర్చనీయాంశంగా మారింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపుల ఆధారంగా ఏపీకి 512.04 (66 శాతం), టీఎంసీలు, తెలంగాణకు 298.96 (34 శాతం) టీఎంసీల పంపిణీ జరిగింది. ఈ మేరకు జరిగిన తాత్కాలిక ఒప్పందంపై 2015 జూలై 19న ఏపీతోపాటు తెలంగాణ కూడా సంతకం చేసింది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి వచ్చే వరకూ ఇదే ఒప్పందం అమల్లో ఉంటుందని కేంద్ర జల్ శక్తి శాఖ స్పష్టం చెప్పింది. ఈ ఏడాది మే 10న జరిగిన కృష్ణా బోర్డు సమావేశంలోనూ ప్రస్తుత నీటి సంవత్సరంలో 66 : 34 నిష్పత్తిలో పంపిణీకి ఏపీ, తెలంగాణ ఆమోదించాయి. కానీ, ఇప్పుడు దానికి తాము అంగీకరించబోమని, జలాల్లో 50 శాతం వాటా కావాలని తెలంగాణ కోరుతోంది.

**ఎప్పటి లెక్కలు అప్పటికే**

ఒక నీటి సంవత్సరంలో వాడుకోని వాటా జలాలను (క్యారీ ఓవర్) మరుసటి ఏడాది వాడుకోవడానికి అవకాశం ఇవ్వాలని తెలంగాణ కోరింది. దీనిపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం.. ఒక ఏడాదిలో నీటి లెక్కలు ఆ ఏడాదితోనే ముగుస్తాయని, మరుసటి ఏడాది వాడుకోవడానికి అవకాశం ఇస్తే ఏపీ హక్కులను హరించినట్లవుతుందని సీడబ్ల్యూసీ పేర్కొంది. దీంతో క్యారీ ఓవర్ జలాలను వాడుకోవడానికి అనుమతించే ప్రశ్నే లేదని కృష్ణా బోర్డు తేల్చి చెప్పింది. వివాదం సద్దుమణిగింది. ఇప్పుడు మళ్లీ ఆ వివాదాన్ని తెలంగాణ తెరపైకి తెస్తోంది. హైదరాబాద్ తాగునీటికి వినియోగిస్తున్న నీటిలో 20 శాతాన్ని లెక్కలోకి తీసుకోవాలని తెలంగాణ కృష్ణా బోర్డును కోరుతోంది. తాగు నీటిలో 20 శాతం వాడుకోగా మిగిలిన 80 శాతం మురుగు నీటి కాలువల ద్వారా మళ్లీ తెలంగాణలో ఆయకట్టుకే చేరుతోందని ఏపీ చెబుతోంది. హైదరాబాద్ తాగునీటికి వాడుతున్న జలాలను వంద శాతం లెక్కించాలని పేర్కొంది. దీనికి కృష్ణా బోర్డు కూడా ఏకీభవించింది. ఇప్పుడు తెలంగాణ మళ్లీ రాజోలిబండ డైవర్షన్ స్కీం డిజైన్ లోపాలను సరిదిద్దుకోకుండా ఆధునికీకరణ కోసం మంకుపట్టు పడుతోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు దిగువన టెలీమీటర్లను ఏర్పాటుచేసి ఏపీ వాడుతున్న ప్రతి నీటి బొట్టునూ కృష్ణా బోర్డు లెక్కిస్తున్నా ఇంకా టెలీమీటర్లు ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తోంది. ఒక వైపు అనుమతి లేకుండానే పాలమూరు–రంగారెడ్డి, డిండి, తుమ్మిళ్ల, భక్త రామదాస, మిషన్ భగీరథ, కల్వకుర్తి, నెట్టెంపాడు (సామర్థ్యం పెంపు) తదితర ప్రాజెక్టులు చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం.. మరో వైపు నీటి కేటాయింపులు ఉన్న ఆర్డీఎస్ కుడి కాలువ పనులను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి వచ్చే వరకూ ఏపీ చేపట్టకూడదని డిమాండ్ చేస్తోంది.

# కాపులు ఐక్యంగా ఉండాలి

- కాపునాడు సమావేశంలో నాయకులు
- వంగవీటి రంగా వర్ధంతి పేరిట జనసేన నేతల ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి, విశాఖపట్నం: కాపులంతా ఐక్యంగా ఉండాలని.. తద్వారానే కాపులకు రాజ్యాధికారం సాధ్యమని కాపునాడు సభలో వక్తలు అభిప్రాయపడ్డారు. విశాఖలోని ఆళ్వార్‌దాస్ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం దివంగత వంగవీటి మోహనరంగా 34వ వర్ధంతి పేరిట జనసేన నాయకుల ఆధ్వర్యంలో కాపునాడు బహిరంగ సభ జరిగింది. దీనికి పార్టీలకతీతంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని ప్రచారం జరిగింది. అయితే, బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మినహా వైఎస్సార్‌సీపీ, టీడీపీలకు చెందిన ముఖ్య నేతలెవరూ హాజరుకాలేదు. రాధా–రంగా రాయల్ రీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జి.బాలాజీ నేతృత్వంలో జరిగిన సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కాపు నేతలు పరోక్షంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందంటూ ఒక్కొక్కరూ మాట్లాడుతూ వచ్చారు.

**భయంతోనే రంగాను హతమార్చారు**

ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ప్రసంగిస్తూ రాజకీయ నాయకులు వస్తుంటారు.. పోతుంటారని, కానీ, రంగా లాంటి కొద్దిమందే చరిత్ర సృష్టిస్తారన్నారు. రాష్ట్ర ప్రజలు రంగాను కాపు నాయకుడిగా మాత్రమే చూడలేదని, ఒకసారి అధికారంలోకి వస్తే మళ్లీ దిగరన్న భయంతోనే ఆయన్ను అప్పటి ప్రత్యర్థులు హతమార్చారన్నారు. తాడేపల్లిగూడెం జనసేన అధ్యక్షుడు బొలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాపులంతా పవన్‌కళ్యాణ్‌కే మద్దతివ్వాలని పరోక్షంగా కోరారు. సభ నిర్వాహకుడు జి.బాలాజీ మాట్లాడుతూ తాము పవన్ అడుగు జాడల్లో నడుస్తామన్నారు. పేదల కోసం ప్రాణాలర్పించిన రియల్ హీరో వంగవీటి రంగా అని మహాసేన అధ్యక్షుడు రాజేష్ కొనియాడారు.

# రంగాను చంపింది టీడీపీయే

- మాజీమంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని
- గుడివాడ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా రంగా వర్ధంతి
- అది 'రావి', రంగా అభిమానుల మధ్య జరిగిన గొడవ





రంగా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాని, బాలశౌరి

గుడివాడ రూరల్: దివంగత వంగవీటి మోహనరంగాను చంపింది తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీలోని నాయకులేనని మాజీమంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన రంగాను ఆనాడు అధికారంలో ఉన్న టీడీపీ, ఆ పార్టీ నేతలు అయ్యప్పస్వామి మాలధారణలో ఉన్న వ్యక్తులతో అత్యంత దారుణంగా చంపించారని గుర్తుచేశారు. కృష్ణాజిల్లా గుడివాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వంగవీటి రంగా 34వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. అనంతరం నాని మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు సేవ చేయాలని తాపత్రయపడే వ్యక్తి రంగా అని, అలాంటి వ్యక్తిని చంపించిన వ్యక్తులు, పార్టీలు రంగా పేరు చెప్పుకుని ఆయన విగ్రహాలకు దండలు వేసి వర్ధంతి నిర్వహించాల్సిన అవసరం ఏర్పడిందంటే ఆయన ప్రజల గుండెల్లో ఏ స్థాయిలో ఉన్నారో అర్థంచేసుకోవచ్చన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అశేష ప్రజాదరణ పొందిన వ్యక్తి రంగా అని.. అప్పట్లో ఆయన్ను తొక్కేయాలని ప్రయత్నించడం, అది సాధ్యంకాలేదని.. దీంతో 'కొంతమంది వ్యక్తులు తనను చంపడానికి కుట్ర చేస్తున్నారు' అని అప్పట్లోనే రంగా వెల్లడించారని కొడాలి నాని గుర్తుచేశారు. అయితే, అప్పటి ప్రభుత్వం రంగాకు రక్షణ కల్పించకుండా ఆయన మరణానికి కారణమైందని విమర్శించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని, అటువంటి వ్యక్తి భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు.

**ఆ ఘర్షణతో వైఎస్సార్‌సీపీకి సంబంధంలేదు: నాని**

అనంతరం.. మీడియాతో కొడాలి నాని మాట్లాడుతూ ఆదివారం రాత్రి గుడివాడలో జరిగిన ఘర్షణతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధంలేదని స్పష్టంచేశారు. అది టీడీపీ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, రంగా అభిమానులకు మధ్య జరిగిన గొడవని తేల్చిచెప్పారు. ఆ ఘర్షణలో అసలు వైఎస్సార్‌సీపీ సంబంధీకులెవరూ లేరన్నారు. ఇక ఎప్పుడూ లేని విధంగా రంగా వర్ధంతిని రావి వెంకటేశ్వరరావు నిర్వహించడాన్ని జీర్ణించుకోలేని వంగవీటి అభిమానులు దానిని అడ్డుకుంటామని చెప్పడంతో 'రావి' ఆయన పార్టీ నాయకులు, గూండాలను వెంటేసుకుని కర్రలు, బరిసెలతో దాడులకు పాల్పడ్డారని నాని వివరించారు. 'రావి'కి ఫోన్‌చేసి మూడు గంటల్లో వస్తాను, అక్కడే ఉండు చంపేస్తాను' అని ఎవరూ చెప్పబోరన్నారు. వైఎస్సార్‌సీపీ పైన, తమ పార్టీ నేతలపైన పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

### రంగా ఎదుగుదల ఓర్వలేక ఓ పార్టీ పొట్టన పెట్టుకుంది

- ఇప్పుడు అదే పార్టీ వర్ధంతి, జయంతి చేస్తానంటోంది
- చల్లపల్లిలో రంగా విగ్రహావిష్కరణ సభలో వంగవీటి నరేంద్ర



రంగా విగ్రహం ఆవిష్కరించి ప్రసంగిస్తున్న నరేంద్ర

చల్లపల్లి (అవనిగడ్డ): తనను నమ్మినవారికోసం ఎన్నో కష్టాలు పడుతూ, కుట్రలు, కుతంత్రాల మధ్య విజయపథంలో పయనిస్తున్న వంగవీటి మోహనరంగాను చూసి తట్టుకోలేక స్వార్థ ఆలోచనతో ఒక పార్టీ ఆయన్ని హత్యచేసేవరకు నిద్రపోలేదని రాధారంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర చెప్పారు. కృష్ణాజిల్లా చల్లపల్లిలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆయన వర్ధంతి సందర్భంగా సోమవారం నరేంద్ర ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడైనా రంగా విగ్రహం పెడుతున్నారంటే తప్పుచేసిన వారి వెన్నులో వణుకు పుడుతోందని చెప్పారు. నాడు రంగాను చంపిన పార్టీ నాయకులు ఇప్పుడు ఆయన విగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని విమర్శించారు. రంగా విగ్రహాలు పెడతామని, వర్ధంతి, జయంతి చేస్తామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రాధారంగా మిత్రమండలి జిల్లా అధ్యక్షుడు 'బుల్లెట్' ధర్మారావు, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

### జనవరి 26 నుంచి ఏపీలో కాంగ్రెస్ పాదయాత్ర

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు




శ్రీకాకుళం అర్బన్: దేశం, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పద్మరాజు అన్నారు. ఆయన సోమవారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర రాజకీయంగా దేశంలో ప్రకంపనలు సృష్టిస్తోందన్నారు. తొలి విడత భారత్ జోడో యాత్రకు జనవరి 26వ తేదీన జమ్మూ–కశ్మీర్‌లో విరామం ఇస్తారని తెలిపారు. 'చేయిచేయి కలుపుదాం–కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం' అనే నినాదంతో జనవరి 26 నుంచి మార్చి 26వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. జనవరి 23వ తేదీన ఢిల్లీలో అన్ని రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లు, సీఎల్పీ నాయకులు, ఏఐసీసీ, జనరల్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

### ఇజ్రాయిల్ వీసాకు క్రేజ్

- సొమ్ము చేసుకుంటున్న దళారులు
- వాస్తవానికి వర్క్ వీసా కోసం రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకే ఖర్చు
- కానీ వర్క్ వీసాకైతే పాతిక లక్షలు, విజిట్ వీసాకు రూ.12 లక్షలు డిమాండ్
- నెలకు పెద్దమొత్తంలో సంపాదించే అవకాశం ఉండటంతో.. వీసాల కోసం ఎగబడుతున్న నిరుద్యోగులు

మోర్తాడ్(బాల్కొండ): ఇజ్రాయిల్‌లో ఉపాధి పొందడం ద్వారా భారీ మొత్తంలో సంపాదించుకునే అవకాశం ఉండటంతో అక్కడికి వెళ్లేందుకు నిరుద్యోగులు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. ఇంటి పనితో పాటు, రెస్టారెంట్లలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటంతో అక్కడికి వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం లభిస్తుండటంతో వీసాల కోసం ఎంత ఖర్చు చేసేందుకైనా నిరుద్యోగులు వెనుకాడటం లేదు. దాన్ని ఆసరాగా తీసుకుని దళారులు వీసా ఖర్చును రెట్టింపు చేస్తున్నారన్న వాదనలున్నాయి. వాస్తవానికి వర్క్ వీసా కోసం రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకే ఖర్చు ఉంటుంది. కానీ వీసాల కోసం పని చేసే మధ్యవర్తుల సంఖ్య పెరిగిపోవడంతో మొత్తంగా ఖర్చు పెరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పుడు ఇజ్రాయిల్‌లో వర్క్ వీసా కోసం రూ.25 లక్షలు, విజిట్ వీసా కోసమైతే రూ.12 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. వర్క్ వీసాలు పొందిన వారు ఇజ్రాయిల్‌లో ఎక్కడైనా పని వెతుక్కుని ఉపాధి పొందవచ్చు. తెలంగాణ జిల్లాల నుంచి ఇప్పటి దాదాపు 20 వేల మంది వలస వెళ్లి ఉంటారని అంచనా.



ఆలోచించగా ఆలోచించగా ఒక ప్లేన్‌లో అందవికారమనేది వుండదేమో. అంతా అందమే తోస్తుందేమో! లోకమంతా అనేక విధమైన అందాలుగానే కనబడుతుందేమో అనుకుంటాను.

– చలం

సాక్షి

మంగళవారం, డిసెంబర్, 27

# తీరం దాటని తుపాను బాంబు

చలి... నీళ్ళు కాదు మనుషులే నిలువునా గడ్డకట్టే చలి. మైనస్ 8 నుంచి మైనస్ 48 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతతో ఇళ్ళను కప్పేసిన హిమపాతం. గింయుమనే ఈదురుగాలులు. ఇంట్లో నుంచి కాలు బయటపెట్టలేరు... వెచ్చగా ఇంట్లో ఉందామంటే కనీసం కరెంట్ లేదు. క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా విహార యాత్రలకు వెళదామంటే, మంచుతో హైవేలు మూత బడ్డాయి. వేల కొద్దీ సర్వీసులు రద్దయి, విమానాలు నడవడం లేదు. తీవ్ర మంచు తుపాను రకమైన 'బాంబు సైక్లోన్' దెబ్బతో అమెరికాలోని అనేక రాష్ట్రాలు, కెనడాల్లో పరిస్థితి ఘోరంగా ఉంది. సర్వసాధారణంగా సమశీతోష్ణంగా ఉండే అమెరికాలోని దక్షిణాది రాష్ట్రాల్లోనూ కనీవిని ఎరుగని స్థితి. ఇప్పటికి మరణాల సంఖ్య యాభై లోపే అంటున్నా, మోకాలి లోతు మంచులో కూరుకుపోయిన ఇళ్ళూ వాకిళ్ళనూ శుభ్రం చేసి, విద్యుత్ సరఫరాను సక్రమంగా, అందరికీ అందుబాటులోకి తెచ్చేలోగా ఇంటాబయటా ఇరుక్కుపోయిన మరెందరికి ప్రాణం మీదకు వస్తుందో చెప్పలేం.

అత్యవసర వాహనాలు సైతం కదలడానికి కష్టమవుతున్న ప్రాణాంతక రోడ్లతో మరో వారం పరిస్థితులు ఇలానే ఉంటాయన్న వార్తలు భీతి గొల్పుతున్నాయి. కెనడా సరిహద్దు నుంచి మెక్సికో సరిహద్దు వరకు 3 వేల కిలోమీటర్ల పైగా ఇదే దుర్భర వాతావరణం. అమెరికా జనాభాలో 60 శాతం మందికి ఏదో రకమైన ఇబ్బందులు. న్యూయార్క్ రాష్ట్రం బఫలో నగరం మంచు తుపాను గాలులు, హిమపాతంతో స్తంభించిపోయింది. నయాగరా అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద 43 అంగుళాల ఎత్తున మంచు పేరుకుంది. మరిగే నీటిని గాలిలోకి విసిరితే, తక్షణమే మంచుగడ్డగా మారుతున్న పరిస్థితి చూశాక, ఇది 'తరానికి ఒకసారి వచ్చే' మంచు తుపానని ఎందుకన్నదీ అర్థమవుతుంది.

అట్లాంటిక్ మహాసముద్ర తుపానులు, చక్రవాతాల సీజన్ అమెరికాకు కొత్త కాదు. ఉష్ణమండల ప్రాంతాల్లో వేడెక్కిన సముద్ర జలాల వల్ల వేసవిలో చక్రవాతాలు ఏర్పడతాయి. ఆ తుపానులు తెచ్చే వరదల జలవిలయం ఒక ఎత్తైతే, తాజాగా విరుచుకుపడ్డ శీతకాలపు మంచు తుపాను మరో ఎత్తు. 24 గంటల్లో 24 మిల్లీ బార్స్, అంతకన్నా ఎక్కువగా వాతావరణ పీడనం ఒక్కసారిగా చకచకా పడిపోయి, బలమైన తుపానుగా మారితే 'బాంబు సైక్లోన్' అంటారు. బాంబు పేలినట్టు పీడనం హఠాత్తుగా పడిపోవడాన్ని దృష్టిలో పెట్టుకొని అలా పిలుస్తారు. ఈదురుగాలులు, కన్ను పొడుచుకున్నా కనిపించని తీవ్ర హిమపాతం ఈ తుపానుతో అనూహ్య పరిణామాలు. ఒంటిపై ఏమీ లేకుండా 5 నిమిషాలుంటే, మనిషి మొద్దుబారి పోతాడు. ఇవెంత ప్రమాదకరమో చెప్పేందుకు 1980లో శాస్త్రవేత్తలు బాంబు సైక్లోన్ అనే మాట సృష్టించారు.

ఇలియట్ అని పేరుపెట్టిన తాజా మంచు తుపాను దెబ్బకు ఒక దశలో 17 లక్షల మందికి పైగా విద్యుత్ సరఫరా లేక ఇక్కట్ల పాలయ్యారు. సోమవారానికి ఆ సంఖ్య 2 లక్షల లోపు నకు రావడం ఒకింత సాంత్వన. 2021లో టెక్సాస్‌లో భీకర హిమపాతంతో పవర్‌గ్రిడ్ విఫలమై, 200 మందికి పైగా ప్రాణాలు పోగొట్టుకున్న విషాదం లాంటివి పునరావృతం కాకపోవడం ఊరట. అమెరికాలో 13.5 కోట్ల మందిని కడగండ్ల పాల్జేసిన మంచు తుపానుతో పంటలు, పశువులు, చివరకు రైల్వేలైన్లు దెబ్బ తినిపోతున్నాయి. నిరుడు ఇలాగే శీతకాలపు మంచులో రైతులు తమ పశువులకు దాణా, నీళ్ళు అందించలేక తిప్పలు పడ్డారు. ఈసారి నిన్నటి దాకా దుర్భిక్షంతో అల్లాడిన పంటలకు ఇది కొత్త దెబ్బ. ఈ తుపానుండేది కొద్ది రోజులైనా, ఆహారధరలు పెరగడం సహా ప్రభావం దీర్ఘకాలికమే.

మరోపక్క వారం రోజులుగా ఉత్తర జపాన్‌లో శీతకాలపు సగటుకు దాదాపు మూడు రెట్లు ఎక్కువ మంచు కురిసి, ప్రాణహాని జరిగింది. అమెరికా లానే జపాన్‌లోనూ రైళ్ళు, విమాన సేవల రద్దు, కరెంట్ కష్టాలు. ఇవన్నీ ఇప్పుడు మేలుకొలుపులు. ప్రకృతిపై మనం సాగించిన తీవ్ర విధ్వంసానికి అనుభవిస్తున్న ఫలితాలు. పర్యావరణ మార్పులు మనపై చూపుతున్న ఆగ్రహానికి ప్రతీకలు. అరుదుగా వస్తాయనే బాంబు సైక్లోన్లు ఆ మధ్య 2019లో, మూడేళ్ళకే మరోసారి ఇప్పుడూ రావడం గమనార్హం. ఆందోళనకరం ఏమిటంటే, పర్యావరణ మార్పుల పుణ్యమా అని భవిష్యత్తులో మరిన్ని బాంబు సైక్లోన్లు వస్తాయట. ఒక్క బఫలో నగరంలోనే 1976 నాటి రికార్డ్‌కు రెట్టింపు హిమపాతం గత శుక్రవారం జరిగింది. 1878 తర్వాత గత 144 ఏళ్ళలో ఎన్నడూ లేనంత వర్షం కురిసింది. ఇవన్నీ పదే పదే మనకు చెబుతున్నది ఒక్కటే... ఇక ఆలస్యం చేస్తే ప్రపంచానికి ముప్పు.

ఇప్పటికే ఋతువులు గతులు తప్పాయి. ఈ ఏడాది బ్రిటన్, యూరప్‌లలో కనీవిని ఎరుగని వడగాడ్పులు, సతతం పారే నదులు ఎండిపోవడం చూశాం. ఎండ, వాన, చలి – ప్రతిదీ గరిష్ఠానికి చేరుతున్న కాలంలోకి వచ్చేశాం. మనం చేస్తున్న ప్రకృతి విధ్వంసం, విడుదల చేస్తున్న గ్రీన్‌హౌస్ వాయువులే ఇప్పుడు శాపాలయ్యాయి. నామమాత్ర 'కాప్' సదస్సుల లాంటివి పెట్టి, ఊకదంపుడు ఉపన్యాసాలిస్తే ఉపయోగం లేదు. అగ్రరాజ్యాల అలక్ష్యం సహా అనేక కారణాలతో పర్యావరణ పరిరక్షణకు పెట్టుకున్న లక్ష్యాలను ప్రపంచం చేరుకున్న దాఖలాలూ లేవు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత వర్ధమాన దేశాలదేనని తప్పించుకోజూస్తే కష్టమే. ప్రకృతి హెచ్చరికల్ని విస్మరిస్తే, మూల్యం చెల్లించుకోక తప్పదు. అగ్రరాజ్యంలో తాజా మంచు తుపాను బీభత్సం అచ్చంగా జగత్ప్రళయ సినిమాల్లోని దృశ్యాల్లా ఉన్నాయని పలువురి వ్యాఖ్య. ఇకనైనా కళ్ళు తెరవకుంటే భూతాపోన్నతితో వచ్చేది అచ్చంగా ప్రళయమేనని గుర్తించాలి. ప్రపంచ దేశాలన్నీ తగు చర్యలకు నడుం బిగించాలి.

# విజ్ఞానమే పరిష్కారం! చిట్కాలు కావు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

చైనాలో బీఎఫ్.7 వేరియంట్ బాధితుల శవాల గుట్టలతో మార్చురీలన్నీ నిండిపోతున్నాయనీ, 20 లక్షల మంది చనిపోవచ్చనీ అమెరికా నుంచి వార్తలు వండుతున్నారు. కోవిడ్ వ్యాప్తిని నిరోధించేందుకు చైనా విధించుకున్న ఆంక్షలను ఎత్తి వేయాలని గగ్గోలు పెట్టినవాళ్లే, ఆ ఆంక్షలు ఎత్తివేసిన తర్వాత కూడా పరిస్థితులలో మార్పు లేదని ఎత్తిపొడుస్తున్నారు. నిజానికి ప్రజల ఆరోగ్య భాగ్యాలే ప్రాధాన్యతగా చైనా వ్యవహరిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంటోంది. ఒక్క చైనీయుడూ చనిపోకుండా చేయడం కాదు, సాధ్యమైనంత తొందరలో వ్యాధిని అదుపు చేసి సామాజికులపై పడే ఖర్చుల భారాన్ని కనీస స్థాయికి తేవడమే ఆ దేశ విధానమని 'లాన్సెట్' చెబుతోంది. కాబట్టి విమర్శకులు ముందు తమ ఇంటిని చూసుకోవాలి.

"ఏ ప్రజా సమస్యల విషయంలోనైనా మన దృష్టిలో ఉండవలసింది ప్రజలు, వారి ఆరోగ్య భాగ్యాల సమస్య. ఈ తాత్విక దృక్కోణం ఆధారంగానే చైనా ప్రభుత్వం వ్యవహరించింది. విదేశాల నుంచి చైనా సందర్శనకు వచ్చిపోయే ఆగంతుకుల నుంచి చైనాలో 'కోవిడ్-19' వైరస్ వ్యాపించింది. అయినా కోవిడ్-19 వైరస్ వ్యాప్తి నిరోధానికీ, నిర్మూలనకూ చైనా అన్ని చర్యలూ తీసుకుంది. ఫలితంగా ఈ విషయంలో చైనా ప్రభుత్వం వుహాన్‌లో వైరస్ వ్యాప్తి ఉధృతిని నిలువరించి గణనీయమైన క్రియాశీల ఫలితాలు సాధించింది."

– ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ గెబ్రియేసస్

"చైనాలో వైరస్ వ్యాధి విస్తరణ వల్ల చనిపోయిన వారి సంఖ్య ప్రపంచంలోనే తక్కువ. కోవిడ్-19 వైరస్ మహమ్మారి వల్ల ప్రపంచంలో అదనంగా చనిపోయినవారి సంఖ్య 1 కోటి 82 లక్షలని అంచనా. ప్రపంచవ్యాపితంగా చూస్తే ఈ వైరస్ మూలంగా ప్రతి లక్షమంది ప్రజలకు 120 మరణాలు నమోదు కాగా, అందులో 179 మరణాలు అమెరికాలో నమోదైతే – చైనాలో కేవలం 0.6 మరణాలు మాత్రమే నమోదైనాయి. చైనా అనుసరిస్తున్న విధానం ఒక్క చైనీయుడు కూడా ఈ మహమ్మారి వల్ల చనిపోకుండా చేయడం కాదు, సాధ్యమైనంత తొందరలో కోవిడ్-19 వ్యాధిని అదుపు చేసి సామాజికులపై పడే ఖర్చుల భారాన్ని కనీస స్థాయికి తేవడం. తద్వారా కోటానుకోట్లమంది ఆరోగ్యాన్ని, సాధారణ జీవితాన్ని, సరకులు ఉత్పత్తి క్రమాన్ని సాధ్యమైనంత వేగంగా తిరిగి నెలకొల్పడం. పశ్చిమ పసిఫిక్ ప్రాంత ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ సహితం చైనా కృషిని కొనియాడారు."

– సుప్రసిద్ధ అంతర్జాతీయ సైన్స్ జర్నల్ 'లాన్‌సెట్'

"కరోనా కేసుల సంఖ్యపై చైనా గోప్యత. రోజువారీ కేసుల వివరాలను ఇకనుంచీ వెల్లడించబోవటం లేదని చైనా జాతీయ ఆరోగ్య సంస్థ తెలిపింది. జీరో కోవిడ్ విధానాన్ని ఎత్తివేసిన 20 రోజుల్లోపే 25 కోట్ల మంది ప్రజలకు కరోనా సోకింది. దేశంలో ఆస్పత్రులలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్లన్నీ కొత్తగా సోకిన బీఎఫ్.7 వేరియంట్ బాధితుల శవాల గుట్టలతో మార్చురీలన్నీ నిండిపోతున్నాయి. 2023వ సంవత్సరంలో చైనాలో 20 లక్షల మంది కోవిడ్‌తో చనిపోవచ్చని ఒక అంచనా. ఒక మున్సిపాలిటీలో ఒక్క రోజులోనే 5.3 లక్షల కేసులు నమోదైనట్టు సమాచారం. ఆ లెక్కల్ని ఆన్‌లైన్‌లో అధికారులు తొలగించేశారు."

– అమెరికా నుంచి విడుదలైన *(25.12.22)* ఒక వార్త

ఇలాంటి 'వార్తలు' ఇలా విడుదలవుతూ ఉండగానే సుప్రసిద్ధ వ్యంగ్య చిత్రకారుడు మంజుల్ ఈనాటి భారత పాలకులు విడుదల జేస్తున్న కొన్ని ఆంక్షలపై ఒక చరుపు చరుస్తూ కార్టూన్ (26.12.22) వేశాడు. 'అక్కర్లేదు. నేవెడుతున్నది ఒక పెళ్లి కార్యక్రమానికి గానీ,

రెండో మాట



నోరు మూసుకుని పడుండే పార్లమెంటుకు కాదు సుమా' అని వ్యంగ్యాస్త్రం విసిరాడు. సరిగ్గా ఇదే సమయంలో జాతీయ స్థాయిలో ఇమ్యునైజేషన్ టెక్నికల్ సలహా సంఘ అధినేత ఎన్.కె. అరోరా 'భారతదేశంలో కోవిడ్-19 మహమ్మారి వల్ల ఏర్పడిన పరిస్థితులు 'అదుపు'లోనే ఉన్నాయి గానీ, అప్రమత్తత మాత్రం అవసర'మని చెబుతూ, 'ఇలాంటి అంటువ్యాధుల్ని అరికట్టడం అసలు సాధ్యమా? వ్యాక్సిన్‌లు పని చేస్తున్నట్టా, లేనట్టా?' అంటూ ప్రశ్నిస్తున్నారు. అంతేగాదు, 'ఇలాంటి మహమ్మారిని అరికట్టడం అసాధ్యం. ఫలితంగా కొన్ని చోట్ల వ్యాధి తీవ్రత ఎక్కువ కావొచ్చు, మరికొన్ని చోట్ల తక్కువగా ఉండొచ్చు. అంతే తేడా' అని అరోరా అన్నారు. ఆధునిక శాస్త్ర వైజ్ఞానిక దృష్టితో వైరస్ క్రిములను అరికట్టే విధానాన్ని జయప్రదమైన ప్రయోగాలతో నిరూపించిన శాస్త్రవేత్త, 19వ శతాబ్దపు సుప్రసిద్ధ భౌతికవాద శక్తి లూయీ పాశ్చర్! ఇంతటి వైజ్ఞానిక ప్రగతి బాటల్ని విస్మరించి పాలకులూ, కొన్ని వ్యాపార పత్రికలూ ఏ అమెరికా నుంచో విడుదలయ్యే చౌక బారు కథనాలను భుజాన వేసుకుని ప్రజా బాహుళ్యాన్ని గందరగోళపర్చడం ఒక ఆనవాయితీగా మారింది.

అంతేగాదు, ఏనాడో భారతదేశంలో దేశ వైద్య పరిషత్ ఖరారు చేసిన శాస్త్రీయ నిర్ణయాలను, ఆదేశాలను పక్కనపెట్టి, వ్యాపార సరళిలో ప్రయివేట్ మందుల కంపెనీలతో మిలాఖత్ అయ్యి, భారత మెడికల్ కౌన్సిల్ అప్పజెప్పిన సాధికారిక ఆదేశాలను పెక్కుమంది వైద్యులు, ఇతర ఆరోగ్య శాఖ అధికారులు విస్మరించడంవల్ల – దేశ ఆరోగ్య వ్యవస్థ ప్రయివేట్ వ్యాపార ధోరణికి అలవాటు పడిపోయింది. అందుకే భారత మెడికల్ అసోసియేషన్, దేశీయ డాక్టర్లకు వంద రకాల ప్రశ్నలను సంధించి, సుమారు 81 శాతం మంది డాక్టర్ల నుంచి సమాధానాలు రాబట్టింది. వారిలో 37 శాతం మంది మెడికల్ కంపెనీల ప్రతినిధులతో వారానికి ఒకసారి సంభాషిస్తామని చెప్పగా, 25.9 శాతం మంది నెలకు రెండుసార్లయినా చర్చిస్తామని చెప్పారు. కాగా, 69.1 శాతం మంది డాక్టర్లు మాత్రం ప్రయివేట్ వైద్య కంపెనీల ప్రతినిధులు తమకు ఇవ్వజూపే మందుల ప్రయోజనాలను అతిగా చూపుతూ, సదరు కంపెనీల మందులవల్ల కలిగే ఇబ్బందుల్ని గురించి తక్కువగా చెబుతున్నామని తెలిపారు. ఇటు 63 శాతం మంది డాక్టర్లు ప్రయివేట్ కంపెనీల నుంచి తమకు స్టేషనరీ సామాను, మందుల శాంపిల్స్, కంపెనీల తాలూకు జర్నల్స్ ఉచితంగా అందుతున్నాయని వెల్లడించగా, ప్రయివేట్ ఫార్మా కంపెనీలతో గానీ, వాటి ప్రతినిధులతోగానీ మాట్లాడే సందర్భాల్లో పాటించాల్సిన జాగ్రత్తల గురించి భారత వైద్య పరిషత్ నిర్ణయించిన జాగ్రత్తలను, హెచ్చరికలను 70.4 శాతం డాక్టర్లు బొత్తిగా చదవలేదని రుజువైంది. ప్రయివేట్ ఫార్మా కంపెనీలతో చర్చల్లో వైద్యులు పాటించాల్సిన నైతిక ప్రమాణాలను ఉల్లంఘిస్తే ఎదుర్కోవలసిన శిక్షలు కూడా వైద్యులకు తెలియక పోవడం మరీ ఆశ్చర్యకరం. 2014 నాటికే భారత వైద్యమండలి నిర్ణయించిన నైతిక ప్రమాణాలు, ఫార్మా కంపెనీలతో పాలకుల లోపాయికారీ ఒప్పందాల ఫలితంగా మరింత దిగజారిపోతూ వచ్చాయి. కాగా, ఇంత దిగజారుడు ప్రవర్తన మధ్య కూడా 58 శాతం మంది డాక్టర్లు ప్రయివేట్ ఫార్మా కంపెనీల నుంచి ప్రలోభాలకు లొంగడం 'అనైతిక ప్రవర్తన'గా ప్రకటించడం సంతోషకరం.

అర్ధ సత్యాలతో కూడుకున్న ప్రస్తుత పరిస్థితులలో గమనించవలసిన విషయం ఏమిటంటే, కోవిడ్-19 వ్యాప్తిని నిరోధించేందుకు చైనా విధించుకున్న ఆంక్షలను 'ఎత్తి వేయాలని' గగ్గోలు పెట్టిన విదేశీ పాలకులే (భారతదేశం సహా), ఆంక్షలు ఎత్తివేసిన తర్వాత కూడా పరిస్థితులలో మార్పు లేదని 'ఎత్తిపొడుపు' మాటలు వల్లించడం ఎలాంటి 'నీతో' సంతృప్తికరంగా వివరించ గలగాలి. లూయీ పాశ్చర్ అన్నట్టు 'మానవ ఆరోగ్య రక్షణకూ, క్రిముల సంహారానికీ ప్రాథమిక గ్యారంటీ – శాస్త్ర విజ్ఞా నమేగానీ చిట్కాలు కావు'!

అందుకే కవి పెరుగు రామకృష్ణ అంటాడు: "జీవితమే వ్యాపారమై పోయిన వ్యవస్థలో/ రోజూ మరణించడం/ మళ్లీ రోజూ బతకడం/స్నానమయ్యాక గుడ్డలు తొడుక్కున్నట్టే!" ఎందుకీ పరిస్థితుల వైపు మన దేశం పరుగెడుతోందన్న ప్రశ్నకు నివృత్తిగా విశ్వకవి టాగూర్ ప్రార్థనను మరొక్కసారి విందాం: 'నన్ను ప్రార్థించనీ/ ప్రమాదాల నుంచి రక్షించమని కాదు/ ధైర్య సాహసాలతో ఎదుర్కొనే శక్తిని/ కలిగించమని ప్రార్థించనీ/

నన్ను కోరుకోనీ/ నాకు సంభవించే నా బాధలను పోగొట్టమని కాదు/ కష్టనష్టాలను అతి తేలిగ్గా భరించగల/ శక్తిని కోరుకోనీ/ నన్ను ఆశించనీ, నా జీవిత పోరాటంలో మిత్రుల సహకారాన్ని/ దిగ్విజయం పొందడానికి నా సొంత శక్తిని ఆశించనీ/ నన్ను అర్థించనీ/ ఆతురతతో భయపడి రక్షణ కోసం కాదు/ నేను నా స్వాతంత్ర్యాన్ని సిద్ధించుకోవడానికి శక్తి సామర్థ్యాలు అర్థించనీ/ ఓ ప్రభూ!/ నాకు కలిగే దిగ్విజయాలలో మాత్రం నీ కరుణా/ కటాక్షాలను స్మరించే పిరికివానిగా చేయకు/ పరాజయాలలో నీ చేయూత అర్థించనీ!'

abkprasad2006@yahoo.co.in

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### రెచ్చగొడుతున్నారు



లోక్‌సభ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ మీద కర్ణాటక పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నాను. ఈ నిందితురాలు తనకు ఇచ్చిన (మెడికల్) బెయిల్‌ను ఉల్లంఘిస్తూ ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. గౌరవనీయ సుప్రీంకోర్టును ధిక్కరిస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

– తెహసీన్ పూనావాలా, ఆంట్రప్రెన్యూర్

### ఎందుకు సంకుచితం?



ఎందుకు హిందువులు ఇతర మతాలకు భయపడుతున్నారు? ఎందుకు ఇతర అలవాట్లను విమర్శిస్తున్నారు? సరళంగా చెప్పాలంటే – వాళ్లు తమ స్వీయ మతంలో బలంగా పాతుకుని లేరు. 'నువ్వు నీలా ఉండు' అని చెప్పారు స్వామి వివేకానంద. అలా చేస్తే ఈ సంకుచితాల నుంచి బయటపడొచ్చు.

– స్వామి సమర్పణానంద, సాధువు (బేలూరు మఠం)

### ఇది పట్టించుకోరా?



తాలిబన్ల స్థానంలో వార్తా శీర్షికలు 'ముస్లిం బాలికలకు విద్యను నిషేధించిన ఇజ్రాయిల్' అనో, 'ముస్లిం బాలికల విద్య మీద భారత్ నిషేధం' అనో ఉంటే– యావత్ అంతర్జాతీయ సమాజం పూర్తి భిన్నంగా వ్యవహరించి ఉండేది.

– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

### స్త్రీలంటే చులకనా?



ఆఖరికి ఎంతో ప్రజ్ఞావంతులుగానూ, ప్రగతిశీలురుగానూ కనబడే పురుషులు కూడా లింగ పరమైన జోకులు సరదాగా ఉంటాయని అనుకుంటారు. దీన్ని నేను భరించలేను.

– నిద్ కిర్మానీ, ఫెమినిస్ట్ సోషియాలజిస్ట్

### రోజువారీ ఒత్తిడి



ఒక మహిళ జీవితంలో అత్యంత ఒత్తిడి కలిగించే అంశాల్లో ఒకటి ఏమిటంటే – బ్రేక్‌ఫాస్ట్, లంచ్, టీ, డిన్నర్‌లకు ఏం చేయాలి అనేది – రోజు తర్వాతి రోజు తర్వాతి రోజు...

– స్మితా బరూహ్, అడిక్షన్స్ కౌన్సిలర్

# తొలి నవలా రచయిత్రులకు పూమాల

పరామర్శ



పి. సత్యవతి

మహిళా సృజనకారుల గురించీ, వారు జీవించిన సమాజం గురించీ, వారి రచనా స్వేచ్ఛ గురించీ పరిశోధించి పాఠకుల చేతిలో పండు వలిచి పెట్టినట్లు రాయడంలో ఎంత శ్రమ, శ్రద్ధ, ఆసక్తి అవసరమో కదా. అటువంటి ఆసక్తీ, శ్రమా శ్రద్ధల సమ్మేళనమే మృణాళిని 'విశ్వమహిళా నవల'.

ఇందులో జాపనీస్, ఫ్రెంచ్, జర్మన్, ఇంగ్లిష్, రష్యన్ భాషలలో తొలి నవలా రచయిత్రుల పరిచయం, వారి జీవించిన కాలంలో స్త్రీలకుండే పరిమితులూ, రచయిత్రుల జీవన శైలీ, రచనా శైలీ, వస్తువూ అన్నిటినీ విస్తృతంగా చర్చించారు మృణాళిని. ప్రపంచ సాహిత్యంలోనే మొదటి నవల రాసిన జాపనీస్ రచయిత్రి లేడీ మూరసాకీ (978–1014) నుంచి ఫ్రెంచ్ రచయిత్రి జార్జ్ సాండ్ (1804 –1876) వరకూ పదముగ్గురు రచయిత్రుల పరిచయం స్త్రీల సాహిత్య చరిత్రను మనముందు ఉంచుతుంది.

లేడీ మూరసాకి వ్రాసిన 'ది టేల్ ఆఫ్ గెన్జి' ప్రపంచ భాషల్లోనే తొలి నవల అని విమర్శకులు గుర్తించారు. వెయ్యి పేజీల ఈ వచన రచన అప్పటికింకా ప్రాచుర్యంలో లేని నవలా ప్రక్రియను అవలంబించింది. 1వ శతాబ్దం మొదలు 19వ శతాబ్దం వరకూ ఆయా దేశాలలో ఉండే మహిళా రచయిత్రులు అక్కడి రాజకీయ పరిస్థితులు, సామాజిక నియమ నిబంధనలు, పితృస్వామ్యం... వీటన్నిటినీ తట్టుకుని నవలలు రాశారని ఈ పుస్తకం వల్ల తెలుస్తుంది. కొంతమంది రచయిత్రుల కృషి వారి జీవిత కాలంలో గుర్తింపబడకపోయినా... తరువాత కొంత మంది సద్విమర్శకుల వలన, స్త్రీవాదుల వలన గుర్తించబడింది. స్త్రీలు తమ స్వంత పేర్లతో రాయ డానికి జంకి పురుషుల పేర్లతో రాయడం లేదా అనామకంగా రాయడం, ఎప్పుడైనా ధైర్యంగా రాయడం, రాజకీయాలను గురించి రాయడం, ప్రభుత్వాలను ప్రశ్నించడం... చివరకు నెపోలియన్‌నే నిలదీసి ఆయన ఆగ్రహానికి గురి కావడం ఈ పుస్తకంలో చూస్తాం. త్రికోణ ప్రేమ కథలు, హారర్ కథలు రాసిన తొలి రచయిత్రులు కూడా వీరు అయ్యారు. పల్లెసీమల అందాలని రొమాంటిసైజ్ చేయడం కాక అక్కడి ప్రజా జీవనాన్ని చిత్రించారు. కొందరు రచయిత్రులు ప్రఖ్యాత పురుష రచయితలకు ప్రేరణ కూడా అయ్యారు. సమాజం విమర్శించే జీవన శైలులు కూడా అవలంబించారు.



ఈ పుస్తకానికి ఓల్గా కూలంకషమైన పరిచయం రాశారు. రచయిత్రుల జీవన కాలం, రచనా కాలం, వారి జీవిత విశేషాలు, అనుభవాలు... ఏదీ వదలకుండా ఒక సంపూర్ణ చరిత్రను... అందులోనూ ప్రపంచ మహిళా రచయితల చరిత్రను ఇష్టంగా మనకు అందించిన మృణాళినికి అభినందలు లేదా కృతజ్ఞతలు అనేవి చాల పేలవమైన మాటలు. ప్రస్తుతం అన్ని విశ్వవిద్యాలయాల్లో స్త్రీ అధ్యయన కేంద్రాలు ఉంటున్నాయి. ఆ కేంద్రాలలో ఈ పుస్తకం తప్పని సరిగా ఉండాలి. ఇటువంటి వ్యాస సంపుటులు ఇంగ్లిష్‌లో ఉంటాయి కానీ తెలుగులో ఇదే మొదటిది అని అనుకుంటున్నాను. ఇంగ్లీష్‌కన్నా తెలుగులో చదువుకోడం సులభం కనుక యిది సాహితీ ప్రేమికులకూ చరిత్ర అభి మానులకూ మంచి కానుక. మరొక విషయమేమిటంటే ఇందులో మృణాళిని ప్రతి విదేశీ పదానికీ సరి అయిన ఉచ్చారణ ఇచ్చారు. ధృతి పబ్లికేషన్స్ ప్రచురించిన 'విశ్వ మహిళా నవల' హైదరాబాద్‌లోని నవోదయలో కొనుక్కోవచ్చు. చదువుతూ నాణ్యమైన సమయం గడపవచ్చు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి

# కృష్ణా జలాలకు 'ఇదేం ఖర్మ బాబూ...'

సందర్భం



వి.వి.ఆర్. కృష్ణంరాజు

జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రానికి ఏదో అన్యాయం జరిగిపోతోందంటూ ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాజాగా మరో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దానికి 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' పేరు పెట్టారు. నిజానికి తెలుగు నిఘంటువులో 'ఖర్మ' అనే పదమే లేదు. తెలుగు భాష పట్ల అపారమైన గౌరవం ఉన్న ఎన్టీ రామారావు తన పార్టీకి తెలుగుదేశం అనే పేరు పెట్టారు. అటువంటి పార్టీకి నేడు నాయకత్వం వహిస్తున్న చంద్రబాబు నాయుడు అర్థం పర్థంలేని ఒక పదాన్ని సృష్టించి ఆ పేరుతో ప్రజలను పెడతోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే తరుణంలో రాష్ట్రాభివృద్ధికి అడుగడుగునా అడ్డు పడుతున్నారంటూ 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ బాబూ' అంటూ ప్రత్యర్థులు ఆయన్ని విమర్శిస్తున్నారు. అయితే చంద్రబాబు నాయుడు విమర్శలను పట్టించుకోవడం కానీ, తన తప్పుల వల్ల ప్రజలకు, పర్యావరణానికి హాని జరుగుతున్నా పశ్చాత్తాప పడటం కానీ చేయరు.

ఆయన చట్ట విరుద్ధ పనుల్లో... కృష్ణానదీ తీరాన నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనంలో ఇప్పటికీ నివసిస్తుండటం ఒకటి. ఈ ప్రాంతంలోని నివాస ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున విడుదల అవుతున్న కాలుష్యం కారణంగా కృష్ణానది చివరి రిజర్వాయర్ అయిన ప్రకాశం బ్యారేజ్ వద్ద నిల్వ చేస్తున్న జలాలు పెద్ద ఎత్తున కలుషిత మవుతున్నాయి. ఇదే విషయాన్ని కేంద్ర పొల్యూషన్ బోర్డు 'వాటర్ క్వాలిటీ ఆఫ్ రివర్స్ 2021' పేరిట విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది. 2022, అక్టోబర్ 13న బోర్డు అప్‌డేట్ చేసిన వివరాల ప్రకారం... విజయవాడ కృష్ణా బరాజ్ వద్ద గల ఈ నీరు పానయోగ్యంగా ఏ మాత్రం లేదని స్పష్టమయింది.

కృష్ణా కరకట్ట ప్రాంతంలో గుంటూరు జిల్లా పరిధిలో 48 భవనాలు, కృష్ణా జిల్లా పరిధిలో 18 భవనాలు ఉన్నాయి. వీటిలో చంద్రబాబు నివాసంతో పాటు వందలాది మంది రోగులకు నిలయమైన ప్రకృతి వైద్యశాల కూడా అక్కడే ఉంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలకు డ్రైనేజ్ సదుపాయం లేదు. వీరు వాడే నీరంతా కృష్ణా బరాజ్ వద్ద గల నీటిలోనే కలిసి పోతోంది. ఫలితంగా ఈ జలాలు కలుషితమవుతున్నాయి. కేంద్ర పొల్యూషన్ బోర్డు నివేదిక ప్రకారం నదీజలాల్లో బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బి.ఒ.డి.) ఐదు రోజుల సగటు విశ్లేషణల్లో లీటర్‌కు రెండు మిల్లీ గ్రాముల కన్నా తక్కువ ఉండాలి. గుంటూరు జిల్లా అమరావతి వద్ద



కృష్ణా జలాల్లో బి.ఒ.డి. 1.4 మిల్లీగ్రాములుండగా అదేనీటిలో కృష్ణా బరాజ్ వద్ద బి.ఒ.డి. 2.6 మిల్లీ గ్రాములకు పెరిగి పోయింది. అయితే ఈ నీటినే కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజలు మంచి నీటి అవసరాలకు ఉపయోగిస్తున్నారు.

కృష్ణా బరాజ్‌కు కుడివైపున నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనంలో మాజీ ముఖ్యమంత్రి నివసించడం 'రివర్ కన్సర్వెన్సీ యాక్ట్'ను ఉల్లంఘించడమే. ఈ యాక్ట్ ప్రకారం నదిని ఆనుకుని 500 మీటర్ల వరకూ ఎటువంటి నిర్మాణాలను చేయకూడదు. కానీ మాజీ ముఖ్యమంత్రి నివసిస్తున్న భవనం నదికి వందమీటర్ల దూరంలోనే ఉంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ 1996 మార్చి ఎనిమిదో తేదీన విడుదల చేసిన జీఓ నం. 111 ప్రకారం... నదికి సమీపాన ఎటువంటి నిర్మాణాలు చేయకూడదు. ఎటువంటి వ్యర్థ పదార్థాలు నదిలో వదల కూడదు. భారత శిక్షాస్మృతి సెక్షన్ 277 ప్రకారం నీటి వనరులను కలుషితం చేసే వారికి మూడు నెలల జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించవచ్చు.

ప్రస్తుతం చంద్రబాబు నివాస ప్రాంతంలో ఉన్న కట్టడాలన్నీ నదీ 'పరిరక్షణ చట్టం–1884' నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవేనని స్వయానా అప్పటి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు 2015 జనవరిలో చెప్పడమే కాక... వివిధ శాఖల నుంచి నోటీసులు కూడా ఇప్పించి వీటన్నిటినీ కూల్చి వేస్తామని హడావిడి చేశారు. ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివసిస్తున్న లింగమనేని ఎస్టేట్ భవనం కూడా ఈ కూల్చివేత భవనాల జాబితాలో ఉంది. నదీ తీర ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టడం నిషిద్ధం. ఇదే విషయాన్ని అప్పటి ఆయన మంత్రి వర్గ సహచరుడే ప్రకటించినప్పటికీ చంద్రబాబు పెడచెవిన పెట్టారు.

వందలాది కోట్ల రూపాయల వ్యయంతో కృష్ణా పుష్కరాలను నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ నదికి పవిత్ర హారతులు కూడా ఇచ్చారు. ఒకవైపు పుణ్య స్నానాలు చేస్తూ, హారతులు ఇస్తూ... మరోవైపు ఆ నదినే వ్యర్థాలతో అపవిత్రం చేయడం అత్యంత శోచనీయం. చంద్రబాబు నాయుడు పంతాలకు, పట్టింపులకు పోకుండా ఆ ప్రాంతంలోని తన నివాసాన్ని వేరే చోటికి తరలించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. అలాగే ఈ ప్రాంతంలోని మిగిలిన అక్రమ కట్టడాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం తొలగించాలి. కృష్ణా నది శుద్ధికి శ్రీకారం చుట్టాలి.

వ్యాసకర్త అధ్యక్షుడు ఎ.పి. ఎడిటర్స్ అసోసియేషన్
మొబైల్: 95052 92299

# పనిలోనే ఆనందం

స్వర్గం, నరకం రెండింటికి వెళ్లే దోవలో దేవుడు నిలబడి వచ్చే ఆత్మలను చూస్తున్నాడు. ఒక ఆత్మ వచ్చి దేవుని ముందు నిలబడింది.

"భూమ్మీద నువ్వు చేసిన ఒక మంచి పని చెప్పు. నిన్ను స్వర్గానికి పంపాలా నరకానికి పంపాలా?" అని నిర్ణయిస్తాను అన్నాడు దేవుడు.

"స్వర్గానికీ, నరకానికీ మధ్య తేడా ఏమిటి?" అని అడిగింది ఆత్మ.

"స్వర్గంలో మొత్తం కేవలం ఆనందమే ఉంటుంది. నరకంలో అయితే పనులు చెయ్యాలి" అన్నాడు దేవుడు.



జ్యోతిర్మయం

"స్వర్గంలో ఏ పనీ చేయక్కర లేదా?" అంది ఆత్మ.

"స్వర్గంలో ఏ పనీ ఉండదు. కేవలం ఆనందం అనుభవించడమే" అన్నాడు దేవుడు.

"క్షమించు దేవా! పని లేకపోతే అది స్వర్గం ఎలా అవుతుంది? పని చెయ్యడంలో తప్ప ఆనందం ఇంకెందులో ఉంది?" అని అడిగింది ఆత్మ.

దేవుడు ఆ మాటకు సంతోషించాడు. అప్పుడు ఇలా అన్నాడు. "నా తరపున ఈ విషయం సమస్త మానవాళికీ తెలియజేయి. ఎవరి బాధ్యతలు వారు నిర్వహిస్తూ పనులు చేయడమే స్వర్గం అని గట్టిగా చెప్పు" అని ఆత్మను భూమ్మీదకు తిరిగి పంపాడు.

ఇది కథ కావచ్చు. కాని పనిలోనే స్వర్గం ఉందనే సత్యం మనం గుర్తించాలి. బాధ్యత మరిచి బద్ధకం పెంచుకొని బతికితే అదే అసలైన నరకం అని గ్రహించాలి.

– శివలెంక ప్రసాదరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: శు.చవితి ఉ.7.12 వరకు, తదుపరి పంచమి తె.5.02 వరకు (తెల్లవారితే బుధవారం), నక్షత్రం: ధనిష్ఠ రా.8.31 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం: రా.3.17 నుండి 4.45 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.44 నుండి 9.26 వరకు, తదుపరి రా.10.43 నుండి 11.33 వరకు, అమృతఘడియలు: ఉ.10.44 నుండి 11.56 వరకు; రాహుకాలం : ప. 3.00 నుండి 4.30 వరకు; యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు; సూర్యోదయం 6.32; సూర్యాస్తమయం 5.31.

## క్లుప్తంగా...

### 74 ఏళ్ల వయసులో పరిశోధనకు డాక్టరేట్


వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ప్రసాద్

ఏయూక్యాంపస్: ఆయన వయసు 74 ఏళ్లు. 'దేవాలయాల పరిపాలన–సింహాచల దేవస్థానం భక్తుల అభిప్రాయాలు, సౌకర్యాలు, జరిగే కార్యక్రమాల వివరాలు' అనే అంశంపై పరిశోధనలు చేపట్టారు. ఆచార్య బి.మోహన వెంకటరామ్ పర్యవేక్షణలో దిగ్విజయంగా పూర్తి చేశారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను సోమవారం అందుకున్నారు. ఆయన మరెవరో కాదు ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధక విద్యార్థి జి.రామ కృష్ణ ప్రసాద్(రాంబాబు). దేవాలయ వ్యవస్థ నడవడానికి భక్తులే ముఖ్యభూమిక పోషిస్తున్నారని తన పరిశోధనలో వెల్లడించారు. సింహాచలం దేవాలయంలో భక్తులకు కలిగిస్తున్న సౌకర్యాలు, ఎదురవుతున్న ఇబ్బందులు తదితర వివరాలు విశ్లేషించారు. సింహాచల దేవస్థానంలో భక్తులకు ఉపయుక్తంగా చేపట్టవలసిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సేవలపై సూచనలు చేశారు. కళాభారతి కార్యదర్శిగా, హిందూ పరిరక్షణ ట్రస్ట్ విశాఖ విభాగ అధ్యక్షులుగా, రామకృష్ణ మిషన్ ట్రస్టీగా విభిన్న రంగాలలో తన సేవలను అందిస్తున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రసాద్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, ఆచార్య బి.మోహన వెంకట రామ్ అభినందించారు.

### నేడు రాష్ట్ర స్థాయి శాప్ యోగా లీగ్ పోటీలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాప్ లీగ్ ఫేజ్–2 యోగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం తిరుపతి వేదికగా జూనియర్స్ విభాగంలో 8–12, 12–14 ఏళ్ల వయస్సు క్రీడాకారులను రెండు గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించనున్నారు. మరో వైపు 29న కాకినాడలో సీనియర్స్ విభాగంలో 14–17, 17–21 ఏళ్ల వయస్సు యోగా సాధకులు పోటీ పడనున్నారు.

### నేడు తిరుపతికి సీజేఐ రాక

తిరుపతి అర్బన్/గుంటూరు వెస్ట్: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ ధనంజయ వై చంద్రచూడ్ మంగళవారం తిరుపతికి రానున్నారు. సీజేఐ మంగళవారం ఉదయం 9.45 గంటలకు ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.35 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారని కలెక్టర్ వెంకటరమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డుమార్గాన తిరుమల చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారని పేర్కొన్నారు. 28న కుటుంబసమేతంగా శ్రీవారిని దర్శించుకుంటారని, 29వ తేదీ సాయంత్రం 5.40గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి విజయవాడకు వెళతారని వివరించారు.

**30న జ్యుడిషియల్ అకాడమీని ప్రారంభించనున్న సీజేఐ**

మంగళగిరి మండలం కాజ గ్రామంలో ఏర్పాటుచేసిన జ్యుడిషియల్ అకాడమీని ఈ నెల 30వ తేదీన సీజేఐ జస్టిస్ ధనంజయ వై చంద్రచూడ్ ప్రారంభిస్తారని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. అంతకుముందు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో సీజేఐ పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు కూడా పాల్గొంటారని తెలిపారు.

### బాబును తరిమేసేందుకు సిద్ధం

- 820వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రానికి శనిలా దాపురించి పేదల హక్కులను హరిస్తున్న చంద్రబాబును తరిమేసేందుకు రాష్ట్రంలో 85 శాతం ఉన్న బహుజనులంతా సిద్ధంగా ఉన్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 820వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. అమరావతి పేరుతో రైతులను అడ్డుపెట్టుకుని ఓ సామాజిక వర్గం, బాబు బినామీలు డ్రామాలు ఆడుతున్నారనేది బహిరంగ సత్యమని, లేనిది ఉన్నట్లు సృష్టించాలని చూస్తున్న ఎల్లో మీడియాను రాష్ట్ర ప్రజలు నమ్మడం ఎప్పుడో మానేశారన్నారు. అభివృద్ధి , సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగుతున్నదని కితాబిచ్చారు. రాజధాని పేరుతో మూడు పంటలు పండే 33 వేల ఎకరాలను రైతుల నుంచి లాక్కుని రైతుల ముసుగులో దొంగ ఉద్యమం చేస్తుండడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై కుల ఉగ్రవాదుల్లా మారి తమ కనుసన్నల్లో రాష్ట్రాన్ని ఉంచుకోవాలని కులమతాలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చేస్తున్న ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవనే నిజం తెలుసుకుని మసలుకోవాలని హితవు పలికారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులిదాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ జనతా గ్యారేజ్‌లు




సాక్షి, అమరావతి

రాష్ట్ర ప్రజా రవాణా విభాగం డిపోలు త్వరలో 'జనతా గ్యారేజ్'లుగా మారి.. ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాలకు కూడా సర్వీసింగ్ సేవలందించనున్నాయి. ఆదాయ వనరులను పెంపొందించుకునే ప్రణాళికలో భాగంగా జనతా గ్యారేజ్ విధానానికి ఆర్టీసీ రూపకల్పన చేసింది. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా ఉన్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక స్వయం సమృద్ధి సాధించేందుకు ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో దాదాపు 1.50 కోట్ల వాహనాలుండగా.. వాటిలో సుమారు 17 లక్షల వరకు ప్రైవేటు వాణిజ్య వాహనాలే ఉన్నాయి. వాటి యజమానులు ప్రస్తుతం ప్రైవేటు సెంటర్లలో తమ వాహనాలకు సర్వీసింగ్ చేయిస్తున్నారు. ఈ భారీ 'సర్వీసింగ్' మార్కెట్‌లోకి ఇప్పుడు ఆర్టీసీ కూడా జనతా గ్యారేజ్‌ల ద్వారా ప్రవేశించబోతోంది. నిపుణుల కమిటీ సూచనల మేరకు కార్యాచరణ చేపట్టింది.

**మూడు దశల్లో 12 డిపోల్లో..**

జనతా గ్యారేజ్ విధానాన్ని మూడు దశల్లో 12 డిపోల్లో ప్రవేశపెట్టాలని ఆర్టీసీ నిర్ణయించింది. మొదటి దశలో విజయనగరం, విజయవాడ, నెల్లూరు, కడప డిపోల్లో ప్రైవేటు వాహనాలకు సర్వీసింగ్ సేవలందిస్తారు. ఈ డిపోల్లో ఇప్పటికే ఆర్టీసీ బస్సు టైర్ల రీట్రేడింగ్ యూనిట్లున్నాయి. వీటి ద్వారా ప్రైవేటు వాహనాల టైర్లను కూడా రీట్రేడింగ్ చేసే సేవలను ప్రవేశపెడతారు. వాహనాల సాధారణ సర్వీసింగ్, అన్ని రకాల రిపేర్లు, బాడీ పెయింటింగ్, వాటర్ సర్వీసింగ్ తదితర సేవలను అందుబాటులోకి తెస్తారు. ఇందు కోసం అవసరమైన అదనపు యంత్ర పరికరాలను కొనుగోలు చేయనున్నారు. ఇప్పటికే ఆర్టీసీ టెక్నికల్ స్టాఫ్‌కు శిక్షణ కార్యక్రమం కూడా పూర్తయ్యింది. ఇతర సేవల కోసం అవుట్ సోర్సింగ్ విధానంలో సిబ్బందిని నియమించాలని భావిస్తున్నారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా ఆర్టీసీ వాహనాల స్పేర్ పార్టులు, ప్రైవేటు వాహనాల స్పేర్ పార్టులకు వేర్వేరుగా స్టోర్ రూమ్‌లు, రికార్డులు నిర్వహిస్తారు. తొలి దశలో భారీ వాహనాలకు సర్వీసింగ్ సేవలందిస్తారు. అనంతరం కార్లు, ఎస్‌యూవీలు, ఇతర వాహనాలకు సర్వీసింగ్ సేవలందుబాటులోకి వస్తాయి. రాష్ట్రంలో ఐటీఐ, ఆటోమొబైల్ డిప్లొమా విద్యార్థులకు అప్రెంటీస్ విధానాన్ని మరింత విస్తృతంగా అందుబాటులోకి తెచ్చేందుకు ఈ డిపోలు ఉపయోగపడతాయి. రెండో దశలో విశాఖ, కాకినాడ, రాజమహేంద్రవరం , గుంటూరు, తిరుపతి డిపోల్లో, మూడో దశలో శ్రీకాకుళం, అనంతపురం, కర్నూలు డిపోల్లో జనతా గ్యారేజ్ విధానాన్ని ప్రవేశపెడతారు. మూడు నెలల్లో జనతా గ్యారేజ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ కృషి చేస్తోంది.

# వైద్య విద్యార్థి ఆత్మహత్య

- అతని మరణంపై ఎన్నో అనుమానాలు..!
- మొబైల్‌కు వచ్చిన మెసేజ్‌పై సందేహాలు.. కాల్‌డేటా పరిశీలిస్తున్నామన్న పోలీసులు


రోదిస్తున్న తల్లిదండ్రులు


గిరితేజ (ఫైల్)

కొమ్మాది(భీమిలి): అపార్టుమెంట్‌పై నుంచి దూకి ఓ వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మరణం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... విశాఖ సీతమ్మధారకు చెందిన గోగినేని కిరణ్ కుమార్, రాధిక దంపతుల కుమారుడు గోగినేని గిరితేజ(20) రుషికొండలోని గీతం కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వారి అమ్మాయి వేదశ్రీ ఇదే కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతుంది. వీరు సీతమ్మధార నుంచి ప్రతి రోజూ ఆటోలో కళాశాలకు వెళ్లి వస్తున్నారు. రోజులాగే సోమవారం ఉదయం వీరిద్దరు ఆటోలో క్యాంపస్‌కు చేరుకున్నారు. వేదశ్రీ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లిపోగా, గిరితేజ మాత్రం మెడికల్ కళాశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లలేదు. అరగంట తర్వాత ఎండాడ స్కైలైన్ అపార్టుమెంట్ 11వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే గిరితేజ ఎండాడ స్కైలైన్ అపార్టుమెంట్‌కు ఎందుకు వెళ్లాడు, ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడు అనే విషయాలు ప్రశ్నార్థకంగా మారాయి. సినిమాలు, షికార్లకు దూరంగా, అందరితో సరదాగా ఉండే గిరితేజకు ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమిటని కుటుంబ సభ్యులను వేధిస్తున్న ప్రశ్న. అపార్టుమెంట్‌లో ఒక వైపు అతని బ్యాగ్, కాస్త దూరంలో మరో వైపున సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించారు. తండ్రి ఎల్‌అండ్‌టీలో ఉద్యోగం చేస్తున్నారు. చేతికి అంది వస్తున్న బిడ్డ అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

**కాల్ డేటా ఆధారంగా పరిశీలన**

ఏసీపీ ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి, ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న సీసీ కెమెరాలలోని వీడియో ఫుటేజ్ ద్వారా గిరితేజ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. గిరితేజ మొబైల్‌కు సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు ఒక మెసేజ్ వచ్చింది. అది ఏంటనేది తెలియాల్సి ఉందని, కాల్ డేటా ఆధారంగా పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

### భారీగా గంజాయి ధ్వంసం

- విశాఖ జిల్లాలో 21,961 కేజీలు, తిరుపతి జిల్లాలో 1,174.103 కేజీల గంజాయికి నిప్పు


కాపులుప్పాడ దంపింగ్ యార్డులో గంజాయికి నిప్పు అంటిస్తున్న సీపీ శ్రీకాంత్, పోలీస్ అధికారులు

మధురవాడ(భీమిలి)/రేణిగుంట(తిరుపతి జిల్లా): విశాఖ, తిరుపతి జిల్లాల్లో భారీగా గంజాయిని అధికారులు ధ్వంసం చేశారు. విశాఖ జిల్లాలో 21,961 కేజీలు, తిరుపతి జిల్లాలో 1,174.103 కేజీల గంజాయికి నిప్పు పెట్టారు. వివరాల్లోకి వెళితే.. విశాఖ జిల్లా కాపులుప్పాడ డంపింగ్ యార్డులో ఇటీవల ఆపరేషన్ పరివర్తన నేపథ్యంలో పట్టుబడిన గంజాయిని నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో 29 పోలీస్ స్టేషన్ల పరిధిలో 518 కేసుల్లో సీజ్ చేసిన 21,961 కేజీల గంజాయి, 23 లీటర్ల హాష్ ఆయిల్(లిక్విడ్ గంజాయి), 0.960 గ్రాముల కుకీస్(గంజాయి టాబ్లెట్స్)ని కోర్టు ఉత్తర్వుల మేరకు నాశనం చేసినట్టు చెప్పారు. వీటి విలువ రూ.9,02,44,000 ఉంటుందని తెలిపారు. డీసీపీ సుమిత్ గరుడ, ఎస్ఈబీ ఎడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఎక్సైజ్ డీసీపీ బాబ్జిరావు, విశాఖ నార్త్ జోన్ ఏసీపీ చుక్కా శ్రీనివాసరావు, పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే తిరుపతి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన గంజాయిని సోమవారం రేణిగుంట మండలం, గాజులమండ్యం సమీపంలో దహనం చేశారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, డీసీ శ్రీలత, చిత్తూరు డీఎస్ఈఓ మదన్‌మోహన్‌రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపర్‌వైజర్లు స్వాతి, రవికుమార్ ఆధ్వర్యంలో రూ.1, 17, 41,000 విలువైన 1,174.103 కిలోల గంజాయికి నిప్పుపెట్టారు.

# టోకెన్ ఉంటేనే వైకుంఠ ద్వార దర్శనం

- తిరుపతిలో 9 ప్రాంతాల్లో జనవరి 1న సర్వదర్శనం టోకెన్ల జారీ
- 10 రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం
- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్


తిరుమలలో క్యూ లైన్లను పరిశీలిస్తున్న టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్

తిరుమల: టోకెన్లు ఉన్న వారికే శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం లభిస్తుందని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్పష్టం చేశారు. తిరుమలలో సోమవారం వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన అనంతరం ఈవో మీడియాతో మాట్లాడారు. వైకుంఠ ద్వార దర్శనం జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు 10 రోజుల పాటు ఉంటుందన్నారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా రూ.300 ఎస్ఈడీ టికెట్లు 2 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. తిరుపతిలో అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ ఎదురుగా విష్ణునివాసం, రైల్వేస్టేషన్ వెనుక 2, 3 సత్రాలు, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా శ్రీనివాసం కాంప్లెక్స్, ఇందిరా మైదానం, జీవకోన జిల్లా పరిషత్ హైస్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు మున్సిపల్ హైస్కూల్, ఎమ్మార్‌పల్లి జెడ్పీ హైస్కూల్, రామచంద్ర పుష్కరిణి వద్ద ఏర్పాటు చేస్తున్న కౌంటర్లలో టోకెన్లు ఇస్తామన్నారు. సర్వదర్శనం టోకెన్లు పొందిన భక్తులు తిరుమలలోని కృష్ణతేజ విశ్రాంతి గృహం వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు. భక్తులు టీటీడీ వెబ్‌సైట్, ఎస్వీబీసీ, ఇతర మాధ్యమాల ద్వారా టికెట్ల లభ్యతను ముందే తెలుసుకుని తమ తిరుమల ప్రయాణాన్ని ఖరారు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టోకెన్లపై కేటాయించిన ప్రాంతానికి నిర్దేశించిన సమయానికి మాత్రమే రావాలని కోరారు. తిరుమలలో వసతి సౌకర్యం తక్కువగా ఉన్నందున దర్శన టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే ముందు వచ్చిన వారికే ముందు అన్న ప్రాతిపదికపై వసతి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.

**శ్రీవారి దర్శనానికి 30 గంటలు**

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. దర్శన టోకెన్లు లేని భక్తులకు 30 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. కాగా, తిరుమల శ్రీవారిని సోమవారం అపోలో చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కలవంతర్‌సింగ్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామ్‌మనోహర్ నారాయణమిశ్రా, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నాగార్జున, జస్టిస్ సోమయాజులు, కరెంట్ గవర్నర్ ఫర్ వెస్ట్ న్యూ బ్రిటన్ ప్రావియన్స్ శశిధరన్ ముత్తువెల్, తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దర్శించుకున్నారు.

### డిజిటల్ దిగ్గజం ఇసుకపల్లి అస్తమయం


రామకృష్ణంరాజు (ఫైల్)

మురళీనగర్ (విశాఖ ఉత్తర): రెండు తెలుగు రాష్ట్రాల్లో డిజిటల్ కేబుల్ టీవీ ప్రసారాలతో ప్రముఖుడిగా పేరు గాంచిన శ్రీదేవి డిజిటల్ సిస్టమ్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత ఇసుకపల్లి రామకృష్ణంరాజు (73) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. ఆయన కేబుల్ ద్వారా ఇంటర్‌నెట్ సేవలను ప్రజలకు అందించారు. మంచి మనిషిగా సేవాదృక్పథం కలిగిన వ్యక్తిగా ఆయన అందరికీ చిరపరిచితులు. ఆయన మృతికి పలువురు సంతాపం ప్రకటించారు. మంగళవారం ఆయన అంతిమ యాత్ర నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

# లారస్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం

- నలుగురు కార్మికుల దుర్మరణం
- మరో కార్మికుడికి పరిస్థితి విషమం
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం
- సీఎం ప్రకటించారని వెల్లడించిన మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: అనకాపల్లి జిల్లా పరవాడలోని జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్‌లో సోమవారం జరిగిన భారీ అగ్నిప్రమాదంలో నలుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగాగాయపడిన మరో కార్మికుడి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఈ ప్రమాదంపై పరవాడ పోలీసులు తెలిపిన మేరకు.. లారస్ పరిశ్రమ యూనిట్–3లో మ్యానుఫ్యాక్చరింగ్ బ్లాక్–6లో డ్రైయర్ రూమ్‌ను మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో ఖమ్మం జిల్లాకు చెందిన బి.రాంబాబు, గుంటూరు జిల్లాకు చెందిన రాజేష్‌బాబు, అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం చౌడువాడకు చెందిన రాపేటి రామకృష్ణ, చోడవరం మండలం పెన్నవోలు గ్రామానికి చెందిన మజ్జి వెంకటరావు, విజయనగరం జిల్లాకు నెల్లిమర్లకు చెందిన ఎడ్ల సతీష్ శుభ్రం చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ వల్ల ఫ్లాష్‌ఫైర్ సంభవించింది. అగ్నిప్రమాదం జరిగిన గది మొత్తం రబ్బరుతో నిండి ఉంది. నిప్పురవ్వలు పడి రబ్బరు నిల్వలు అంటుకోవడంతో గది అంతా మంటలు, దట్టమైన పొగతో నిండిపోయింది. గదిలో ఉన్న ఐదుగురు కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు. వెంటనే పరిశ్రమకు చెందిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసి గాయపడినవారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మార్గంమధ్యలోనే బి.రాంబాబు (32), రాజేష్‌బాబు (36), రాపేటి రామకృష్ణ (32), మజ్జి వెంకటరావు (36) మృతిచెందారు. మృతదేహాలను కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎడ్ల సతీష్ (36) నగరంలోని కిమ్స్ ఐకాన్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అగ్నిప్రమాద సమాచారం తెలిసిన వెంటనే పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ తేజేశ్వరరావు అక్కడికి చేరుకున్నారు. ప్రమాదస్థలాన్ని అనకాపల్లి ఎస్పీ గౌతమిశాలి సోమవారం రాత్రి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

**మృతులు వీరే..**

1. బి.రాంబాబు (32), ఖమ్మం జిల్లా
2. రాజేష్‌బాబు (36), గుంటూరు జిల్లా
3. రాపేటి రామకృష్ణ (32), అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం చౌడువాడ
4. మజ్జి వెంకటరావు (36), చోడవరం మండలం పెన్నవోలు

**మృతుల కుటుంబాలకు పరిహారం**

పరవాడలోని లారస్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలను, ఇక్కడి పరిస్థితి ఆయన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు ప్రకటించారని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కార్మికుడికి వైద్య సహాయం అందించాలని వైద్యాధికారులను, ప్రమాదానికి కారణాలు తెలుసుకోవాలని కలెక్టర్, ఎస్పీలను మంత్రి ఆదేశించారు.

### మంత్రి సురేష్‌కు మాతృవియోగం

- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ థెరీసమ్మ కన్నుమూత

సాక్షి, అమరావతి/మార్కాపురం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాతృమూర్తి థెరీసమ్మ (85) కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. థెరీసమ్మ భౌతికకాయాన్ని సోమవారం ఉదయం ప్రకాశం జిల్లా మార్కాపురంలోని మంత్రి నివాసానికి తీసుకొచ్చారు. సాయంత్రం స్థానిక జార్జి గ్రీన్స్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు సురేష్ మంత్రికాగా.. రెండో కుమారుడు డాక్టర్ సతీష్ జార్జి విద్యాసంస్థల కార్యదర్శి. ఆమె అల్లుడు తిప్పేస్వామి అనంతపురం జిల్లా మడకశిర ఎమ్మెల్యే. మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసిన థెరీసమ్మ ప్రస్తుతం ఆమె భర్త డాక్టర్ శామ్యూల్ జార్జి నెలకొల్పిన విద్యాసంస్థలకు చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. కాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఎర్రగొండపాలెం వెళ్లి ఆదిమూలపు సురేష్ కుటుంబాన్ని పరామర్శిస్తారు.

### విజయ్‌బాబుకు గజ్జెల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కారం


గజ్జెల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కారం అందుకున్న విజయ్‌బాబు దంపతులు

వైవీయూ (వైఎస్‌ఆర్‌జిల్లా): ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ్‌బాబుకు గజ్జెల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. సోమవారం వైఎస్సార్ జిల్లా కడప యోగివేమన విశ్వవిద్యాలయం, గజ్జెల మల్లారెడ్డి స్మారక ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి చేతుల మీదుగా పి.విజయ్‌బాబు దంపతులు 2021–22 సంవత్సరానికి గజ్జెల మల్లారెడ్డి జీవనసాఫల్య పురస్కారాన్ని స్వీకరించారు. విజయ్‌బాబు మాట్లాడుతూ సామాజికవేత్త, చైతన్యమూర్తి, అద్భుతమైన వ్యక్తిత్వం కలిగిన గజ్జెల మల్లారెడ్డి పురస్కారం పొందడం సంతోషంగా ఉందన్నారు. ఆయన పాత్రికేయులకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. పురస్కారంతో పాటు అందజేసిన 50వేల నగదు బహుమతిని కోవిడ్‌తో మృతిచెందిన పాత్రికేయుడు వై.శ్రీనివాసరావు కుటుంబానికి అందజేయనున్నట్లు ప్రకటించారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఆచార్య పి.పద్మ, ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి, ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, డాక్టర్ ఎల్. విజయకృష్ణారెడ్డి, డాక్టర్ పి.సి.వెంకటేశ్వర్లు, గజ్జెల మల్లారెడ్డి కుమారుడు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీదే

- విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచానికే ఆదర్శం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి


గ్రీన్‌కో పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల

కర్నూలు(రాజ్‌విహార్): భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీదే అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి సమీపంలోని గుమ్మితంతండా వద్ద ఏర్పాటుచేస్తున్న 5,230 మెగావాట్ల పవర్ ప్రాజెక్టును ఆయన సోమవారం పరిశీలించారు. సజ్జల మాట్లాడుతూ ఒకే యూనిట్ నుంచి సోలార్(సూర్యరశ్మి), విండ్(గాలి మరల ద్వారా), హైడల్(నీటి) ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకతని అన్నారు. ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులో భాగంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి 3 వేల మెగా వాట్లు, విండ్ పవర్ 550 మెగా వాట్లు, హైడల్ పవర్ 1,680 మెగా వాట్లు, మొత్తం 5,230 మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఐదేళ్లలో పూర్తి చేసి, నేషనల్ గ్రిడ్‌కు అనుసంధానం చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తామని వెల్లడించారు. ఈ పవర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే 23వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 4,766.28 ఎకరాల భూమిని కేటాయించిందని, ఇందులో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని గ్రీన్‌కో ప్రతినిధులతో అన్నారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, బీవై రామయ్య పాల్గొన్నారు.

# ఒక యుద్ధం.. ఒక హిజాబ్.. ఒక రాణి

## వార్తల్లో వ్యక్తులు



**జెలెన్‌స్కీ:** ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్‌స్కీ రష్యా దండయాత్రను సమర్థంగా ఎదుర్కొని ఈ ఏడాది హీరోగా మారారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ యుద్ధానికి దిగితే ధైర్య సాహసాలతో ఎదుర్కొన్నారు. వారంలో ముగిసిపోతుందనుకున్న పుతిన్ అంచనాలను పటాపంచలు చేస్తూ ఇంకా కదనరంగంలో పోరాడుతున్నారు. జెలెన్‌స్కీలో ఈ పోరాట స్ఫూర్తిని గుర్తించిన టైమ్ మ్యాగజైన్ పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా కవర్ పేజీ ప్రచురించింది.



**రిషి సునాక్:** ఒకప్పుడు భారత దేశాన్ని దాస్యం శృంఖలాల్లో బంధించి ఏళ్ల తరబడి పరిపాలించిన బ్రిటన్‌కు భారతీయ మూలాలున్న రిషి సునాక్ ప్రధానిగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. 42 ఏళ్ల వయసుకే ప్రధాని పీఠమెక్కి బ్రిటన్ చరిత్రలో పిన్న వయస్కుడిగా రికార్డులకెక్కారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న బ్రిటన్‌ను గట్టెక్కించడంలో లిజ్ ట్రస్ విఫలం కావడంతో టోరీ ఎంపీల మద్దతుతో ఇన్ఫోసిస్ చైర్మన్ నారాయణమూర్తి అల్లుడైన రిషి బ్రిటన్ ప్రధానిగా అక్టోబర్ 25న పదవీ ప్రమాణం చేశారు.



**ఎలాన్ మస్క్:** నిత్యం సమస్యలతో చెలగాటమాడడాన్ని అమితంగా ఇష్టపడే ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఈ ఏడాది వార్తల్లో నిలిచారు. సామాజిక మాధ్యమం ట్విట్టర్‌ని అక్టోబర్ 27న కొనుగోలు చేశారు. ఆ తర్వాత సంస్థలో ఉద్యోగుల తొలగింపు, బ్లూ టిక్ వంటి వివాదాలకు తెరలేపారు. చివరికి తాను ట్విట్టర్ సీఈవోగా కొనసాగాలా వద్దా అన్న పోల్ నిర్వహిస్తే 57.5% మంది ఆయన పదవికి రాజీనామా చేయాలని తీర్పునివ్వడం విశేషం.

### విషాదాలు

- బ్రిటన్ రాణి ఎలిజబెత్ (96) సంపూర్ణ జీవితాన్ని గడిపి అనారోగ్య సమస్యలతో సెప్టెంబర్ 8న కన్నుమూశారు. 70 ఏళ్ల పాటు ఏకఛత్రాధిపత్యంగా బ్రిటన్ సింహాసనాన్ని ఏలిన ఆమె మరణంతో బ్రిటన్‌లో ఒక శకం ముగిసిపోయింది. దేశానికి మహరాణి అయినప్పటికీ ఆ అధికారం ఎప్పుడూ ప్రదర్శించకపోవడంతో ఆమె అందరి మన్ననలు పొందారు.

ఒక యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, మానవీయ సంక్షోభాన్ని సృష్టిస్తే, ఒక వైరస్ ప్రపంచదేశాల వెన్నులో ఇంకా వణుకు పుట్టిస్తూనే ఉంది. ఒక అమాయకురాలి మరణంతో ఈ హిజాబ్ మాకొద్దు అంటూ ఇరాన్ నవతరం నినదిస్తే, ఒక రాణి మహాభినిష్క్రమణంతో ఇంగ్లండ్‌లో ఒక శకం ముగిసిపోయింది. ఒకప్పుడు మన దేశాన్ని పాలించిన బ్రిటన్ పాలనా పగ్గాలను ఇప్పుడు భారతీయ మూలాలున్న వ్యక్తి తీసుకోవడం చూస్తే భూమి గుండ్రంగానే ఉంటుందన్న మాటలు అక్షర సత్యాలనిపిస్తాయి. ప్రపంచ జనాభా 800 కోట్లకు చేరుకోవడం ఒక మైలురాయి అయితే, వాతావరణ మార్పులతో అగ్రరాజ్యాలు కూడా గడ్డ కట్టుకుపోవడం మన కళ్ల ముందే కనిపిస్తున్న కఠిన సత్యం. మొత్తంగా చూస్తే 2022 ప్రపంచదేశాలకు ఎన్నో చేదు జ్ఞాపకాలను, కొన్ని తీపి గురుతుల్ని మిగిల్చి వెళ్లిపోతోంది. ఒక్కసారి 2022లోకి తొంగిచూస్తే...



## పుతిన్ యుద్ధోన్మాదం



ఉరుములేని పిడుగులా రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్‌పై ఫిబ్రవరి 24న యుద్ధాన్ని ప్రకటించడంతో యావత్ ప్రపంచం నివ్వెరపోయింది. నాటో కూటమిలో చేరడానికి ఉక్రెయిన్ చేస్తున్న సన్నాహాలను తీవ్రంగా వ్యతిరేకించిన పుతిన్ రాత్రికి రాత్రికి బాంబు దాడులు చేశారు. పశ్చిమ దేశాల అండతో ఉక్రెయిన్ రష్యా సేనల్ని సమర్థంగా ఎదుర్కొంటూ ఉండడంతో పది నెలలు గడుస్తున్నా ఇంకా యుద్ధం కొనసాగుతూనే ఉంది. రెండేళ్ల కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలను ఆర్థికంగా విచ్ఛిన్నం చేస్తే, పులి మీద పుట్రలా యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, మానవీయ సంక్షోభాన్ని సృష్టించింది. ఈ యుద్ధంలో సాధారణ పౌరులే 10 వేల మంది వరకు ప్రాణాలు కోల్పోయారని అంచనాలున్నాయి. ఉక్రెయిన్ నుంచి ప్రాణాలరచేతుల్లో పెట్టుకొని ఏకంగా 78 లక్షల మంది ఇతర దేశాలకు వలస వెళ్లిపోయారు. రష్యాపై అమెరికా విధించిన ఆంక్షలతో చమురుకు కొరత ఏర్పడి ఎన్నో దేశాలు విలవిలలాడిపోతున్నాయి. ధరల పెరుగుదల, ఆహారం కొరత , సరఫరాలో అడ్డంకులు వంటివాటితో ప్రపంచమే స్తంభించిపోయినట్టయింది. రష్యా వైఖరిని నిరసిస్తూ ఐక్యరాజ్య సమితి సాధారణ అసెంబ్లీ మానవ హక్కుల మండలి నుంచి రష్యాని సస్పెండ్ చేసింది.

## ఇరాన్‌లో మహిళల విజయగీతిక



హిజాబ్ సరిగా ధరించని నేరానికి మహసా అమిన్ అనే 22 ఏళ్ల యువతిని నైతిక పోలీసులు సెప్టెంబర్ 13న అరెస్ట్ చేశారు. ఆ తర్వాత మూడు రోజులకు సెప్టెంబర్ 16న లాకప్‌లో ఆమె మరణించడంతో ఇరాన్‌లో నిరసనలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. 1979లో మత ఛాందసవాదులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ స్థాయి సవాళ్లు ప్రభుత్వం ఎదుర్కోలేదు. దేశవ్యాప్తంగా యువతీ యువకులు ఏకమై రోడ్లపై హిజాబ్‌లను తగులబెట్టిన దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా పతాక శీర్షికలో నిలిచాయి. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో 500 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. 18 వేల మందిని అరెస్ట్ చేశారు. అయినా నిరసనలు ఆగకపోవడంతో ప్రభుత్వం దిగి వచ్చి మోరల్ పోలీసు వ్యవస్థని రద్దు చేయడం ఆ దేశ ప్రజలు సాధించిన అతి పెద్ద విజయం. అయితే హిజాబ్‌ను రద్దు చేయాలంటూ 100 రోజులైనా ఇంకా ప్రజలు నిరసనలు చేస్తున్నారు.

- సోవియెట్ యూనియన్ చిట్టచివరి అధ్యక్షుడు మిఖాయిల్ గోర్బచెవ్ 91 ఏళ్ల వయసులో అనారోగ్య సమస్యలతో ఆగస్టు 31న కన్నుమూశారు. సోవియెట్ యూనియన్‌లో ఆర్థిక సంస్కరణలకు తెరతీసి ప్రపంచ గతినే మార్చిన గొప్ప దార్శనికుడు. సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నానికి సారథ్యం వహించి ప్రచ్ఛన్న యుద్ధానికి ముగింపు పలికారు. అందుకే నోబెల్ శాంతి బహుమానం ఆయనను వరించింది.
- జపాన్ మాజీ ప్రధాని షింజో అబె నరా నగరంలో జూలై 8న డెమొక్రాటిక్ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం చేస్తుండగా దారుణ హత్యకు గురయ్యారు. ఒక దుండగుడు అత్యంత సమీపం నుంచి కాల్పులు జరపడంతో తూటాలు నేరుగా ఆయన ఛాతీలోకి వెళ్లడంతో తుది శ్వాస విడిచారు.

### ఎన్నికలు

- చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్ అక్టోబర్ 23న వరుసగా మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేశారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీ 20వ కాంగ్రెస్‌లో ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. చైనాలో ఈ పదవికి ఎన్నికైన వారే అధ్యక్ష పగ్గాలు చేపడతారు.
- బ్రెజిల్‌లో జరిగిన ఎన్నికల్లో రైట్ వింగ్ అధ్యక్షుడు జెయిర్ బోల్సనోరాను ఓడించిన వామపక్ష వాది లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా అక్టోబర్ 30న నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
- ఇటలీ తొలి మహిళా ప్రధానమంత్రిగా జార్జియా మెలోని ఎన్నికయ్యారు. బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పార్టీకి చెందిన అతివాద నేత మెలోని అక్టోబర్ 25న దేశ ప్రధానిగా ప్రమాణం చేశారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఇటలీలో అతివాద ప్రభుత్వం ఏర్పాటుకావడం విశేషం.
- ఇజ్రాయెల్‌లో మూడేళ్ల రాజకీయ ప్రతిష్టంభనకు తెరదించుతూ మరోసారి బెంజిమన్ నెతన్యాహూ ప్రధాని పదవి అందుకున్నారు. సుదీర్ఘ కాలం దేశాన్ని పరిపాలించిన రికార్డు నెతన్యాహూపై ఉంది. నవంబర్ 15న ఆయన మళ్లీ ప్రధాని పగ్గాలు చేపట్టారు.
- నేపాల్‌లో అయిదు పార్టీల సంకీర్ణ కూటమి కుప్పకూలిపోవడంతో మాజీ ప్రధాని, సీపీఎస్–మావోయిస్ట్ సెంటర్ పార్టీ చైర్మన్ ప్రచండ ప్రధాని పగ్గాలు చేపట్టారు. సహచర కమ్యూనిస్టు నేత కేపీ శర్మ ఓలి మద్దతుతో డిసెంబర్ 26న ప్రమాణ స్వీకారం చేశారు.

## శ్రీలంక ఆర్థిక సంక్షోభం

కరోనా ప్రభావంతో ఆర్థికంగా దివాలా తీసిన దేశాల్లో శ్రీలంక అగ్రస్థానంలో ఉంది. 2.2 కోట్ల జనాభా ఉండే దేశంలో ధరాభారాన్ని ప్రజలు మోయలేని స్థితికి వచ్చేశారు. ఆహార పదార్థాలు కూడా అందరికీ సరిపడా పంపిణీ చేయడంలో విఫలం కావడంతో జూలైలో ప్రజలు భారీగా నిరసనలు చేపట్టారు. జులై 9న ఆందోళనకారులు గొటబయ రాజపక్స అధికారిక నివాసాన్ని ముట్టడించడంతో ఆయన దేశం విడిచివెళ్లిపోయే దుస్థితి ఏర్పడింది. ఆ తర్వాత రణిల్ విక్రమ్‌సింఘె అధ్యక్ష పదవి చేపట్టినప్పటికీ శ్రీలంక ఇంకా అప్పులకుప్పగానే ఉంది.

2022 రివైండ్

### ప్రకృతి వైపరీత్యాలు

- అఫ్గానిస్తాన్‌లో జూన్ 21నసంభవించిన భారీ భూకంపంలో వెయ్యి మందికిపైగా మరణించారు.
- జూన్‌లో పాకిస్తాన్‌ను వరదలు ముంచెత్తాయి. కొద్ది నెలల పాటు జనం నానా అవస్థలు పడ్డారు. అక్టోబర్ నాటికి పాకిస్తాన్‌లో వరద నష్టం 14.9 బిలియన్ డాలర్లుగా వరల్డ్ బ్యాంకు అంచనా వేసింది.
- ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పుల సదస్సు ఈజిప్టులో షర్మ్‌ఎల్–షేక్‌లో నవంబర్ 6 నుంచి 18 వరకు జరిగింది. పర్యావరణ విపత్తులతో నష్టపోయే పేద, వర్ధమాన దేశాలను ఆదుకోవడానికి పరిహార నిధిని ఏర్పాటు చేయడానికి సంపన్న దేశాలు అంగీకరించాయి.
- వాతావరణ మార్పులు ఈ ఏడాది అన్ని దేశాలపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. వేసవి కాలంలో వడగాడ్పులతో పశ్చిమాది దేశాలు అల్లాడిపోతే ఇప్పుడు ఆర్కిటిక్ బ్లాస్ట్‌తో అమెరికా గడ్డకట్టుకుపోతోంది. మంచు తుపానుకు లక్షలాది మంది అంధకారంలో మగ్గిపోతూ ఇబ్బందులు పడుతున్నారు.

### అవీ ఇవీ

- అమెరికాలో మారిలాండ్‌లో బాల్టిమోర్‌లో వైద్యులు ఈ ఏడాది జనవరి 12న పంది గుండెని మనిషికి అమర్చే శస్త్రచికిత్సని విజయవంతంగా పూర్తి చేశారు. అయితే రెండు నెలలు తిరక్కుండానే మార్చి 9న ఆ వ్యక్తి మరణించడం విషాదం
- గర్భవిచ్ఛిత్తిపై అమెరికా సుప్రీం కోర్టు సంచలన తీర్పు చెప్పింది. అబార్షన్‌ను నిషేధం విధిస్తూ 1973లో రియో వెర్సస్ వేడ్ తీర్పుని జూన్ 24న తోసిపుచ్చింది. దీంతో అమెరికాలో మహిళలు రోడ్డెక్కి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.
- బ్రిటన్ రాణి ఎలిజబెత్ మరణంతో ఆమె పెద్ద కుమారుడు చార్లెస్–3 రాజ సింహాసనాన్ని అధిష్టించారు. సెప్టెంబర్ 17న ఆయన గద్దెనెక్కి తల్లి అంతిమ సంస్కారం సహా అన్నీ దగ్గరుండి నిర్వహించారు.
- ప్రపంచ జనాభా మరో మైలు రాయి చేరుకుంది. మొత్తం జనాభా 800 కోట్లను దాటేసింది. ఫిలిప్పైన్స్ రాజధాని మనీలాలో నవంబర్ 15న జన్మించిన చిన్నారితో ప్రపంచ జనాభా 800 కోట్ల మార్కు దాటినట్టుగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది .
- కోవిడ్–19 ఈ ఏడాదితో ముగిసిపోతుందని అందరూ భావించినప్పటికీ చివరికొచ్చేసరికి చైనాలో తీవ్ర రూపం దాల్చింది. ఒమిక్రాన్ సబ్ వేరియెంట్ బీఎఫ్7తో రోజుకి 10 లక్షలకుపైగా కేసుల నమోదవుతున్నాయని, రోజుకి అయిదు వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నట్టుగా ఒక అంచనా.

– సాక్షి, నేషనల్ డెస్క్

## ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అస్వస్థత

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్(63) అస్వస్థతకు గురయ్యారు. సోమవారం సాధారణ చెకప్ కోసం ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో సీతారామన్ చేరారు. వైరల్ ఫీవర్, పొట్టలో ఇన్ఫెక్షన్‌తో ఎయిమ్స్‌లో చేరారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆమె ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తిగా క్షేమంగా ఉన్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

## జపాన్‌లో మంచు తుపాను.. 17 మంది మృతి

**టోక్యో:** జపాన్ వాసులు మంచు తుపాను ధాటికి వారం రోజులుగా వణికిపోతున్నారు. సంబంధిత ప్రమాద ఘటనల్లో 17 మంది చనిపోగా వంద మంది గాయపడ్డారు. వేలాది ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తీవ్రంగా మంచు పేరుకుపోవడంతో రహదారులపై ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. సరుకు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈశాన్య జపాన్‌లో ఈ సీజన్‌లో సాధారణం కంటే మూడు రెట్లు ఎక్కువగా మంచు పడింది.

## టీ కాచి ఇవ్వలేదని భార్యను చంపిన భర్త

**ఉజ్జయిని:** టీ తయారు చేసి ఇవ్వలేదనే కోపంతో దుర్మార్గుడైన ఓ భర్త కట్టుకున్న భార్యను చపాతీ పీటతో కొట్టి కడతేర్చాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని జిల్లా ఘటియా గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి(41) టీ తయారు చేసి ఇవ్వలేదనే కోపంతో భార్య(40)ను చపాతీ పీటతో కొట్టాడు. స్పృహతప్పి పడిపోయిన ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. విద్యుత్ షాక్‌కు గురైందని వైద్య సిబ్బందితో అబద్ధమాడాడు. కొద్ది సేపటి తర్వాత భార్య చనిపోవడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. పోస్టుమార్టంలో విషయం బయట పడగా భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు.

## ఆయుధాలు, డ్రగ్స్‌తో పట్టుబడిన పాక్ బోటు

**అహ్మదాబాద్:** ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు రూ.300 కోట్ల విలువైన 40 కిలోల డ్రగ్స్, 10 మందితో గుజరాత్ తీరం వెంట భారత జలాల్లోకి ప్రవేశించిన పాక్ పడవను భారత తీర రక్షక దళం పట్టుకుంది. ఈనెల 25న అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఆ 10 మందిని ఓఖా పోర్టుకు తదుపరి విచారణ నిమిత్తం తరలించారు.

# అమెరికాను ముంచేసిన మంచు

- 48 మంది మృతి
- న్యూయార్క్‌లో కొన్ని ప్రాంతాల్లో 8 అడుగుల మేర మంచు



న్యూయార్క్ రాష్ట్రం బఫెలోలో భారీగా కురిసిన మంచు

**వాషింగ్టన్:** అమెరికాలో హిమోత్పాతం దేశాన్ని గజగజ వణికిస్తోంది. మంచు తుపానులో చిక్కుకొని ఇప్పటివరకు 48 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో న్యూయార్క్ వాసులే 27 మంది ఉన్నారు. పశ్చిమ న్యూయార్క్‌లో కొన్ని ప్రాంతాలు 8 అడుగుల మేర మంచులో కూరుకుపోయాయి. ఏకధాటిగా మంచు కురుస్తూ ఉండడంతో ప్రజలు రోడ్లపైకి రావడం అసాధ్యంగా మారిందని న్యూయార్క్ గవర్నర్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా 2 వేలకు పైగా విమానాలు రద్దయ్యాయి. దీంతో చికాగో, డెన్వర్, డెట్రాయిట్, న్యూయార్క్, అట్లాంటా విమానాశ్రయాల్లో ప్రయాణికులు చిక్కుకుపోయారు. కొలరాడో, కన్సాస్, కెంటకీ, మిస్సోరీ, ఓహియోలో ప్రాణనష్టం అధికంగా ఉంది. అమెరికాలో తూర్పు రాష్ట్రాలన్నీ డీప్ ఫ్రిజ్‌లో పెట్టినట్టుగా ఉన్నాయని అమెరికా నేషనల్ వెదర్ సర్వీసెస్ (ఎన్‌డబ్ల్యూఎస్) తెలిపింది. ఈ రాష్ట్రాల జనాభాలో 2 లక్షలకు మందికి పైగా విద్యుత్ సదుపాయం లేక విలవిలలాడిపోతున్నారు. ప్రజలు ఇల్లు కదిలి బయటకు రావద్దని ఎన్‌డబ్ల్యూఎస్ హెచ్చరికలు జారీ చేసింది. అమెరికాలోని 48 రాష్ట్రాల్లో మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంచు తుఫాన్ హెచ్చరికలు జారీ అయిన ప్రాంతాల్లో కోటి మంది వరకు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. న్యూయార్క్‌లోని బఫెల్లో ప్రాంతంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. కార్లలో ప్రయాణిస్తున్న వారిపై విపరీతంగా మంచుకురవడం వల్ల ఆ వాహనంలో మంచులో కూరుకుపోయి మృతి చెందిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో ప్రజలు బయటకి రావడంపై ఆ ప్రాంతంలో నిషేధం విధించారు. విద్యుత్ సబ్ స్టేషన్లు 18 అడుగుల మంచులో కూరుకుపోవడంతో ఎప్పటికి కరెంట్ వస్తుందో తెలీని పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్కిటిక్ బ్లాస్ట్‌తో అమెరికా ఈ శీతాకాలంలో గడ్డకట్టుకుపోయింది.

## సంకుచిత భావనలొదిలేస్తే సమున్నతంగా ఎదుగుతాం

వీర్ బాల్ దివస్ కార్యక్రమంలో ప్రసంగించిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** గత కాలపు సంకుచిత భావనలను చెరిపేస్తేనే చరిత్రను తిరగరాసే స్థాయికి భారత్ అద్భుత విజయాలను ఒడిసిపట్టుకోగలదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సోమవారం ఢిల్లీలో జరిగిన తొలి 'వీర్ బాల్ దివస్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. గురు గోవింద్ సింగ్ తనయులు జోరావార్ సింగ్, ఫతే సింగ్‌లకు ఈ సందర్భంగా మోదీ ఘన నివాళులర్పించి ప్రసంగించారు. ' సంకుచిత భావన బంధనాలను తెంచుకుని భారత్ అద్భుత ప్రగతి పథంలో దూసుకుపోవాల్సిన తరుణం వచ్చేసింది. 'గురు గోవింద్ సింగ్ చిన్నారులను మతం మార్చాలని లేదంటే ఖడ్గానికి పనిజెప్తానని ఆనాటి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు హూంకరించడంతో విధిలేక తన ఇద్దరు కుమారులను గురు గోవింద్ బలివ్వక తప్పలేదు. గురు గోవింద్ సింగ్ నమ్మిన సిద్ధాంతం కోసం మేరునగంలా నిలిచారు. ఆ చిన్నారుల సాహసం, త్యాగనిరతిని కీర్తించేటపుడు వయసును లెక్కలోకి తీసుకోవద్దు. భక్త ప్రహ్లాదుడు, ధ్రువుడు, బలరాముడు, లవకుశ, చిన్నికృష్ణుడు అందరూ చిన్నతనంలోనే తమ పరాక్రమాన్ని ప్రదర్శించినవారే' అని అన్నారు.

**అభివృద్ధిలో అత్యున్నత శిఖరాలపై నిలపాలి**

'వీర్ బాల్ దివస్‌ను స్ఫురణకు తెచ్చుకుంటే గత భారతదేశ ఘన చరిత మనకు తెలుస్తుంది. ఇది యువతకు స్ఫూర్తిగా ఉంటూ భవిష్యత్‌కు దిశానిర్దేశకంగా నిలుస్తోంది. ' ఘన చరిత గల దేశం ఎప్పుడూ ఆత్మస్థైర్యం, ఆత్మగౌరవంతో ముందడుగు వేయాలి. కానీ కొందరు మన పూర్వ చరిత్రలో పెద్దస్థాయిలోనే ఆత్మన్యూనత భావాలను నింపేశారు. అమృతకాలంలో ఈ బానిసత్వపు ఆలోచనలకు స్వస్తిపలికి దేశాన్ని అభివృద్ధిలో సమున్నత శిఖరాలపై నిలిపేందుకు కృషిచేయాలి' అని ప్రజలకు మోదీ హితవు పలికారు. 'ఒంటరిగా పోరాడారే తప్ప మొఘల్స్‌కు తలవంచలేదు. ఈ అసమాన ధీరత్వమే దేశానికి శతాబ్దాలుగా స్ఫూర్తిగా నిలుస్తోంది' అని వ్యాఖ్యానించారు.

## మతాలు వేరు కావడంతోనే బ్రేకప్

**ముంబై:** హిందీ సీరియల్ నటి తునీషా శర్మ ఆత్మహత్య కేసులో ఆమె మాజీ బాయ్ ఫ్రెండ్ షీజన్ ఖాన్ పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెల్లడించారు. ఇద్దరి మతాలు వేరు కావడం, తన కంటే ఎనిమిదేళ్లు చిన్నది కావడంతో తునీషాకు బ్రేకప్ చెప్పానని ఖాన్ పోలీసుల విచారణలో వెల్లడించినట్టుగా తెలుస్తోంది. శ్రద్ధా వాకర్ హత్య తర్వాత దేశంలో పరిస్థితులు తనని బాగా కలిచి వేశాయని, తమ ఇద్దరి మతాలు కూడా వేరు కావడంతో ఆమెకు బ్రేకప్ చెప్పానని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో ఉన్న వాతావరణంలో రెండు వేర్వేరు మతాలకు చెందిన వారు కలిసి ఉండడం సాధ్యం కాదని ఈ విషయాన్ని తాను తునీషాకు కూడా చెప్పినట్టుగా పోలీసుల విచారణలో చెప్పాడు. కాగా, తన కుమార్తెను ఖాన్ మోసం చేశాడని తునీషా తల్లి వనిత ఆరోపించారు. కుమార్తెని పెళ్లాడతానని హామీ ఇచ్చి ఖాన్ మరో అమ్మాయితో అఫైర్ నడిపాడని నిందించారు.

## శాంతి ఫార్ములాకు భారత్ మద్దతు కోరిన జెలెన్‌స్కీ

**న్యూఢిల్లీ:** రష్యాతో జరుగుతున్న యుద్ధం ముగిసి శాంతి నెలకొనేందుకు భారత్ సహకారం అందించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. జీ–20 శిఖరాగ్ర సమ్మేళనం సందర్భంగా తాను ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక అమలులో భారత ప్రధాని మోదీని సాయం కోరినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ట్వీట్ చేశారు. సోమవారం భారత ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. శాంతికి బాటలు వేసేందుకు జీ–20 అధ్యక్ష హోదాలో భారత్ కృషి చేయాలని కోరారు. జీ–20 బాధ్యతలు చేపట్టిన భారత్‌కు శుభాకాంక్షలు తెలిపినట్లు ఆయన వెల్లడించారు. ఐక్యరాజ్యసమితి ద్వారా ఉక్రెయిన్‌కు మానవతా సాయం, మద్దతు అందిస్తున్న భారత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉక్రెయిన్, రష్యాలు యుద్ధానికి వెంటనే ముగింపు పలికి, విభేదాలకు చర్చలు, దౌత్య మార్గాల్లో శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలని ఈ సందర్భంగా మోదీ సూచించారని పీఎంవో తెలిపింది. ద్వైపాక్షిక సహకారంపై చర్చించినట్లు వివరించింది.

## కొరియాల సరిహద్దుల్లో మళ్లీ ఉద్రిక్తతలు

**సియోల్:** తమ గగనతలంలోకి చొచ్చుకువచ్చిన ఉత్తరకొరియా డ్రోన్లను దక్షిణ కొరియా సైన్యం తరిమి కొట్టింది. సోమవారం ఉత్తరకొరియా ప్రయోగించిన ఐదు డ్రోన్లలో ఒకటి దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు అత్యంత సమీపంలోకి వచ్చింది. వీటిని పసిగట్టిన ఆర్మీ..యుద్ధ విమానాలు, హెలికాప్టర్లతో ఆ డ్రోన్లను వెంబడించి 100 రౌండ్ల వరకు కాల్పులు జరిపింది. డ్రోన్లను కూల్చివేసిందీ లేనిదీ దక్షిణ కొరియా ఆర్మీ వెల్లడించలేదు. ఈ ఘటనలో తేలికపాటి యుద్ధ విమానం కేఏ–1 కూలిపోయింది. అందులోని ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడినట్లు తెలిపింది. అంతేకాదు, సరిహద్దుల ఆవల ఉత్తర కొరియా భూభాగంలోకి డ్రోన్లను పంపి, అక్కడి మిలటరీ స్థావరాలను చిత్రీకరించినట్లు సమాచారం.

## చైనాలో కరోనా కరాళనృత్యం

శ్మశానాల బయట మృతదేహాలతో బారులుతీరిన బంధువులు

**బీజింగ్:** కోవిడ్ దెబ్బకు డ్రాగన్ దేశం బిక్కుబిక్కుమంటోంది. ఆస్పత్రులకు పోటెత్తుతున్న జనంతో, మృతదేహాలను వెంటేసుకొస్తున్న బంధువులతో శ్మశానాలు దాదాపు నిండిపోయాయి. కోట్ల మంది పౌరులు కోవిడ్ బారినపడి సరైన వైద్యం కోసం కిక్కిరిసిన ఆస్పత్రుల బయట వేచిచూస్తున్నారు. అంతులేని మరణాలకు చైనా ఆలవాలంగా నిలిచిందనే తెలిపే తాజా వీడియో ఒకటి మీడియాలో ప్రత్యక్షమైంది. ఆరోగ్య నిపుణుడు డాక్టర్ ఎరిక్ ఫెగిల్ డింగ్ ఈ వీడియోను ట్వీట్‌చేశారు. ఆత్మీయుల అంతిమ సంస్కారం కోసం ఇంకా ఎన్ని గంటలపాటు వేచి ఉండాలో తెలీకుండనే మృతదేహాలను క్యూ లైన్‌లో ఉంచి వేచిచూస్తున్న వందలాది మంది బంధువుల వేదన ఆ వీడియోలో కనిపించింది. కాగా, కట్టుతప్పిన కోవిడ్ సంక్షోభాన్ని వేగంగా అదుపుచేసి దేశంలో ఆరోగ్య పరిస్థితిని చక్కదిద్దాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు చైనా అధికారిక వార్తా ప్రసార సంస్థ సీసీటీవీ ఒక ప్రకటన విడుదలచేసింది.

**రోజూ లక్షల్లో కేసులు**

ఝెజియాంగ్ ప్రావిన్స్‌లో రోజుకు 10 లక్షల కేసులు, తీరప్రాంత క్వింగ్‌దావో సిటీలో రోజుకు 5లక్షల కేసులు, దోంగ్వాన్ సిటీలో రోజూ 2,50,000–3,00,000 కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. సిచువాన్ ప్రావిన్స్‌లో లక్షన్నర జనాభాపై జరిపిన సర్వేలో 63 శాతం మంది తమకు కోవిడ్ సోకినట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది చివరికల్లా చైనాలో 10 నుంచి 20 లక్షలలోపు జనం కోవిడ్‌తో కన్నుమూసే ప్రమాదముందని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) ఉన్నతాధికారి ఒకరు హెచ్చరించారు. బీజింగ్‌లో అత్యవసర వైద్యం అవసరమంటూ ఎమర్జెన్సీ కాల్స్ ఆరు రెట్లు పెరిగాయంటే పరిస్థితిని అర్థంచేసుకోవచ్చని అక్కడి అసోసియేటెడ్ ప్రెస్(ఏపీ) జర్నలిస్టులు చెప్పారు. 'బీజింగ్‌లో విద్యుత్ దహనవాటికలు మృతదేహాలతో నిండిపోయాయి. మా బామ్మ మృతదేహాన్ని దహనం చేసేందుకు 10 రోజులపాటు వేచి ఉండాలని అధికారులు చెప్పారు. అందుకే రెండు గంటలపాటు ప్రయాణించి మరీ సిటీకి ఇంతదూరంగా గావోబెడియాంగ్‌కు వచ్చాం' అని 82 ఏళ్ల మహిళ మృతదేహం వద్ద విలపిస్తూ ఆమె మనవడు లియాంగ్ చెప్పారు.

## ఆత్మరక్షణ కోసం కత్తులకు పదునుపెట్టండి

బీజేపీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పిలుపు



**శివమొగ్గ(కర్ణాటక):** జిహాద్, లవ్ జిహాద్‌ల నుంచి తమను తాము రక్షించుకునేందుకు ఆత్మరక్షణలో భాగంగా జనం కత్తులను ఇంట్లో సిద్ధంగా ఉంచాలని బీజేపీ మహిళా ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ వ్యాఖ్యానించారు. కర్ణాటకలోని శివమొగ్గలో హిందూ జాగరణ వేదిక దక్షిణ ప్రాంత వార్షిక సదస్సులో ప్రజ్ఞా ప్రసంగించారు. ' ప్రేమకు సరైన నిర్వచనం ఇక్కడ లభించనపుడు లవ్ జిహాద్‌కు పాల్పడుతున్న వ్యక్తులకు.. వారి మార్గంలోనే సమాధానం చెప్పాలి. మీ ఇంటి అమ్మాయిలను రక్షించుకోండి. వారికి సరైన విలువలు నేర్పించండి' అని అన్నారు. ఇటీవల శివమొగ్గలో హిందూ కార్యకర్త హర్షను హత్యచేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ' మీ ఇంట్లో కత్తులను సిద్ధంగా ఉంచుకోండి. బయటి నుంచి ప్రమాదం ఏదీ రాకుంటే కనీసం కూరగాయలు కోసేందుకైనా పనికొస్తాయిగా. ఒకవేళ ఎవరైనా చొరబడి దాడిచేస్తే ఆత్మరక్షణకు అక్కరకొస్తాయి. వాటికి పదునుపెట్టండి' అని ఆమె సలహాఇచ్చారు. 'పిల్లలను మిషనరీ విద్యాసంస్థల్లో వడేయకండి. అలా అయితే మీ పిల్లలకు మన సంస్కృతి అబ్బదు' అని అన్నారు.

సాక్షి
# విజయనగరం
మంగళవారం । 27 । డిసెంబర్ । 2022



**నేరాలు తగ్గుముఖం**
ఈ ఏడాది జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు.
- 8లో



**భలే మంచి చౌకబేరం..!**
రూ.ఆరు వేల విలువ గల నిత్యావసర సరుకులు రూ.3,600లకే అందిస్తామని ఓ మహిళ మోసం చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.
- 8లో



**విద్యార్థుల ప్రతిభ**
మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ఏబీవీపీ పట్నాయక్ తెలిపారు.
- 8లో

## న్యూస్‌రీల్

### నేటి నుంచి ఆంధ్రా - మహారాష్ట్ర జట్ల రంజీ మ్యాచ్



డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్

**విజయనగరం:** విజయనగరం వేదికగా మరో దేశవాళీ క్రికెట్ మ్యాచ్ జరగనుంది. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు టెస్ట్ మ్యాచ్ తరహాలో జరిగే మ్యాచ్‌లో అతిథ్య ఆంధ్రా జట్టు, మహరాష్ట్ర జట్లు తలపడనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు సోమవారం తెలిపారు. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఉదయం 9 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు తరఫున పలువురు అంతర్జాతీయ క్రికెటర్లు ఆడనుండగా... ఆంధ్రా జట్టు తరఫున హనుమవిహారి, కెఎస్.భరత్‌లు, మహరాష్ట్ర జట్టు తరఫున రుతురాజ్ గైక్వాడ్, రాహుల్ త్రిపాఠి ఆడనున్నారు. మ్యాచ్ తిలకించేందుకు వచ్చే ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

### డీసీహెచ్ఎస్ బాధ్యతల స్వీకరణ



డాక్టర్ గౌరీశంకర్

**విజయనగరం ఫోర్ట్:** జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్)గా డాక్టర్ బి.గౌరీశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా పని చేసిన డాక్టర్ జి.నాగభూషణరావుకు పాలకొండ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయింది. దీంతో ఆయన స్థానంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పని చేస్తున్న గౌరీశంకర్‌ను డీసీహెచ్ఎస్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీసీహెచ్ఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌరీశంకర్‌ను పలువురు అభినందించారు.

### ఏపీ ఫైబర్‌తో తక్కువ ధరకే ఇంటర్నెట్

**విజయనగరం అర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ధరకే ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా అతి తక్కువ ధరలకు ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందిస్తోంది. రూ.190, రూ.249లకు గృహ అవసరాలకు, వాణిజ్య సముదాయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు ఈ కనెక్షన్లను ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. 200 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 400 జీబీతో రూ.190లకు, 50 ఎంబీపీఎస్ స్పీడ్‌తో అన్‌లిమిటెడ్ ఇంటర్నెట్‌ను రూ.249కు అందజేయనున్నారు. అలాగే రూ.499, రూ.699, రూ.999లకు ఇంటర్నెట్, టీవీ చానళ్లతో పాటు ఓటీటీ చానళ్లు, టెలిఫోన్ సౌకర్యాలు అందజేస్తారు. గతంలో రూ.350, రూ.449, రూ.599లకు ఇచ్చిన ట్రిపుల్ ప్లే విధానం యథావిధిగా కొనసాగుతోంది. ఓటీటీ, ఇంటర్నెట్, టెలిఫోన్ కోసం రూ.299, రూ.399, రూ.799 ప్లాన్‌లతో కొత్త ప్లాన్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అవసరమైన వారు స్థానిక కేబుల్ ఆపరేటర్‌ను గానీ, జిల్లా మార్కెటింగ్ మేనేజర్ పిల్లా సతీష్ (ఫోన్ నెంబర్ 7337362494) ద్వారా తెలుసుకోవచ్చని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సంబంధిత వర్గాలు తెలిపాయి.

### సెమీఫైనల్స్‌కు జిల్లా జట్టు



సెమీఫైనల్స్‌కు చేరిన జిల్లా బ్యాడ్మింటన్ జట్టు

**శృంగవరపుకోట:** రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా బాలుర బ్యాడ్మింటన్ జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరిందని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ పి.శ్రీరాములు తెలిపారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా మదనపల్లెలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్ - 14 పోటీల్లో జిల్లా జట్టు సభ్యులు ఎం.తరుణ్, ఎం.జాన్సన్, పి.సుమన్, కె.భానుప్రకాశ్, ఎంపీ నాగసాయిలు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. జిల్లా జట్టు తొలుత విశాఖ జట్టుపై 2 - 1తేడాతో గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీకాకుళం జట్టుపై 2 - 1తేడాతో విజయం సాధించి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించినట్టు ఆయన తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

# ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

- జీసీలకు సముచిత స్థానం ఇచ్చింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డే...
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారు..
- జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకే జిల్లాలో రూ.కోట్ల అభివృద్ధి పనులు
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పక్కన మంత్రి బొత్స

సాక్షి ప్రతినిధి, విజయనగరం/బొండపల్లి:

లేనిది ఉన్నట్టు.. ఉన్నది లేనట్టు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాల మాటలను నమ్మితే ఐదు కోట్ల ఆంధ్రులు నిండా మునిగిపోతారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. చంద్రబాబు సహా దుష్ట చతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తున్నారని, అబద్ధాలు పదేపదే చెబితే నమ్మే రోజులు పోయాయన్నారు. టీడీపీ, రెండు పత్రికలు, మూడు చానెళ్లు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని క్షేత్రస్థాయిలోనే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గొట్లాం సత్య ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సుబ్బారెడ్డితో పాటు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వలంటీర్లకు సమాంతరంగా గృహ సారథుల వ్యవస్థకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందజేసేందుకు, కన్వీనర్లు పార్టీకి అనుసంధానకర్తలుగా పని చేయాల్సి ఉందన్నారు. చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంకుగానే చూశారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు సముచిత స్థానం కల్పించారన్నారు.

### అందరి కళ్లల్లో ఆనందం చూడడమే జగన్ లక్ష్యం : మజ్జి శ్రీనివాసరావు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరి కళ్లల్లో ఆనందం చూడడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలో 77 సచివాలయాలతో పాటు 77 వేల కుటుంబాలు ఉండగా వారందరికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో గృహ సారథులను నియామకం పూర్తి చేయనున్నట్టు తెలిపారు. ఇటీవల చంద్రబాబు జిల్లా పర్యటనలో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ వచ్చిందని ఉత్సాహపడుతున్నారని.. ఏమి వచ్చిందో చెప్పాలన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాలను గత ప్రభుత్వం కాగితాల్లో చూపెట్టగా తమ ప్రభుత్వం ఆచరణలో చేసి చూపెట్టిందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కింద గోదావరి నది నీళ్లను కాలువ ద్వారా సాగునీరు అందించేందుకు రూ.3700 కోట్లు కేటాయించి భూసేకరణ కూడా పూర్తి చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

### ఇది పేదల ప్రభుత్వం : మంత్రి బొత్స



రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. ప్రతి పేదవాడిని ఆర్థికంగా ఆదుకునేందుకే సంక్షేమ పథకాలను పక్కాగా అందజేస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన ప్రతిపక్ష నేత చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడారని ఎద్దేవా చేశారు. జిల్లా పర్యటనలో తమ కుటుంబంపై బురద చల్లే ప్రయత్నం చేశారని విమర్శించారు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో బీసీలకు చెందిన ఎమ్మెల్యేలున్నా ఓసీ వర్గానికి చెందిన ఒకరికి కేంద్ర మంత్రి, వేరే పార్టీ నుంచి వచ్చిన ఓసీ వ్యక్తికి రాష్ట్ర మంత్రి పదవి ఇచ్చి బీసీలపై చంద్రబాబు ప్రేమ నటించడం సిగ్గు చేటన్నారు. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యేపై లేని అవినీతి ఆరోపణలు లేవన్నారు. పోస్టులు, అభివృద్ధి పనులకు కమిషన్లు దండుకోవడం ఈ నాయకుడి నైజం అని అందుకే ప్రజలే గత ఎన్నికల్లో ఓడించారన్నారు. అప్పట్లో భీమసింగి సుగర్స్‌ను తెరిపిస్తే తిరిగి నష్టాల్లోకి నెట్టారని ఇప్పుడు అభాండాలు వేస్తున్నారని అన్నారు. బొబ్బిలిలో రైతులు ఎవరూ నష్టపోకూడదని చెరకు బిల్లులు రూ.23కోట్లు చెల్లింపులు తమ ప్రభుత్వ హయాంలో జరిగాయని గుర్తు చేశారు.

### ప్రతిపక్షాల మాటలు ప్రజలు నమ్మరు : ఎమ్మెల్యే బొత్స



ప్రతిపక్షాల మాయమాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. తమ నియోజకవర్గంలో మూడేళ్ల కాలంలో రూ.987 కోట్లను నేరుగా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల కింద అందజేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మరో రూ.756 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను నియోజకవర్గంలో చేపట్టామన్నారు.

### బాబు హయాంలో దోచుకోవడమే పని : ఎమ్మెల్సీ పెనుమత్స



చంద్రబాబు ప్రభుత్వ హయాంలో దోచుకోవడం.. దాచుకోవడమే పనిగా పచ్చ పార్టీ నాయకులు పని చేశారని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ప్రతి పనికి కమిషన్‌తో పాటు జన్మభూమి కమిటీల పేరుతో వారి అనుచరులకే పథకాలు అందాయన్నారు.

### జనం గుండెల్లో నిలిచేలా పాలన : ఎమ్మెల్సీ విక్రాంత్



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచేలా పాలన సాగిస్తూ ముందుకు సాగుతున్నారని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశంలో మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మూడేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ముఖ్యమంత్రి సంపాదించారని పేర్కొన్నారు.

### గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా పాలన : ఎంపీ బెల్లాన



గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలో వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి పాలన, సేవలు అన్నింటిని అందిస్తున్నారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్ర శేఖర్ అన్నారు. జిల్లాలో ఎప్పుడూ ఏ పార్టీ చేయని విధంగా లక్షా 20 వేల ఇళ్లను పేదల నిర్మాణానికి అండగా ఉన్న ప్రభుత్వం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వమన్నారు. టీడీపీ హయాంలో ఒక్క పేదవాడికైనా ఇళ్ల పట్టా ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

### ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థిని గెలిపించుకుందాం...

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సీతంరాజు సుధాకరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి.ప్రభుజీ రాజు, ఎం.నారాయణమూర్తిరాజు, ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు చల్ల చలంనాయుడు, బెల్లాన జ్ఞానదీపిక, గెదేల సింహాద్రి అప్పలనాయుడు, పీరుబండి హైమావతి, రాపాక సూర్యప్రకాశరావు, గార తవుడు, రౌతు రాజేశ్వరి, వర్రి నర్సింహమూర్తి, గొర్లె సరయు, ఐదు మండలాల పార్టీ కన్వీనర్లు పాల్గొన్నారు. బొబ్బిలిలో ఎమ్మెల్యే వెంకటచినఅప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సమా వేశంలో వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు.

# అక్రమాలకు చెక్... అన్నదాత హ్యాపీ

అన్నదాతకు ధాన్యం విక్రయం విషయంలో టెన్షన్ తప్పింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పకడ్బందీ చర్యలు చేపట్టడంతో ఇటు దళారులు, అటు మిల్లర్ల ఆగడాలకు చెక్ పడింది. ప్రభుత్వ నిబంధనల మేరకే ఆర్‌బీకేలకు ధాన్యం చేరుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన విధంగానే బిల్లుల చెల్లింపులు కూడా చేస్తుండడంతో అన్నదాత ఆనంద పడుతున్నాడు.



రైతు కళ్లం వద్ద ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

- విజయవంతంగా ధాన్యం కొనుగోలు
- దళారులు, మిల్లర్ల ఆధిపత్యానికి చెక్
- ఇంతవరకు 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతులకు ఇబ్బంది లేకుండా అధికారుల చర్యలు
- గడువులోగా రైతులకు బిల్లుల చెల్లింపులు

విజయనగరం ఫోర్ట్:

రైతు సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుంది. విత్తు దగ్గర నుంచి పంట కొనుగోలు వరకు అన్నింటా రైతులకు అండ గా నిలుస్తోంది. తాజాగా ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ధాన్యం కొనుగోలులో కూడా రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది ఏర్పడిన చిన్నపాటి సమస్యలను కూడా అధిగమించి పూర్తి స్థాయిలో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా దళారులు, మిల్లర్లు వల్ల రైతులకు ఇబ్బంది వస్తుందని తెలుసుకున్న ప్రభుత్వం ఈ ఏడాది వారికి చెక్ పెట్టింది. ధాన్యం కొనుగోలులో వారి ప్రమేయం లేకుండా ఈ-ప్రొక్యూర్ విధానంలో ధాన్యం కొనుగోలు చేస్తోంది. గతంలో దళారులు, మిల్లర్లు ఒక్కటై దళారులు పంపించిన ధాన్యానికి మిల్లర్లు బిల్లులు చెల్లించేవారు. దీని వల్ల రైతులకు బిల్లులు చెల్లింపు లో జాప్యం ఏర్పడేది. ప్రస్తుతం వాటిన్నంటికి ప్రభుత్వం చెక్ పెట్టింది.

**92,544 హెక్టార్లలో వరి సాగు**

జిల్లాలో ఖరీఫ్‌లో వరి పంట సాధారణ విస్తీర్ణం 90,811 హెక్టార్లు కాగా 92,944హెక్టార్లలో వరి పంట సాగైంది. 4.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారుల అంచ నా వేశారు. అయితే ఇందులో లక్షకు పైగా టన్నుల వరకు రైతులు తినడానికి, ఇతర అవసరాలకు ఉంచుకుంటారు. ఇప్పటివరకు ప్రభుత్వం 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది.

**గడువుకు ముందుగానే బిల్లులు చెల్లింపులు**

రైతు భరోసా కేంద్రానికి ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం 21 రోజుల్లోగా డబ్బులు చెల్లిస్తామని గడువు చెప్పింది. ఆ గడువులోగానే ప్రభుత్వం రైతులకు డబ్బులు చెల్లిస్తుంది. జిల్లాలో ఉన్న 510 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇంతవరకు 17,567 మంది రైతులు ధాన్యం విక్రయించారు. ఇప్పటికే కొందరి రైతుల ఖాతాల్లో రూ.7.10 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. మరో రూ.105 కోట్లకు పేమెంట్ అప్రూవల్ అయింది. కొద్ది రోజుల్లో ఆయా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.

**మిల్లుకు వెళ్లే వరకు అధికారుల బాధ్యత**

ధాన్యం కొనుగోలులో ఈ-ప్రొక్యూర్ విధానం బేషుగ్గా ఉందని రైతులు అంటున్నారు. రైతు పండించిన ధాన్యాన్ని కళ్లం దగ్గర నుంచి మిల్లుకు చేరే వర కు ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది. ఇందు కోసం మిల్లు వద్ద కస్టోడియన్ అధికారులను ప్రభుత్వం నియమించింది. వారే ఈ బాధ్యతను నిర్వర్తిస్తున్నా రు. రైతు పండించిన ప్రతి గింజనూ విక్రయించేందు కు మార్గం సుగమం అయింది. రైతులు అమ్మిన ధాన్యానికి సంబంధించి మిల్లును ఆన్‌లైన్‌లో కేటాయిస్తారు. కస్టోడియన్ అధికారి, డిజిటల్ ఆపరేటర్ అందించే రశీదులతో ఆయా మిల్లులకు ధాన్యం చేరుతుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సంచులను రైతులకు సరఫరా చేస్తున్నారు. కళ్లాల దగ్గరకు అధికారులు, సిబ్బంది వెళ్లి ధాన్యం శాంపిల్స్ తీసి తేమ శాతం పరిశీలిస్తున్నారు. శాంపి ల్స్ తీసిన అధికారి తేమ శాతం పరిశీలించి ధాన్యం తరలిస్తారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయ డం వల్ల రైతులకు మద్దతు ధర లభించడంతో పాటు, హమాలీలు, రవాణా ఖర్చులను, కూడా ప్రభుత్వమే భరిస్తోంది.

**చాలా సులువుగా ఉంది**



ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఈ-ప్రొక్యూర్ విధానం చాలా సులువుగా ఉంది. దళారులు, మిల్లర్ల బెడద తప్పింది. ప్రారంభంలో కొంత ఇబ్బంది అనిపించినా ఇప్పుడు ఏ చింత లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అధికారుల సహకారం బాగుంది.

- దోకుల అప్పలసత్యం, రైతు, పెదవేమలి గ్రామం

**రైతులకు ఇబ్బంది లేకుండా..**

రైతులకు ఏ ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఈ - ప్రొక్యూర్ విధానంలో ధాన్యం ఏ మిల్లుకు వెళ్తుందో ఆన్‌లైన్ విధానం ద్వారా తెలుస్తుంది. ఇప్పటివరకు 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు విక్రయించారు.

- వి.తారాకరామరావు, జిల్లా వ్యవసాయ అధికారి



ధాన్యం బస్తాలు

# గృహసారథులతో మరింత బలోపేతం

- వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు ఖాయం
- టీడీపీకి నూకలు చెల్లాయి..
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స



మాట్లాడుతున్న పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ

**రామభద్రపురం:** సచివాలయం పరిధిలో ముగ్గురు చొప్పున సమన్వయకర్తలు, గృహ సారథుల నియామకంతో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం అవుతుందని ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు సోమవారం వెళ్తూ మండల కేంద్రంలో కాసేపు ఆగారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు జిల్లాల పర్యటనలో ఆయన ఆడే భాష చూస్తుంటే మతిభ్రమించినట్టు ఉందన్నారు. టీడీపీకి రాష్ట్రంలో నూకలు చెల్లిపోయాయని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు చూపుతున్న ఆదరణ చూస్తుంటే రానున్న ఎన్నికల్లో 175 సీట్లు గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను ఎలా తగ్గించాలనే ఆలోచన చేస్తే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారులెవ్వరూ మిగిలిపోకుండా సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. చంద్రబాబు బీసీలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరా జు సుధాకర్, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారి బంధుప్రీతి

- ఎస్.కోటకు చెందిన వ్యక్తికి ప్రభుత్వ భూమి కట్టబెట్టిన వైనం
- 3 సెంట్లు స్థలంలో ఎంచక్కా ఇల్లు నిర్మాణం



తాటిపూటి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఇల్లు

**గంట్యాడ:** ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన రెవెన్యూ అధికారే.. పప్పు బెల్లం మాదిరి ప్రభుత్వ భూమిని పంచేశారు. ప్రభుత్వ భూమిని అప్పనంగా కట్టబెట్టి బంధుప్రీతి చూపించుకున్నారు. మండలంలోని తాటిపూడి రెవెన్యూ గ్రామంలో సర్వే నెం.21లో ప్రభుత్వ భూమి ఎకరం వరకు ఉంది. ఈ భూమిలో సుమారు 3 సెంట్లు భూమిని ఎస్.కోటకు చెందిన ఓ వ్యక్తికి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి కట్టబెట్టారు. ఈ భూమిలో సదరు వ్యక్తి నిర్మాణం కూడా చేపట్టేశారు. రెండు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. రెవెన్యూ అధికారి బంధుప్రీతి చూపించిన వ్యక్తిది పక్క మండలం కావడం గమనార్హం. మండలం కాని వ్యక్తికి భూమిని రెవెన్యూ అధికారి అప్పనంగా ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**ప్రభుత్వానిదే...**

తాటిపూడిలో నిర్మిస్తున్న ఇల్లు ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్నదే. సదరు వ్యక్తికి ఆ భూమి ఏ విధంగా వచ్చింది అనే దానిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

- స్వర్ణకుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్

### 8,999 మందికి కొత్తగా పింఛన్లు

**విజయనగరం అర్బన్:** జిల్లాలో వివిధ కేటగిరి లబ్ధిదారులు 8,999 మందికి వైఎస్సార్ సామాజిక పెన్షన్లు కొత్తగా మంజూరయ్యాయి. జూన్ నుంచి ఇంతవరకు స్వీకరించిన దరఖాస్తుల్లో అర్హులైన పది కేటగిరిల్లోని లబ్ధిదారులను ఆరు స్థాయిల్లో ఎంపిక చేశారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా బొబ్బిలిలో 1,390 మంది, చీపురుపల్లిలో 1,251 మంది, గజపతినగరంలో 1,394 మంది, నెల్లిమర్లలో 1,288 మంది, రాజాంలో 962 మంది, ఎస్.కోటలో 1,209 మంది, సాలూరు (మెంటాడ మండలం)లో 224 మంది, విజయనగరంలో 1,281 మంది పెన్షన్‌లకు అర్హత సాధించారు. కొత్తగా మంజూరైన వారికి వచ్చే జనవరి నెల నుంచి పెన్షన్ రూ.2,750 సొమ్ము లభిస్తుందని తెలిపారు.

## క్లుప్తంగా

### జీఎన్ఎం, డిప్లమా కోర్సుల్లో ఉచిత ప్రవేశాలు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ ఆధ్వర్యంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు జీఎన్ఎం, పారా మెడికల్ డిప్లమా కోర్సుల్లో ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు బ్యాంకింగ్ (బీఎఫ్ఎస్ఐ–బీడీఈ) కోర్సుల్లో 45 రోజులు పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించాలన్నారు.

### ఎలుకల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఎలుకల మందు తాగి స్థానిక హుకుంపేటకు చెందిన టీవీ మెకానిక్ బంటుపల్లి శ్రీనివాసరావు (55) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసరావు కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ నెల 21న ఉదయం ఇంట్లోనే ఎలుకల మందు తాగేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. ఆయనకు భార్య పద్మ, కుమారుడు ఉన్నారు. టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లారీ ఢీకొని ఒకరికి గాయాలు

పార్వతీపురం: పార్వతీపురం మండలం పిన్నింటి రామినాయుడువలసకు చెందిన జి.కాశయ్య లారీ ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలిలో కోర్టులో ఉద్యోగం కోసం పరీక్ష రాయడానికి తన కుమార్తెను తీసుకువెళ్లి తిరిగి పార్వతీపురం వస్తుండగా నర్సిపురం సబ్‌స్టేషన్ దగ్గర ఎదురుగా వస్తున్న లారీ వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కాశయ్య చేతికి గాయం కావడంతో 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు అర్హుల ఖాతాల్లో నగదు జమ

సాలూరు: ప్రజలకు మేలు చేయాలనే చిత్తశుద్ధితో అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా అత్యంత పారదర్శకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. ఈ క్రమంలో అర్హులైన లబ్ధిదారులు కొంతమందికి వివిధ సాంకేతిక కారణాల వల్ల పథకాల నిధులు అందలేదు. అటువంటి వారికి కూడా పథకాల సొమ్ము అందించేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు నవరత్నాలు ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా ఈ ఏడాది రెండవ విడతగా మంగళవారం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. అర్హులై వివిధ సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని లబ్ధిదారులు పార్వతీపురం మన్యం జిల్లాలో 4,834 మంది ఉన్నారు. వారందరికీ సుమారు రూ.4 కోట్ల 62 లక్షలు ప్రభుత్వం జమచేయనుంది.

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు) | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 547.00 |
| విజయనగరం | రూ. 547.00 |
| శ్రీకాకుళం | రూ. 551.00 |

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 54,490–00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 49,950–00 |
| వెండి (కిలో) | 73,000–00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹130 | ₹230 | ₹ 240 |

# నేరాలు తగ్గుముఖం

- చోరీకేసుల్లో పెరిగిన రికవరీ
- సారా నిర్మూలనే ధ్యేయంగా ఎస్ఈబీ చర్యలు
- దిశ, జాగృతితో ప్రజల్లో పెరిగిన అవగాహన
- వార్షిక సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ ఎం.దీపిక


వార్షిక సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: ఈ ఏడాది జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఇందుకోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు విస్తృతమైన అవగాహన, దిశ, జాగృతి పేరుతో పది రోజుల పాటు పాఠశాలల్లో చేపట్టిన అవగాహన కార్యక్రమాలు ఉపయోగపడ్డాయని చెప్పారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ, గంజాయి వినియోగించే వారి నుంచి అమ్మకాలు చేపట్టే వారి వరకూ కేసులు నమోదుచేయడం, దొంగతనాల నివారణకు ఎల్‌హెచ్ఎంఎస్ యాప్ సద్వినియోగం, కేసుల త్వరితగతిన రికవరీ చేయడం, సారా నిర్మూలన ధ్యేయంగా ఎస్ఈబీ ముందడుగు వేయడం, మందుబాబుల ఆగడాలకు ఎప్పటికప్పుడు చెక్ పెట్టడంతో నేరాల సంఖ్య తగ్గినట్లు వివరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నేర సమీక్ష వార్షిక సమావేశం సోమవారం నిర్వహించి 2022లో జిల్లా పోలీసు శాఖ సాధించిన ప్రగతి, ఛేదించిన కేసుల వివరాలను వెల్లడించారు.

**దిశ యాప్‌లో నాలుగు లక్షల మంది రిజిస్టర్**

దిశ ఎస్ఓఎస్ యాప్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో నాలుగు లక్షల రెండు వేల మంది దిశా ఎస్ఓఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఇప్పటివరకూ 19వేల 654 కాల్స్ రాగా, వాటిలో యాప్ పనితీరును పరిశీలించేందుకు 19వేల 192కాల్స్ వచ్చాయని, 44 కాల్స్‌పై కేసులు నమోదుచేయగా, మరో 418 కాల్స్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు రాజీ అయ్యాయని ఎస్పీ తెలియజేశారు. అదేవిధంగా 2020లో 76 లైంగికదాడి కేసులు నమోదుకాగా, 2021లో ఈ తరహా నేరాలు 34 శాతం తగ్గి 50 కేసులు మాత్రమే నమోదయ్యాయని చెప్పారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే కేసులు 2020లో 218 నమోదుకాగా, 2022లో 19 శాతం తగ్గి 176 కేసులు మాత్రమే నమోదైనట్లు తెలిపారు. 2021లో పోక్సో కేసులు 71 నమోదుకాగా, 2022లో వాటి సంఖ్య 38 శాతం తగ్గి 44 కేసులు మాత్రమే నమోదైనట్లు పేర్కొన్నారు.

**తప్పిపోయిన పిల్లల అప్పగింత**

రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గతేడాది 222 కేసులు నమోదు కాగా, 238 మంది మృతిచెందారని, ఈ ఏడాది పోలీస్‌శాఖ చేపట్టిన భద్రత చర్యల ఫలితంగా పదిశాతం కేసుల సంఖ్య తగ్గి 216 కేసులు నమోదై 216 మంది మృతి చెందారన్నారు. వివాహేతర సంబంధాల కారణంగా గతేడాది 24 హత్యలు నమోదుకాగా, ఈ ఏడాది 23 హత్యకేసులు నమోదయ్యాయన్నారు. గతేడాది 69 మంది పిల్లలు తప్పిపోగా, 2022లో 82 మంది తప్పిపోయారని, అయితే శతశాతం వారిని కనుగొని, వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు అప్పగించామన్నారు.

**సైబర్ మోసాలపై అవగాహన**

ప్రతి ప్రాంతంలోనూ సైబర్ మోసాలు జరిగే తీరు, లోన్ యాప్‌ల వలన కలిగే అనర్థాలను వివరించి అవగాహన కల్పించామని తెలిపారు. జిల్లాలో విస్తృతంగా దాడులు నిర్వహించి లక్షా 98వేల 410 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని, ఇసుక అక్రమ రవాణాదారులపై 158 కేసులు నమోదు చేశామన్నారు. ఈ ఏడాది 24 గంటల వ్యవధిలోనే 1.180 కిలోల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు. బైక్ డిక్కీ నుంచి రూ.5.30 లక్షల నగదు తస్కరించిన కేసును 48 గంటల్లో ఛేదించామని చెప్పారు.

**గ్రామస్థాయిలో సారా నిర్మూలనే ధ్యేయంగా..**

గ్రామస్థాయిలో సారా నిర్మూలనే ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా సారా ప్రభావిత 77 గ్రామాలను గుర్తించి, ఆయా గ్రామాల్లో పూర్తిగా సారాను నిర్మూలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా 79 కుటుంబాలను గుర్తించి, వారికి కలెక్టర్ సహకారంతో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు రూ. 43.31 లక్షల ఆర్థిక సహాయాన్ని 121 మందికి అందించామన్నారు. వీటితో పాటు పోగొట్టుకున్న మొబైల్స్‌ను తిరిగి కనుగొనేందుకు పిర్యాదుదారులు పోలీసుస్టేషన్‌ల చుట్టూ పలుమార్లు తిరగకుండా ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను రూపొందించి, రాష్ట్రంలోనే మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిచామన్నారు. ఈ పోర్టల్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 544 మొబైల్స్ స్వాధీనం చేసుకుని, బాధితులకు అప్పగించామని తెలియజేశారు.

## 117 మొబైల్స్ బాధితులకు అందజేత


మొబైల్ ఫోన్‌ను బాధితురాలికి అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు గత నెలలో ఎస్పీ ఎం.దీపిక ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వెబ్‌పోర్టల్ విజెడ్ఎమ్ మొబైల్ ట్రాకర్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు సత్ఫలితాల నిచ్చింది. వైబ్‌సైట్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు సైబర్ సెల్ పోలీసులు, సిబ్బంది నిరంతర చర్యలు చేపట్టి రూ. 20.15 లక్షలు విలువైన 117 స్మార్ట్ ఫోన్‌లను రికవరీ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా బాధితులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వెబ్‌పోర్టల్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో 117 స్మార్ట్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. బాధితులు పోగొట్టుకున్న మొబైల్స్ మనరాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో వినియోగిస్తున్నట్లు గుర్తించి వారితో మాట్లాడి, ఆయాప్రాంతాల నుంచి వాటిని రికవరీ చేశామన్నారు. బాధితులకు మొబైల్ ఫోన్స్ తిరిగి అందజేయడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమంలో ఎస్పీ సీఐ రుద్రశేఖర్, సైబర్ సెల్ ఎస్సై ఎం.ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గుమ్మలక్ష్మీపురం విద్యార్థులు


రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వాలీబాల్ కోచ్ బి.వైకుంఠరావు

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 27 నుంచి విశాఖపట్నం జిల్లాలో జరగనున్న ఎస్‌జీఎఫ్ బాల బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గుమ్మలక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన తోయక ప్రమీల, తోయక శ్రావణిలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఎస్టీ)కు చెందిన ఆరిక నరసింహ, ఆరిక భగవాన్‌లు ఎంపికైనట్లు బాలుర వాలీబాల్ కోచ్ బి.వైకుంఠరావు (గుమ్మలక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ పీడీ), బాలికల వాలీబాల్ కోచ్ ఎన్.అరుణ జ్యోతి (కేజీబీవీ పీఈటీ)లు సోమవారం తెలిపారు. గత వారం విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 19 విభాగంలో పాల్గొన్న ఈ విద్యార్థులు ఉత్తమ ప్రతిభకబర్చినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్ కోరారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి

- స్కూల్ గేమ్స్ బాక్సింగ్, స్కేటింగ్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక


బాక్సింగ్ పోటీలకు హాజరైన క్రీడాకారులు


స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో అండర్–14,17 విభాగాల్లో బాలబాలికలకు బాక్సింగ్ ఎంపిక, విజ్జి స్టేడియంలో స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టులోకి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులంతా త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీలకు వెళ్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు, స్కేటింగ్ కోచ్‌లు బద్రి, శ్యామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కొత్తగూడ విద్యార్థులు


రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్ నిమ్మక మాధవరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరిక చరణ్, ఆరిక కిరణ్, బిడ్డిక శ్రీనులు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్ బాల్ కోచ్ నిమ్మక మాధవరావు తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 9, 10వ తేదీల్లో విజయనగరం జిల్లా కొప్పెర్లలో జరిగిన ఎస్‌జీఎఫ్ బాలుర జిల్లా స్థాయి హ్యాండ్ పోటీల్లో అండర్ 14 విభాగంలో ఆరిక చరణ్, ఆరిక కిరణ్‌లు, అండర్ 17 విభాగంలో బిడ్డిక శ్రీను ఉత్తమ ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరు ఈనెల 28, 29, 30వ తేదీల్లో అనంతపురం జిల్లా కదిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

# భలే మంచి చౌకబేరం..!

- సరుకుల సరఫరా పేరుతో మోసం
- లబోదిబో మంటున్న బాధితులు


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు


నగదు వసూలు చేసిన స్కీమ్ కార్డు

గుర్ల: ఆరువేల రూపాయల విలువ గల నిత్యావసర సరుకులు రూ.3,600లకే అందిస్తామని నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన ఓ మహిళ మోసం చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల మండలం కొండవెలగాడకు చెందిన ఓమహిళ, కొండకరకాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కలిసి ఏఆర్ బెనిఫిట్ ఫుడ్ సంక్రాంతి కానుక స్కీమ్‌ను పరిచయం చేసి ప్రజలను మోసగించిన ఘటన వెలుగుచూసింది. నెల్లిమర్ల, గుర్ల మండలాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని కొన్ని మండలాల్లో తమ పరిచయాలను ఉపయోగించి కొన్ని నిత్యావసర సరుకులు అందజేస్తామని నమ్మించారు. నెలకు రూ.300 కట్టాలని 12 నెలలు పూర్తయిన వెంటనే సంక్రాంతి పండగ ముందు రూ.3,600కుగాను రూ.6వేల విలువ గల సరుకులు అందజేస్తామని పేద ప్రజలను నమ్మబలికారని బాధితులు ఆరోపిస్తున్నారు.కొండకరకాం గ్రామానికి చెందిన వ్యక్తి పది రోజుల క్రితమే పరారైనట్లు సమాచారం. దీంతో రెండో యజమానిగా ఉన్న మహిళ గుర్ల పోలీస్‌స్టేషన్‌ను, పోలీస్ అధికారులను సంప్రదించి తనకు ప్రాణహాని ఉన్నట్లు ఫిర్యాదు చేసింది. గుర్ల మండలం సొలిపిసోమరాజుపేటలో తల్లిదండ్రుల ఇంటి వద్ద ఆమె కూడా అందుబాటులో లేకపోవడంతో అదే గ్రామానికి చెందిన కొంతమంది ఆమె ఇంటికి వెళ్లి ఆందోళన చేశారు. ఇతర మండలాలకు చెందిన బాధితులు కూడా ఈ సంఘటన బయటపడటంతో ఆందోళన చెందుతున్నారు. ఈ సంక్రాంతి కానుక స్కీము కట్టిన వారిలో సుమారుగా 10వేల నుంచి 15వేల మంది వరకు బాధితులు ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై శిరీషను వివరణ కోరగా విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

## మామాఅల్లుళ్ల దుర్మరణం

- బైక్‌ను కారు ఢీకొనడంతో ప్రమాదం

వీరఘట్టం: మండలంలోని చినగోర సమీపంలో పొల్ల రోడ్డులో బైక్‌పై వెళ్తున్న మామాఅల్లుళ్లను కారు ఢీకొట్టడంతో ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం మండలం కుంబిడి–ఇచ్ఛాపురం పంచాయతీ పరిధిలోని రామాపురం గిరిజన గ్రామానికి చెందిన కూరంగి చిరంజీవి(52), పంట పనుల కోసం వనజ గ్రామం నుంచి తన సొంత మామ మూయక సత్యా (60)న్ని కొద్ది రోజుల కిందట గ్రామానికి తీసుకువచ్చాడు. పనులు ముగించుకుని సోమవారం మధ్యాహ్నం వనజ గ్రామానికి వారిద్దరూ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా మానాపురం నుంచి వీరఘట్టం వైపు వస్తున్న కారు వారి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో మామాఅల్లుళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను వీరఘట్టం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం పాలకొండ సీహెచ్‌సీకి తరలించగా మార్గమధ్యంలో సత్యం, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిరంజీవి మృతి చెందారు. చిరంజీవి భార్య చిన్నమ్మి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.హరికృష్ణ కేసు నమోదు చేశారు.

## శంబర చేరుకున్న పెద పోలమాంబ


అమ్మవారి ఘటాన్ని చదురుగుడిలోకి తీసుకువస్తున్న దృశ్యం

మక్కువ: పోలమాంబ అమ్మవారి మేనత్త పెదపోలమాంబ అమ్మవారు శంబర గ్రామానికి చేరుకున్నారు. సోమవారం రాత్రి 8.30గంటల ప్రాంతంలో శంబరపోలమాంబ అమ్మవారి చదురుగుడిలో పూజారి కుటుంబీకులు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, కమిటీ సభ్యులు, గ్రామమున్సబు, కరణం, రెవిన్యూయుడు కుటుంబసభ్యులు, భక్తులు, మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్లు, గ్రామపెద్దలు, దేవాదాయశాఖ సిబ్బంది పెద పోలమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చదురుగుడిలో మట్టిఘటానికి పసుసు, కుంకుమలతో ప్రత్యేక అలంకరణ చేసి, మేళతాళాలు, బాజాభజంత్రీలతో, యువత కేరింతల నడుమ ఎస్.పెద్దవలస, ఎరగడవలస గ్రామాలవైపు వెళ్లే రెండురోడ్ల జంక్షన్ వద్ద ఘటాన్ని ఉంచి పూజలు జరిపించారు. అనంతరం అక్కడి నుంచి ఘటాన్ని చదురుగుడిలోకి తీసుకువచ్చి పడమరభాగం వైపు ముఖం ఉండేలా ఉంచారు. పెద్దఅమ్మవారు తొమ్మిదిరోజుల పాటు ప్రధానాలయంలో కొలువై ఉంటారు. అమ్మవారి ఆలయంలో పెద్దఅమ్మవారి ఘటానికి భక్తులు ఉదయం వేళలో పూజలు చేసి సాయంత్రం గ్రామంలోని అన్నిపురవీధులలో బాజాభజంత్రీల నడుమ ఊరేగిస్తారు. ఈ విధంగా తొమ్మిదిరోజుల పాటు అమ్మవారిని భక్తులు దర్శించి వచ్చే జనవరి 2న తొలేళ్ల ఉత్సవం, 3న తేదీన పెద్దమ్మవారి పండగ, 4వతేదీన పెద్ద అమ్మవారి అనుపోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు శంబర పోలమాంబ అమ్మవారిని కొని తెచ్చేందుకు చాటింపువేసి, జనవరి 9న గ్రామంలోకి తీసుకువస్తారు. ఆరోజు నుంచి పోలమాంబ జాతర ప్రారంభమవుతుంది. అప్పటినుంచి 14రోజుల పాటు గ్రామంలోని అన్ని పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించి జనవరి 23వతేదీన తొలేళ్ల ఉత్సవం, 24న సిరిమానోత్సవం, 25న అనుపోత్సవం జరిపిస్తారు.

## జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కురుపాం: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ఏబీవీపీ పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో విజయవాడలో జరిగిన క్రీడల్లో ఏకలవ్య మోడల్ పాఠశాలనుంచి 13మంది విద్యార్థులు పాల్గొని ఐదుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారని చెప్పారు. అండర్–14 తైక్వాండో 29–32 విభాగంలో తోయక అలేఖ్య ప్రథమస్థానంలో నిలిచిన గోల్డ్‌మెడల్ సాధించిందని తెలిపారు. అలాగే అండర్–19 జూడోలో బర్లి జయరాజు 50–55 విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్యమెడల్‌ను సాధించాడన్నారు. అండర్–19 ఖోఖో బాలికల విభాగంలో మువ్వల ఝాన్సీ, ఆరిక దీక్షిత, బిడ్డిక సునేమి ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. విద్యార్థులు ప్రతి భ కనబరచడం పట్ల ప్రిన్సిపాల్‌తోపాటు ఉపా ధ్యాయులు వారికి అభినందనలు తెలియజేశారు.

# కలెక్టర్ స్పందనకు 133 వినతులు


అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 136 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా 72 వినతులు రెవెన్యూ విభాగానికి చెందినవే ఉన్నాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, ప్రత్యేక సబ్‌కలెక్టర్‌లు పద్మావతి, సూర్యనారాయణ, దొర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

**పారదర్శకంగా అంగన్‌వాడీ పదోన్నతులు**

జిల్లాలో మహిళా శిశుసంక్షేమ శాఖ పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఆయాలకు కార్యకర్తలుగా పదోన్నతులు కల్పించేందుకు చేపట్టిన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. స్పందన కార్యక్రమం సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత మేరకు అర్హులైన వారికి పదోన్నతులు కల్పిస్తామని చెప్పారు. పదోన్నతులు కల్పించేందుకు హామీ ఇస్తూ పలువురు వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, పదోన్నతుల కోసం ఎవరూ డబ్బులు చెల్లించవద్దని పేర్కొన్నారు. పదోన్నతి ఆశిస్తున్న వారు ఎలాంటి పైరవీలకు పాల్పడవద్దని సూచించారు. రెవెన్యూ డివిజన్ అధికారులు ఆధ్వర్యంలో పదోన్నతి అభ్యర్థుల జాబితా రూపొందించి అర్హులకు పారదర్శకంగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ చేపడుతున్నామని, ఎవరూ ఆందోళనకు గురి కావలసిన అవసరం లేదన్నారు.

**నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలి**

పీఎంకిసాన్ పథకం కింద వచ్చే జనవరి నెలలో విడుదల చేసే ప్రోత్సాహక మొత్తం రూ.2వేలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలసి ఉంటుందని కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. రైతులు ఈకేవైసీ చేయించుకునేందుకు ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉందని స్పష్టం చేశారు.

**ఎస్పీ స్పందనకు 42 ఫిర్యాదులు**

విజయనగరం క్రైమ్: ప్రజల నుంచి పిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఎస్పీ ఎం.దీపిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 42 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి పిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్టపరిధిలో చర్యలు చేపట్టి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ రుద్రశేఖర్, ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

**స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు**

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వారి సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

## క్లుప్తంగా

### నేడు,రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

**విజయనగరం:** కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 27, 28 తేదీల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి నగరానికి నీటిని పంపింగ్ చేసే పైప్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో నగరంలోని 17, 18, 19, 20, 21, 22, 23, 24, 25, 32, 33, 34, 35, 36, 37, 38, 39, 40, 41, 42, 43, 44, 46, 47 డివిజన్ల పరిధిలో తాగునీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

### పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రేగాన, తదితరులు

**నెల్లిమర్ల:** స్థానిక గాంధీనగర్ కాలనీలోనున్న మన్నా చర్చిలో క్రిస్మస్ సంబరాల్లో భాగంగా ఆదివారం రాత్రి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చర్చి పాస్టర్ స్టీవెన్ పాల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఏపీ టూరిజమ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు పాల్గొని క్రీస్తు సందేశాన్ని వినిపించారు.

### సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నెల్లిమర్ల:** స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోనున్న ప్రభుత్వ పాఠశాలలో 1989–90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. విజయనగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అందరూ కలుసుకుని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు.

### సూరిబాబు సేవలు చిరస్మరణీయం..



సూరిబాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దలు

**నెల్లిమర్ల:** జరజాపుపేట మాజీ సర్పంచ్, నెల్లిమర్ల జూట్‌మిల్లు కార్మిక సంఘ నాయకుడు నల్లి సూరిబాబు సేవలు చిరస్మరణీయమని స్థానిక నాయకులు కొనియాడారు. సూరిబాబు వర్ధంతి సందర్భంగా సోమవారం జరజాపుపేటలోని ఆయన విగ్రహానికి వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, పెద్దలు నల్లి చంద్రశేఖర్, ఎంఎం నాయుడు, పోలుబోతు నారాయణమూర్తి, తాలాడ సన్నిబాబు, మద్దిల శ్రీనివాసరావు, కనకల హైమావతి, తదితరులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. గ్రామంతో పాటు జూట్ కార్మికులకు సూరిబాబు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

### కొండవెలగాడలో పింఛన్ల పరిశీలన



పింఛన్ల వివరాలు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ భానోజీరావు

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని కొండవెలగాడ సచివాలయంలో సామాజిక పింఛన్లను సోమవారం పరిశీలించారు. ఈఓపీఆర్‌డీ హెచ్.భానోజీరావు రికార్డులను పరిశీలించి, పింఛన్‌దారుల వివరాలను సరి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లను అందజేస్తోందన్నారు. పింఛన్‌దారుల్లో అనర్హులుంటే వెంటనే గుర్తించాలన్నారు.

### వైకుంఠ నారాయణుడికి ప్రత్యేక పూజలు



దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

**విజయనగరం రూరల్:** ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వైకుంఠ నారాయణునికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చాణక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి వేదమంత్రాల నడుమ స్నపనం, అర్చన, పంచామృతభిషేలు చేపట్టారు. కార్యక్రమంలో నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.

# జగనన్న నాయకత్వాన్ని బలపరచాలి..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- వైఎస్సార్‌సీపీలో చేరిన 34వ డివిజన్ టీడీపీ మహిళా అధ్యక్షురాలు

**విజయనగరం:**

సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని 36వ డివిజన్ పరిధిలో గల గాంధీ కాటా నుంచి ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉంది.. సుఖసంతోషాలతో ఉన్నారా... అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా 34వ డివిజన్ తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు శ్యామలాదేవి కోలగట్ల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆమెతో పాటు పలువురు మహిళలు పార్టీ లో చేరగా వారందరికీ కోలగట్ల, మేయర్ విజయలక్ష్మి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాలని కోరారు. నగరంలో చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన వస్తోందన్నారు. ప్రభుత్వ విధానాలకు ఆకర్షితులతో ముఖ్యంగా మహిళలు పార్టీలోకి చేరడం శుభ పరిణామమన్నారు. టీడీపీ నేత చంద్రబాబు సభకు మహిళలు రాకపోవడంతోనే ఆ పార్టీ పట్ల మహిళల్లో ఉన్న అనాసక్తి వ్యక్తమవుతుందని తెలిపారు. మహిళా పక్షపాతిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి నేరుగా ప్రజల ఖాతాలకే ప్రభుత్వ పథకాల మొత్తాలను అందించడం వల్ల అవినీతి లేని పాలన సాగుతోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చి ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన పాలనకు తగ్గట్లుగానే తాము కూడా స్థానిక సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేవిధంగా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ బాలి పద్మావతి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బాలి పైడిరాజు, శ్రీనివాసరావు, డివిజన్ ఇన్‌ఛార్జ్ కె.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బాలి నరేంద్రప్రతాప్, తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో పూసపాటి శ్యామల, లక్ష్మి, జి.పద్మావతి, నారాయణరావు, ఆయా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



పార్టీలో చేరిన 34వ డివిజన్ టీడీపీ మహిళా అధ్యక్షురాలు, తదితరులతో కోలగట్ల

# ఆర్టీసీ అభ్యున్నతికి కృషి చేయండి..

**నెల్లిమర్ల రూరల్:** ఆర్టీసీ ప్రగతికి ఉద్యోగులు కృషి చేయాలని ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ అన్నారు. మండలంలోని కొండవెలగాడలో ఏపీపీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు రూపొందించిన కొత్త సంవత్సర క్యాలెండర్లను సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్న తీరు అభినందనీయమని కొనియాడారు. కొత్త ఏడాదిలో అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు, కార్పొరేషన్ డైరెక్టర్ వామనాచారి, ప్రతినిధులు తిరుపతిరావు, పార్థసారథి, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ బంగారమ్మ, తదితరులు

# ఆక్రమణలపై విచారణ చేయాలి..

**విజయనగరం టౌన్:** వ్యాస నారాయణ మెట్ట దేవస్థానానికి సంబంధించి చోటుచేసుకున్న ఆక్రమణలపై విచారణ కమిటీ వేయాలని కోరుతూ సంబంధిత అధికారులు, కమిషనర్‌కు లేఖ రాసినట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ వినోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం సంస్థానం నిర్వహించిన 104 గ్రూప్ టెంపుల్స్‌లో ఇదొక ఆలయమన్నారు. అయితే 2015 నుంచి కొందరి చేతుల్లో అన్యాక్రాంతమైందని గుర్తించామన్నారు. ఈఓల నిర్లక్ష్యం వల్ల సంబంధిత దేవాలయానికి చెందిన కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులు అనధికారుల చేతుల్లో ఉండిపోయాయన్నారు. ఈ అక్రమాలపై విచారణ చేపట్టాలని లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

### పంపిణీకి సిద్ధమైన ఇళ్ల స్థలాలు

**విజయనగరం రూరల్:** పేదలకు పంపిణీ చేయడానికి ఇళ్ల స్థలాలు సిద్ధమయ్యాయని తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని సారిక రెవెన్యూలో రెండో అతిపెద్దదైన లేఅవుట్‌లో ఈ నెల 29న రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతుల మీదుగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు.

సారిక గ్రామ సమీపంలో 93.84 ఎకరాల్లో 4815 ప్లాట్లు పంపిణీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. యడం జరిగిందని ఆయన తెలిపారు. పట్టణ పరిధిలోని 3545 మంది పేదలకు, రూరల్ పరిధిలోని 632 మందికి స్థలాలు కేటాయించినట్లు చెప్పారు.

# ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి

- ఏపీటీఎఫ్

**విజయనగరం అర్బన్:** ప్రభుత్వ ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ ఉభయ జిల్లాల కమిటీలు డిమాండ్ చేశాయి. విజయనగరం, పార్వతీపురం – మన్యం జిల్లాల ఏపీటీఎఫ్ జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, బకాయి ఉన్న ఏడు విడతల డీఏలతో పాటు రెండు విడతల కొత్త డీఏల సొమ్ములు విడుదల చేయాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల మాచింగ్ గ్రాంట్ రూ.17 వేల కోట్లు, డీఏ బకాయి రూ.3 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్, మోడల్ స్కూల్, గురుకులాలు, కేజీబీవీ, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఎ. సూర్యకుమారికి, డీఈఓ బి. లింగేశ్వరరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్‌విజయనగరం జిల్లా అధ్యక్షుడు డి.ఈశ్వరరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఏఐఎఫ్ఈఏ ఉపాధ్యక్షుడు వై.సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటరమణ, పార్వతీపురం – మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ధనుంజయనాయుడు, రాష్ట్ర కార్యదర్శి పి. ధనుంజయరావు, ఎన్వీ పైడిరాజు, ఎం.బలరాంనాయుడు, మధుసూదనరావు, ఎస్.శ్రీదేవి, ఉభ య జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

# రాజ్యాధికారమే లక్ష్యం..

**విజయనగరం ఫూల్‌బాగ్:** శ్రామికవర్గానికి రాజ్యాధికారమే లక్ష్యంగా సీపీఐ ఎన్నో పోరాటాలు చేసిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. సీపీఐ 98వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక పీడబ్ల్యూ మార్కెట్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎర్రజెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిటిష్ పాలకుల నిర్బంధకాండకు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 1925 డిసెంబర్ 26న కాన్పూర్ (ఉత్తరప్రదేశ్) గడ్డపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ ) ఆవిర్భవించిందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.నాగభూషణం, జిల్లా సమితి సభ్యులు ఎస్. సునీల్, శాఖ సభ్యులు కె. సూర్యనారాయణ, పి. శ్రీనివాసరావు, చిన్నా, మురళి, పొందూరు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు

# ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

**పూసపాటిరేగ:** ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో గల సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధార్‌కు సంబంధించిన అన్ని సేవలూ అందుబాటులో ఉంటాయన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, టొంపల సీతారాం పాల్గొన్నారు.

# మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే చర్యలు

**విజయనగరం క్రైమ్:** బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం మత్తులో డ్రైవింగ్ చేసినా చర్యలు తప్పవని రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు అన్నారు. నగరంలోని వై జంక్షన్, జొన్నవలస, ముడిదాం, తదితర ప్రాంతాల్లో సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. యువత మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. రూరల్ ఎస్సై గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.



వై జంక్షన్ వద్ద డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లు చేస్తున్న రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

**చీపురుపల్లిరూరల్:** విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. మండలంలోని మెట్టపల్లి,పెదనడిపల్లి ఉన్నత పాఠశా లల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన ఎడ్యూటెక్ బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను సోమ వారం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి సీఎం జగన్ కోట్లరూపాయలు ఖర్చు చేస్తున్నారని అన్నారు. పేద విద్యార్థులు కూడా ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. పిల్లలను బడికి పంపించే తల్లులకు జగనన్న అమ్మఒడి పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం,విద్యాకానుక పేరిట బ్యాగులు, పాఠ్య,నోట్ పుస్తకాలు, బూట్లు, యూనిఫాం, బెల్టులు అందిస్తోందని వివరించారు. అలాగే జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నాణ్యమైన భోజనం అందిస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకుని శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం,వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, ఆయా పంచాయతీల నాయకులు చందక గురునాయుడు, మీసాల ఈశ్వరరావు, పిసిని శ్రీనివాసరావు, సూర పోలరాజు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

**పూసపాటిరేగ:** ప్రతి విద్యార్థీ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన టెక్నాలజీని అందిపుచ్చుకొని, పోటీ ప్రపంచంలో ఉన్నతస్థాయికి ఎదగాలని నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 19 ప్రభుత్వ పాఠశాలలకు 921 మంది విద్యార్థులు, 122 మంది ఉపాధ్యాయులకు 1043 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాన్నారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. అలాగే విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో రాష్ట్రం అన్నివిధాలుగా వెనుకబడిందని ఆరోపించారు. కొన్ని రోజులు కిందట బాదుడే బాదుడు.. తాజాగా ఇదేం ఖర్మ అంటూ.. టీడీపీ నాయకులు హడావిడి చేస్తున్నారని, వీరి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న సాధారణ ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పూసపాటిరేగకు చెందిన చందక త్రినాథకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన 1,70,000 రూపాయల చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్. సత్యనారాయణరాజు, ఎంఈఓ లలితకుమారి, హెచ్ఎం బి.శంకరరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, మొంగం నాగబాబు, దేశెట్టి గణేష్, టి.సీతారాం, ఎడ్ల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ట్యాబ్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, నియోజకవర్గ పరిశీలకుడు సూరిబాబు, తదితరులు

### శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి

**విజయనగరం టౌన్:** శిష్టకరణ, శొండి, కళింగ వైశ్యులు, తదితర 38 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని శిష్టకరణ సంఘ ప్రధాన కార్యదర్శి ఎంపీ జి.ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ జాబితాలో ఉన్నవారందరినీ ఓబీసీలోకి మార్చాలని డిమాండ్ చేశారు.

### శ్రీక్షేత్రమ్‌లో లక్ష తులసి పూజలు



దేవతామూర్తులకు లక్షతులసి పూజలు

**విజయనగరం రూరల్:** శ్రీక్షేత్రమ్‌లోని అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో సోమవారం లక్ష తులసి పూజలు నిర్వహించారు. అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు, రుత్విక్కుల వేదమంత్రాల నడుమ లక్ష తులసి పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజమన్నే పాల్గొన్నారు.

# జమ్ము పాఠశాల సిబ్బందికి సత్కారం

**విజయనగరం రూరల్:** జాతీయ స్వచ్ఛ విద్యాలయ పురస్కారం పొందిన కార్పొరేషన్ పరిధిలోని జమ్ము ప్రాథమిక పాఠశాల సిబ్బందిని స్థానిక జయంతి స్మారక గ్రంథాలయ సేవా సంస్థ నిర్వాహకులు సోమవారం సత్కరించారు. జమ్ము ప్రాథమిక పాఠశాలకు జాతీయ పురస్కారం రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయ సిబ్బందిని, సహకులను సత్కరించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.రామ్మోహన్, విశ్రాంత ఉపాధ్యాయుడు పోతినాయుడు, నిర్వాహకులు నాగేశ్వరరావు, ఏఎస్ ప్రసాదరావు, ఎం.విజయభాస్కర్ పాల్గొన్నారు.



సత్కార గ్రహీతలతో జయంతి స్మారక సంస్థ నిర్వాహకులు

# వంగవీటి మోహన్‌రంగా స్ఫూర్తితో పనిచేయాలి

**విజయనగరం ఫూల్‌బాగ్:** వంగవీటి మోహన్‌రంగా స్ఫూర్తితో బీసీ రిజర్వేషన్లు, రాజ్యాధికారం సాధించుకోవడానికి రాష్ట్రంలో ఉన్న ప్రతి తెలగ కులస్తుడూ సైనికుడిలా పనిచేయాలని జిల్లా తెలగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు చనమల ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రెవెన్యూ హోమ్‌లో రంగా వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఈశ్వరరావు, జి. నరసింగరావు, హేమల పద్మజ, టి. నానాజీ, ఎ. రామకృష్ణ, సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.



వంగవీటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెలగ కులస్తులు

# ఇళ్లల్లో చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

**విజయనగరం క్రైమ్:** ఇటీవల కాలంలో పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, బొబ్బాదిపేట తదితర ప్రాంతాల్లో ఇళ్లల్లో చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు తస్కరించిన నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ బి.వెంకటరావు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం పెదమధుపాడ గ్రామానికి చెందిన కడియాల రఘురామ్ సెప్టెంబరు 7న ఆర్టీసీ కాలనీలో పిళ్లా చంద్రశేఖర్ ఇంట్లో చోరీకి పాల్పడి, బంగారు ఆభరణాలను తస్కరించాడు. అదేవిధంగా అదే నెల 19న బొబ్బాదిపేటలో గొడబ హరిప్రసాద్ ఇంట్లో చోరీకి పాల్పడి బంగారం, వెండి వస్తువులను పట్టుకుపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు అయ్యన్నపేట గ్రామ శివారున సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో నిందితుడ్ని అదుపులోకి తీసుకుని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్సై వి.అశోక్ కుమార్, ఎం.అచ్చిరాజు, పి.శివశంకర్, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు



# ఆకట్టుకున్న రోబోటిక్ వర్క్‌షాపు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు



రోబోటిక్ ప్రదర్శనలను చూపిస్తున్న విద్యార్థులు

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో సోమవారం రోబోటిక్ వర్క్‌షాపు నిర్వహించారు. పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎనిమిది రోబోటిక్ ప్రాజెక్ట్‌లు ప్రదర్శించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ కృష్ణారావు హాజరై ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మలత, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## షేన్‌వార్న్‌కు ఆసీస్ బోర్డు సముచిత గౌరవం

దివంగత క్రికెటర్ షేన్‌వార్న్‌ను ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు (సీఏ) సముచిత రీతిలో గౌరవించనుంది. ఇకపై ఆస్ట్రేలియా అత్యుత్తమ టెస్టు క్రికెటర్ అవార్డును షేన్‌వార్న్ పేరిట ఇవ్వనుంది. ఇకపై ఈ అవార్డు 'షేన్ వార్న్ బెస్ట్ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా వ్యవహరిస్తారు. గత మార్చిలో షేన్ వార్న్ మృతి చెందిన తర్వాత అతని సొంత మైదానం మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో మొదటి టెస్టు జరుగుతున్న సందర్భంగా సోమవారం ఈ విషయాన్ని ఆసీస్ బోర్డు ప్రకటించింది. లెగ్‌స్పిన్ దిగ్గజం వార్న్ 145 టెస్టుల్లో ఆసీస్‌కు ప్రాతినిధ్యం వహించి 708 వికెట్లు పడగొట్టాడు.

## కేరళను గెలిపించిన సందీప్ సింగ్



ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీ కీలక విజయాన్ని అందుకుంది. కొచ్చిలో జరిగిన మ్యాచ్‌లో కేరళ 1–0 గోల్ తేడాతో ఒడిశా ఎఫ్‌సీని ఓడించింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్ 'డ్రా' దిశగా సాగుతున్న తరుణంలో 86వ నిమిషంలో సందీప్ సింగ్ అద్భుత గోల్ సాధించి కేరళను గెలిపించాడు. తాజా ఫలితం అనంతరం కేరళ బ్లాస్టర్స్ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరింది.

# నిఖత్ పసిడి పంచ్

- జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్
- 50 కేజీల విభాగంలో విజేతగా నిలిచిన తెలంగాణ బాక్సర్



**భోపాల్:** తెలంగాణ స్టార్ బాక్సర్, ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ నిలబెట్టుకుంది. ఈ పోటీల్లో పాల్గొన్న టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ కూడా బంగారు పతకం సాధించింది. సోమవారం ముగిసిన ఈ సీనియర్ మహిళల (ఎలైట్) జాతీయ బాక్సింగ్ పోటీల్లో పది పతకాలతో రైల్వే జట్టు (ఆర్‌ఎస్‌పీబీ) ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఆఖరి రోజు పోటీల్లో టైటిల్ వేటలో... రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్‌ఎస్‌పీబీ) బాక్సర్ల హవా కొనసాగినప్పటికీ తెలంగాణ అమ్మాయి పంచ్ ముందు రైల్వే బాక్సర్ తలవంచక తప్పలేదు. 50 కేజీల ఫైనల్లో నిఖత్‌కు అనామిక (ఆర్‌ఎస్‌పీబీ) నుంచి గట్టిపోటీ ఎదురైంది. కానీ 26 ఏళ్ల నిజామాబాద్ బాక్సర్ మాత్రం తన పంచ్ పవర్‌తో ప్రత్యర్థిని ఓడించింది. నిఖత్ 4–1తో గెలిచి టైటిల్‌ను నిలబెట్టుకుంది. 75 కేజీల తుది పోరులో అస్సామ్ మేటి బాక్సర్ లవ్లీనా 5–0తో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్‌ఎస్‌సీబీ)కు చెందిన అరుంధతీ చౌదరిపై అలవోక విజయం సాధించింది. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్ రజతం పతక విజేత మంజు రాణి 48 కేజీల ఫైనల్లో 5–0తో కళైవాణి (తమిళనాడు)పై ఏకపక్ష విజయం సాధించింది. శిక్ష (54 కేజీలు), పూనమ్ (60 కేజీలు), శశి చోప్రా (63 కేజీలు), నుపుర్ (ప్లస్ 81 కేజీలు) కూడా బంగారు పతకాలు సాధించారు. ఆర్‌ఎస్‌పీబీ జట్టు బాక్సర్లలో మరో ముగ్గురు రజతాలు పొందగా, ఇద్దరికి కాంస్య పతకాలు లభించాయి. 2021 యూత్ ప్రపంచ చాంపియన్ సనమచ తోక్‌చొమ్ (మణిపూర్) 70 కేజీల తుదిపోరులో 3–2తో శ్రుతి యాదవ్ (మధ్యప్రదేశ్)పై గెలిచింది. 12 కేటగిరీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 302 మంది మహిళా బాక్సర్లు ఈ చాంపియన్‌షిప్‌లో తలపడ్డారు. అతిథిగా హాజరైన కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్‌ను తెలంగాణ క్రీడల మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అభినందించారు.

## ఘనమైన సంవత్సరం




**ఈ** ఏడాది మార్చిలో సోఫియా (బల్గేరియా)లో జరిగిన ప్రతిష్టాత్మక స్ట్రాన్జా మెమోరియల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నిఖత్ జరీన్ స్వర్ణం గెలిచింది. అయితే ఈ విజయం సాధించినప్పుడు ఈ ఏడాది ముున్ముందు ఆమె మరింత వేగంతో దూసుకుపోగలదని ఎవరూ ఊహించి ఉండరు. ఎందుకంటే స్ట్రాన్జా టోర్నీ గెలవడం చాలా మందికి పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అప్పటికే రెండు సార్లు ఇదే టోర్నీని గెలిచిన నిఖత్ మూడో సారి టైటిల్ సొంతం చేసుకోవడంతో పాటు ఇంకా వర్ధమాన బాక్సర్‌గానే ఆమెకు గుర్తింపు ఉండటం కూడా మరో కారణం. అయితే మార్చి నుంచి మే నెలకు వచ్చే సరికి నిఖత్ 'ప్రపంచం' ఒక్కసారిగా మారిపోయింది. ఇస్తాన్‌బుల్‌లో జరిగిన వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో చాంపియన్‌గా నిలిచి ఆమె ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ ఘనత సాధించిన ఐదో భారత బాక్సర్‌గా నిలిచిన నిఖత్‌పై అన్ని వైపులనుంచి ప్రశంసల వర్షం కురవడంతో పాటు నిఖత్ పంచ్ పదునేమిటో కూడా తెలిసింది. అయితే దీని తర్వాత వెంటనే నిఖత్‌కు మరో సవాల్ ఎదురైంది. విశ్వ విజేతగా నిలిచిన కేటగిరీ 52 కేజీలు కాగా... ఇందులోనే కొనసాగితే పారిస్‌లో జరిగే 2024 ఒలింపిక్స్‌లో పాల్గొనడం అసాధ్యంగా మారింది. రాబోయే ఒలింపిక్స్‌లో 52 కేజీల కేటగిరీలో లేక పోవడంతో ఒలింపిక్ పతకం లక్ష్యంగా కొత్తగా సాధన చేయాల్సిన పరిస్థితి. ఇలాంటి సమయంలో ఆమె తక్కువ వెయిట్ కేటగిరీకి మారింది. ముున్ముందు 50 కేజీల విభాగంలో పోటీ పడాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో మొదటి ప్రయత్నం కామన్వెల్త్ క్రీడల రూపంలో వచ్చింది. ఆగస్టులో బర్మింగ్‌హామ్‌లో జరిగిన ఈ పోటీల్లోనూ సత్తా చాటి నిఖత్ స్వర్ణాన్ని అందుకుంది. దాంతో రివార్డులతో పాటు కేంద్ర క్రీడా పురస్కారం 'అర్జున' కూడా ఆమె చెంతకు చేరింది. ఇప్పుడు సీనియర్ నేషనల్స్ వంతు. వరల్డ్ చాంపియన్ జాతీయ స్థాయి పోటీల్లో పతకం గెలవడం చూస్తే తక్కువగా కనిపించవచ్చు. కానీ కొత్తగా దూసుకొచ్చే యువ బాక్సర్లు నేషనల్స్‌లో సంచలనాలు సృష్టించడం కొత్త కాదు. అలాంటి స్థితిలో తన 50 కేజీల కేటగిరీలో నిఖత్ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ విజయాన్ని అందుకుంది. తొలి మూడు రౌండ్‌లు 'నాకౌట్' కాగా, సెమీస్‌లో 5–0తో, ఫైనల్లో 4–1తో ఆమె గెలిచింది. అద్భుతంగా సాగిన ఈ ఏడాది స్ఫూర్తితో ముున్ముందు మరిన్ని ఘనతలు అందుకోవాలని నిఖత్ పట్టుదలగా ఉంది. '2022 నాకు అద్భుతంగా సాగింది. వరుసగా మూడు అంతర్జాతీయ స్వర్ణాల తర్వాత ఇప్పుడు జాతీయ చాంపియన్‌షిప్ పసిడి కూడా దక్కడం అదనపు ఆనందాన్నిచ్చింది. దీనికి కారణమైన నా కుటుంబ సభ్యులు, కోచ్‌లు వార్‌బర్టన్, భాస్కర్‌భట్‌లకు కృతజ్ఞతలు' అని ఆమె వ్యాఖ్యానించింది.

– సాక్షి క్రీడా విభాగం

## పాకిస్తాన్ 317/5


### న్యూజిలాండ్‌తో తొలి టెస్టు


బాబర్

**కరాచీ:** సొంతగడ్డపై ఇటీవలే ఇంగ్లండ్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్తాన్ జట్టుకు న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో మెరుగైన ఆరంభం లభించింది. సోమవారం ప్రారంభమైన తొలి టెస్టులో ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో పాక్ 5 వికెట్ల నష్టానికి 317 పరుగులు చేసింది. కెప్టెన్ బాబర్ ఆజమ్ (277 బంతుల్లో 161 నాటౌట్; 15 ఫోర్లు, 1 సిక్స్) అజేయ శతకం సాధించగా, దాదాపు నాలుగేళ్ల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడిన వికెట్ కీపర్ సర్ఫరాజ్ అహ్మద్ (153 బంతుల్లో ) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. బాబర్‌కు టెస్టుల్లో ఇది 9వ సెంచరీ. ఒక దశలో పాకిస్తాన్ స్కోరు 110/4 కాగా...ఐదో వికెట్‌కు 196 పరుగులు జోడించి బాబర్, సర్ఫరాజ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. కివీస్ బౌలర్లలో బ్రేస్‌వెల్, ఎజాజ్ పటేల్ చెరో 2 వికెట్లు తీశారు.

## దక్షిణాఫ్రికా 189 ఆలౌట్

### ఆస్ట్రేలియాతో రెండో టెస్టు


గ్రీన్

**మెల్‌బోర్న్:** 'బాక్సింగ్ డే' టెస్టులో ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి దక్షిణాఫ్రికా కుప్పకూలింది. సోమవారం ప్రారంభమైన ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 68.4 ఓవర్లలో 189 పరుగులకే ఆలౌటైంది. మార్కో జాన్సన్ (59), వికెట్ కీపర్ కైల్ వెరీన్ (52) అర్ధ సెంచరీలు సాధించగా, మిగతావారంతా విఫలమయ్యారు. ఒక దశలో సఫారీ జట్టు స్కోరు 67/5 కాగా... వీరిద్దరు ఆరో వికెట్‌కు 112 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. ఆసీస్ బౌలర్లలో కామెరాన్ గ్రీన్ (5/27) ఐదు వికెట్ ప్రదర్శనతో ప్రత్యర్థిని దెబ్బ కొట్టగా, స్టార్క్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా ఉస్మాన్ ఖాజా (1) వికెట్ కోల్పోయి 45 పరుగులు చేసింది. డేవిడ్ వార్నర్ (32 నాటౌట్), లబుషేన్ (5 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. వార్నర్ కెరీర్‌లో ఇది 100వ టెస్టు కాగా...ఈ ఘనత సాధించిన 14వ ఆసీస్ ఆటగాడిగా అతను నిలిచాడు.

## '360 డిగ్రీ అలా మొదలైంది'

### సూర్యకుమార్ యాదవ్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** భారత డాషింగ్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ తన 360 డిగ్రీ మెరుపుల రహస్యం చెప్పాడు. స్కూల్ రోజుల్లో సిమెంట్ ట్రాక్‌పై ఆడే సమయంలోనే తన '360' ఆట మొదలైందన్నాడు. రబ్బర్ బంతులతో క్రికెట్ ఆడే సమయంలో లెగ్‌సైడ్ బౌండరీ 95 గజాల దూరంలో ఉంటే, ఆఫ్‌సైడ్ 25–30 గజాల దూరంలో ఉండేదని...వేగంగా లెగ్ సైడ్ వైపు దూసుకొచ్చే బంతులను కాకుండా తక్కువ దూరంలో ఉన్న వైపు బౌండరీలు కొట్టేందుకు చేసిన ప్రయత్నమే 360 డిగ్రీ బ్యాటింగ్‌కు కారణమైందన్నాడు. అయితే నెట్స్‌లో మాత్రం అలా ప్రత్యేకించి 360 కోణంలో ఏనాడు ప్రాక్టీస్ చేయలేదని సూర్యకుమార్ చెప్పాడు. స్టార్ బ్యాటర్స్ విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం తన అదృష్టమన్నాడు. కోహ్లితో ఇటీవల మంచి భాగస్వామ్యాలు నమోదు చేయడం చాలా ఆనందంగా ఉందన్నాడు. రోహిత్‌తో అయితే తనకు పెద్దన్న అనుబంధమన్నాడు. ముంబై ఇండియన్స్‌లో 2018లో చేరినప్పటి నుంచి ఈ బంధం కొనసాగుతోందన్నాడు. 'నా క్రికెట్ ప్రయాణంలో ముంబై ఇండియన్స్, నా భార్య దివిష కీలక పాత్ర పోషించారు. కేకేఆర్ నుంచి ముంబై ఫ్రాంచైజీకి మారిన తర్వాతే దశ కూడా మారింది. టాపార్డర్‌లో బ్యాటింగ్‌కు దింపడంతో నన్ను నేను నిరూపించుకున్నాను. దీనికి సరిగ్గా రెండేళ్ల ముందు 2016లో దివిషతో వివాహమైంది. మేం ఒకటైనట్లే మా ఆలోచనలు ఒకటయ్యాయి. ఆమె వచ్చాక... నేను ముంబైలో చేరాక నా కెరీర్ మరో దశకు చేరింది' అని వివరించాడు. దశాబ్దం క్రితమే భారత ఎమర్జింగ్ టీమ్ (అండర్–23) కెప్టెన్‌గా ఉన్న తనకు టీమిండియాలో ఎంపికయ్యేందుకు చాలా సమయమే పట్టిందన్నాడు. అయితే ఏనాడు కూడా నిరాశ చెందకుండా జాతీయ జట్టుకు ఎలా చేరాలన్న లక్ష్యంతోనే తన ఆటకు మెరుగులు దిద్దుకున్నానని సూర్యకుమార్ వివరించాడు. ఒత్తిడిని ఎదుర్కోవడంపై మాట్లాడుతూ పదేళ్ల ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడిన తనకు ఆటలో ఎదురయ్యే పరిస్థితులు తెలుసని, ఎలా అధిగమించాలో కూడా తెలుసని చెప్పాడు. అవకాశం లభిస్తే భారత టెస్టు జట్టులో కూడా సత్తా చాటగలనని సూర్యకుమార్ స్పష్టం చేశాడు.

## సంయుక్త ఆధిక్యంలో అర్జున్, కార్ల్‌సన్

### 'ఫిడే' ప్రపంచ ర్యాపిడ్ చెస్ టోర్నీ


అర్జున్

**అల్మాటీ (కజకిస్తాన్):** తెలంగాణ యువ గ్రాండ్ మాస్టర్ ఇరిగేశి అర్జున్ 'ఫిడే' ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో వరుస విజయాలతో సత్తా చాటుకున్నాడు. ఓపెన్ కేటగిరీలో అతను ప్రపంచ నంబర్‌వన్, చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో కలిసి ఉమ్మడిగా ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. వీళ్లిద్దరు మొదటి నాలుగు గేముల్లో వారి ప్రత్యర్థులపై విజయం సాధించారు. ఐదో గేమ్‌లో కార్ల్‌సన్‌తో తలపడిన అర్జున్ 44 ఎత్తుల్లో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. 38వ సీడ్‌గా బరిలోకి దిగిన అర్జున్, టాప్‌సీడ్ కార్ల్‌సన్ 4.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా ఆధిక్యంలో ఉన్నారు. మొదటి నాలుగు గేముల్లో అర్జున్... సరాసి డెరిమ్ (కొసావో), రౌనక్ (భారత్), వహప్ సనల్ (టర్కీ), రిచర్డ్ రపార్ట్ (రొమేనియా)పై గెలుపొందాడు. సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ (2.5) రెండో రౌండ్లో ఫ్రెడెరిక్ (జర్మనీ)పై గెలిచి, మిగతా మూడు రౌండ్లలోనూ డ్రాలతోనే సరిపెట్టుకున్నాడు. మహిళల ఈవెంట్‌లో సీనియర్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి (3.5) నాలుగు రౌండ్లలో మూడు విజయాలు సాధించింది. ఏడో సీడ్ హంపి ఎన్క్‌తూల్ అల్తాన్ (మంగోలియా), మరియమ్ (ఆర్మేనియా), గోంగ్ క్విన్‌యున్ (సింగపూర్)పై గెలుపొందింది. మరో నలుగురితో కలిసి ఆమె సంయుక్తంగా రెండో స్థానంలో ఉంది. ఆరోసీడ్ ద్రోణవల్లి హారిక (2.5)తొలి గేమ్‌లో గెలిచి తర్వాతి మూడు గేముల్లోనూ డ్రా చేసుకుంది.

# సినిమా

## హిట్ సిరీస్‌లో...


● వెంకటేశ్

**హి**ట్ ఫ్రాంచైజీలో వచ్చిన 'హిట్: ది ఫస్ట్ కేస్', 'హిట్: ది సెకండ్ కేస్' చిత్రాలు హిట్స్‌గా నిలిచాయి. దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కిస్తున్న ఈ హిట్ సిరీస్ థర్డ్ పార్ట్ 'హిట్: ది థర్డ్ కేసు' చిత్రంలో నాని హీరోగా నటించనున్న సంగతి తెలిసిందే. ఇందులో పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్ పాత్రలో నటిస్తారు నాని. వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనున్నట్లుగా తెలుస్తోంది. అయితే హిట్ ఫ్రాంచైజీలో ఓ హీరోగా వెంకటేశ్ నటించనున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. వెంకటేశ్‌కు శైలేష్ కొలను ఇటీవల ఓ కథ వినిపించారనే వార్తలు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ కథ 'హిట్' సిరీస్‌లోనిదే అని సమాచారం. 'హిట్ 2' ఎండింగ్‌లో నాని వచ్చి, 'హిట్ 3'లో హీరోగా నటిస్తున్నారు. అలా 'హిట్ 3' ఎండింగ్‌లో వచ్చి, 'హిట్ 4'లో హీరోగా నటిస్తారట వెంకటేశ్.

## శంతను వల్ల నేను మారా!



డూడుల్ ఆర్టిస్ట్ శంతనుతో తాను రిలేషన్‌లో ఉన్న విషయాన్ని శ్రుతీహాసన్ గోప్యంగా ఉంచ దలచుకోలేదు. సోషల్ మీడియాలో అతనితో క్లోజ్‌గా ఉన్న ఫొటోలను షేర్ చేస్తూ, కామెంట్లు పెడుతుంటారీ బ్యూటీ. తాజాగా శంతను వల్ల తనలో వచ్చిన మార్పు గురించి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ''నేను, శంతను బెస్ట్ ఫ్రెండ్స్. ఇద్దరం కలిసి ఉంటాం. ఇద్దరం కలిసి కామెంట్లు చదువుతుంటాం. ఎందుకంటే ఆ కామెంట్స్ కామెడీగా ఉంటాయి. ఇక తన వల్ల నేను ప్రశాంతంగా మారిపోయాను. అలాగే దయ గల వ్యక్తిగా మారాను. శంతను చాలా ప్రశాంతంగా, దయగా ఉంటాడు. అందుకే తనంటే నాకు ఇష్టం. ఈ రెండు లక్షణాలను నేను అలవాటు చేసుకున్నాను'' అని ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు శ్రుతీహాసన్. ఇక సినిమాల విషయానికి వస్తే.. 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' చిత్రాలతో ఈ సంక్రాంతికి థియేటర్లలో కనిపించనున్నారు శ్రుతీహాసన్. ప్రస్తుతం ప్రభాస్ సరసన 'సలార్' చిత్రంలో నటిస్తున్నారు.


● శ్రుతీహాసన్

## ఎర్రని కపోతమే వీడే...


● చిరంజీవి

''**భ**గ భగ భగ భగ మండే... మగ మగ మగాడురా వీడే...' అంటూ మొదలవుతుంది 'వాల్తేరు వీరయ్య' సినిమాలోని టైటిల్ సాంగ్. చిరంజీవి హీరోగా బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. హీరో రవితేజ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని టైటిల్ సాంగ్ 'వీరయ్య.. వీరయ్య' లిరికల్ వీడియోను సోమవారం విడుదల చేశారు. 'ఎకా ఎకా ఎకియముండు రాసే కవిత్వమంటే అది వీడే.. నవ శకాన ఎర్రని కపోతమే వీడే... తరాలు చూడని, యుగాలు చూడని సమర్థ శిఖరం అది వీడే. తనొంక తానే తలెత్తి చూస్తాడే...' అంటూ ఈ పాట సాగుతుంది. మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ కంపోజిషన్లో బ్రాస్ ఆర్కెస్ట్రా సెక్షన్ బ్యాంకాక్ మ్యూజిషియన్స్‌తో ఈ పాటను రికార్డు చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు.

## ఆయన నాకు గాడ్ బ్రదర్ – సుమన్


● భానుచందర్, ప్రియా హెగ్డే, సుమన్

**కి**రణ్ రాజ్, ప్రియా హెగ్డే జంటగా సుమన్, భానుచందర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నువ్వే నా ప్రాణం'. శ్రీకృష్ణ మలిశెట్టి దర్శకత్వంలో శేషు దేవరావ్ మలిశెట్టి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సుమన్ మాట్లాడుతూ– ''భానుచందర్ నా మిత్రుడు. ఇద్దరం మార్షల్ ఆర్ట్స్ ఆర్టిస్టులం. ఇలా భానుచందర్‌ని నా గాడ్ బ్రదర్‌లా భావిస్తాను. ఇక 'నువ్వు నా ప్రాణం' కథ నచ్చి ఓకే చేశాను. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''శ్రీకృష్ణకు ప్రతి డిపార్ట్‌మెంట్‌పై గ్రిప్ ఉన్నట్లు అనిపించింది'' అన్నారు భానుచందర్. ''దాదాపు 700కి పైగా సినిమాల్లో నటించిన భానుచందర్, సుమన్‌గార్లు మా సినిమాలో యాక్ట్ చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు శ్రీకృష్ణ. ''మొట్టమొదటిసారి సినిమా రంగంలో అడుగుపెట్టాం. మమ్మల్ని ఆదరించి, మా సినిమాను హిట్ చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు శేషు దేవరావ్ మలిశెట్టి.

## ఆ స్టెప్స్ సినిమాకి ప్లస్ – నృత్యదర్శకుడు శేఖర్



''**చి**రంజీవి, బాలకృష్ణగార్లలో ఉన్న కామన్ క్వాలిటీ ఏంటి అంటే వారి అంకితభావం, సమయపాలన. ఏ డ్యాన్స్ మూమెంట్‌ని అయినా సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసేంతవరకూ రిలాక్స్ అవ్వరు'' అన్నారు నృత్యదర్శకుడు వీజే శేఖర్. చిరంజీవి టైటిల్ రోల్‌లో, రవితేజ ప్రధాన పాత్రలో బాబీ దర్శకత్వంలో రూపొందిన 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన 'వీరసింహారెడ్డి' చిత్రాలు సంక్రాంతి సందర్భంగా వరుసగా జనవరి 13, జనవరి 12న రిలీజ్ కానున్నాయి. ఈ రెండు చిత్రాలను నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మించారు. 'వాల్తేరు వీరయ్య'లోని అన్ని పాటలకు, 'వీరసింహారెడ్డి'లోని రెండు పాటలకు (సుగుణసుందరి, మా భావ మనోభావాల్) కొరియోగ్రఫీ చేశారు శేఖర్. ఈ సందర్భంగా సోమవారం విలేకర్ల సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ– ''వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' ఒకేసారి సంక్రాంతి సమయంలోనే రిలీజ్ అవుతాయనుకోలేదు. కాబట్టి ఈ సినిమాల్లోని పాటలకు నృత్యరీతులు సమకూర్చేప్పుడు పెద్దగా ఆందోళనపడలేదు. కానీ ఇప్పుడు రెండు చిత్రాలూ సంక్రాంతికే వస్తుండటంతో ఒకవైపు ఆందోళనగా మరోవైపు సంతోషంగా ఉంది. ఈ సంక్రాంతి నాకు పెద్ద పండగ అని చెప్పగలను. ఇక సోషల్ మీడియాలో కొన్ని మూమెంట్స్ రీల్స్ రూపంలో వైరల్ అవుతుంటాయి. ఈ మూమెంట్స్ బాగుంటే వీటి తాలూకు పాటలను, కంటెంట్‌ను బట్టి సినిమాను ఆడియన్స్ హిట్ చేస్తున్నారు. సో.. సిగ్నేచర్ స్టెప్స్ ఉంటే సినిమాకు ప్లస్ అయ్యేలా అనిపిస్తోంది. నా కెరీర్ స్టార్టింగ్ నుంచి కూడా నేను సిగ్నేచర్ స్టెప్స్‌ను ఫాలో అవుతూ వస్తున్నాను. అలాగే సీనియర్లకు కొన్నిసార్లు మూమెంట్స్‌ని బట్టి రెండు, మూడు ఆప్షన్లు రెడీ చేసుకుంటుంటాం. ఇక దర్శకత్వ ఆలోచన ఉంది కానీ ఎప్పుడో కచ్చితంగా చెప్పలేను. ప్రస్తుతం మహేశ్‌బాబు–త్రివిక్రమ్‌గార్ల కాంబినేషన్ సినిమా, రవితేజగారి 'రావణాసుర', 'టైగర్ నాగేశ్వరరావు' సినిమాలు చేస్తున్నాను'' అని అన్నారు.

## ట్విస్టులకే టీ షర్టు


● డైమండ్ రత్నబాబు, సన్నీ, నాగార్జున, రజిత్ రావు

బిగ్ బాస్ విన్నర్ వీజే సన్నీ, సప్తగిరి హీరోలుగా నక్షత్ర, అక్సాఖాన్ హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'అన్‌స్టాపబుల్'. అన్ లిమిటెడ్ ఫన్ అన్నది ఉపశీర్షిక. డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రజిత్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా 'అన్‌స్టాపబుల్' టీజర్‌ను హీరో నాగార్జునతో విడుదల చేయించారు. 'ట్విస్టులకే టీషర్టు వేసినట్లుండే ఇద్దరు ఇలఖత మఫిలియా గురించి మీకు చెప్తా' అంటూ 30 ఇయర్స్ పృథ్వీ వాయిస్ ఓవర్‌తో టీజర్ సాగుతుంది. ''డైమండ్ రత్నబాబు తన మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రేక్షకులను నవ్వించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. స్క్రీన్‌ప్లే రసవత్తరంగా ఉంటుంది. భీమ్స్ సిసిరోలియో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఓ అసెట్. రఘుబాబు, బిత్తిరి సత్తి, షకలక శంకర్, పాత్రలు నవ్వులు పంచే విధంగా ఉంటాయి. త్వరలో సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: వేణు మురళీధర్, కో ప్రొడ్యూసర్: షేక్ రఫీ, బిట్టు, రాము ఉరుగొండ.

## ఆ రోజు చేజింగ్


● వరలక్ష్మి

**వ**రలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో కె. వీర్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'చేజింగ్'. గత ఏడాది విడుదలైన ఈ సినిమా తాజాగా తెలుగులో విడుదల కానుంది. శ్రీ జ్యోతిలక్ష్మీ క్రియేషన్స్ పతాకంపై ఏఎస్ బాలాజీ ఈ సినిమాను తెలుగులో ఈ నెల 31న విడుదల చేస్తున్నారు. ''ఓ డ్రగ్స్ ముఠా ఆట కట్టించే పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ చేజింగ్, ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. తమిళంలో విజయం సాధించిన ఈ సినిమా తెలుగులోనూ సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అని పేర్కొన్నారు నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: తాషి, కెమెరా: కృష్ణస్వామి.

## వజ్రం కోసం వేట – రామ్ గణపతి



**సా**యి రోనక్, అంకిత సాహా, బిస్మి నాస్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రాజయోగం'. రామ్ గణపతి దర్శకత్వంలో మణి లక్ష్మణ్‌రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రామ్ గణపతి మాట్లాడుతూ– ''నాకు సినిమాలంటే ఇష్టం. కానీ యానిమేషన్ ఫీల్డ్‌లో ప్యారిస్‌లో తొమ్మిదేళ్లు, ఇక్కడ కొన్నేళ్లు జాబ్ చేశాను. ఆ తర్వాత 'ఇఈ' (ఇతడు ఆమె) సినిమా తీశాను. కానీ పెద్ద సినిమాల మధ్య విడుదలైన నా సినిమా పెద్దగా ఆడలేదు. దాంతో సంపాదించుకున్నది పోగొట్టుకున్నాను. అయితే సినిమాలంటే ఉన్న ఇష్టంతో బాధపడలేదు. ఈసారి యూత్ ఆడియన్స్‌కు నచ్చేలా సినిమా చేయాలని ఈ 'రాజయోగం' చేశాను. ఓ వజ్రం కోసం జరిగే వేట ఈ సినిమా. ఆ వజ్రం ఎవరికి దొరుకుతుంది? ఎవరికి రాజయోగం పడుతుందనేది థియేటర్స్‌లో చూడాలి'' అన్నారు.

సాక్షి
# బిజినెస్
మంగళవారం
27-12-2022

**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 721 | 208 |
| 60,566 | 18,015 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి నాలుగు శుక్రవారం ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 10,498 | ▲ | 22 |
| డోజోన్స్ | 33,204 | ▲ | 176 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,473 | ▲ | 4 |
| డాక్స్ | 13,941 | ▲ | 27 |
| షాంఘై | 3,066 | ▲ | 20 |
| నికాయ్ | 26,406 | ▲ | 171 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 82.02 | 83.69 |
| £ | యూరో | 86.48 | 89.57 |
| € | బ్రిటన్ పౌండ్ | 98.33 | 101.67 |
| ¥ | జపాన్ ఎన్ (100) | 61.57 | 63.59 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | 54.41 | 56.76 |
| S$ | సింగపూర్ డాలర్ | 60.32 | 62.28 |
| SAR | సౌదీ రియాల్ | 21.04 | 22.72 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 21.61 | 23.40 |
| ¥ | చైనా యువాన్ | 10.75 | 12.77 |

## హెటిరో నిర్మాకామ్‌కు డబ్ల్యూహెచ్‌వో ఆమోదముద్ర

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా దిగ్గజం హెటిరోకి చెందిన 'నిర్మాకామ్' (నిర్మాట్రెల్‌విర్) నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రీక్వాలిఫికేషన్ (డబ్ల్యూహెచ్‌వో పీక్యూ) ఆమోదముద్ర లభించింది. ఈ ఔషధాన్ని మరింత మందికి అందుబాటులోకి తెచ్చే దిశగా ఇది కీలక మైలురాయని కంపెనీ ఎండీ వంశీ కృష్ణ బండి తెలిపారు. భారత్‌తో పాటు 95 అల్పాదాయ, మధ్య స్థాయి ఆదాయ దేశాల్లో నిర్మాకామ్‌ను మరింత వేగంగా,



చౌకగా అందుబాటులోకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. కోవిడ్–19 చికిత్సలో ఉపయోగించే ఫైజర్ ఔషధం ప్యాక్స్‌లోవిడ్‌కు ఇది జనరిక్ వెర్షన్. నిర్మాట్రెల్‌విర్ 150 మి.గ్రా.(2 ట్యాబ్లెట్లు), రిటోనావిర్ 100 మి.గ్రా.(1 ట్యాబ్లెట్) అనే 2 యాంటీవైరల్ ఔషధాలు ఈ ప్యాక్‌లో ఉంటాయి. దీని తయారీ, విక్రయానికి సంబంధించి మెడిసిన్స్ పేటెంట్ పూల్ (ఎంపీపీ) నుంచి స్వచ్ఛంద లైసెన్సింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు హెటిరో తెలిపింది. ఈ లైసెన్స్ కింద జనరిక్ వెర్షన్‌ను రూపొందించిన తొలి సంస్థ హెటిరో కావడం ప్రశంసనీయమని ఎంపీపీ ఈడీ చార్లెస్ గోర్ తెలిపారు. దేశీయంగా అత్యవసర వినియోగం కోసం డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) నుంచి ఇప్పటికే అనుమతులు పొందినట్లు వివరించింది.

## క్రోమా క్రిస్మస్, కొత్త సంవత్సరపు ఆఫర్లు

హైదరాబాద్: టాటా గ్రూప్ ఎలక్ట్రానిక్స్ రిటైల్ కంపెనీ 'క్రోమా' క్రిస్మస్, కొత్త ఏడాది సందర్భంగా ఆఫర్లు



ప్రకటించింది. గేమింగ్ ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, గృహోపకరణాలపై డీల్స్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. ప్రారంభ ధర రూ.12,999తో 5జీ స్మార్ట్ ఫోన్ పొందవచ్చు. దీనికి అదనంగా రూ.4,999 విలువైన స్మార్ట్‌వాచ్‌ను(బ్రాండ్లను బట్టి) ఉచితంగా అందిస్తుంది. పార్టీ స్పీకర్లను రూ.2199 ప్రారంభ ధరతో అందిస్తుంది. సౌండ్‌బార్లపై 80% వరకు తగ్గింపు లభిస్తుంది. అన్ని క్రోమా స్టోర్లు, క్రోమా ఆన్‌లైన్ పోర్టల్ కొనుగోలుపై ఈ ఆఫర్లు పొందవచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఈ ఆఫర్లు జనవరి రెండో తేదీ వరకు అందుబాటులో ఉంటాయి.

# వీడియోకాన్ ధూత్ అరెస్టు

**ఐసీఐసీఐ బ్యాంక్ రుణ మోసం కేసులో అరెస్ట్ చేసిన సీబీఐ**

న్యూఢిల్లీ: ఐసీఐసీఐ బ్యాంక్ రుణ మోసం కేసులో వీడియోకాన్ గ్రూప్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్ ధూత్‌ను (71) సీబీఐ అరెస్ట్ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కేసు విషయంలో సోమవారం కొంత సేపు విచారణ చేసిన తర్వాత ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. డిసెంబర్ 23న అరెస్టయిన ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో చందా కొచర్, ఆమె భర్త దీపక్ కొచర్‌ల రిమాండ్‌పై విచారణ కోసం ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టడానికి కొద్ది గంటల ముందే ధూత్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. ముగ్గురితో పాటు మరికొందరు నిందితులపై సీబీఐ త్వరలో చార్జిషీట్‌ను దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. 2012లో చందా కొచర్ సీఈవోగా ఉన్నప్పుడు వీడియోకాన్‌కు ఐసీఐసీఐ బ్యాంక్ రూ. 3,250 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు, ప్రతిగా ఆ కంపెనీ చీఫ్ ధూత్.. దీపక్ కొచర్ కంపెనీలో ఇన్వెస్ట్ చేసినట్లు ఆరోపణలున్నాయి. దీంతో చందా కొచర్, దీపక్ కొచర్, ధూత్‌తో పాటు న్యూపవర్ రెన్యువబుల్స్ వంటి సంస్థలను సీబీఐ ఎఫ్‌ఐఆర్‌లో చేర్చింది.

**దిగ్గజం నుంచి డిఫాల్టరు స్థాయికి పతనం..**

ఒకప్పుడు దిగ్గజంగా వెలుగొందిన వేణుగోపాల్ ధూత్ డిఫాల్టరు స్థాయికి పతనమైన తీరు పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో వ్యవసాయ కుటుంబంలో ధూత్ జన్మించారు. 1984లో ఆయన తండ్రి నందలాల్ మాధవ్‌లాల్ ధూత్ వీడియోకాన్ గ్రూప్‌ను ప్రారంభించారు. జపాన్‌లో ఎలక్ట్రానిక్స్ కంపెనీల్లో ఏడాది పాటు శిక్షణ తీసుకున్న ధూత్ స్వదేశానికి తిరిగొచ్చి టీవీ సెట్ల తయారీ కోసం 1986లో వీడియోకాన్ ఇంటర్నేషనల్‌ను నెలకొల్పారు. జపాన్ దిగ్గజం తోషిబాతో సాంకేతిక ఒప్పందం కుదుర్చుకున్నాక ఇక వెనుతిరిగి చూడలేదు. ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఇతరత్రా ఉపకరణాల తయారీని ప్రారంభించారు. ఆ తర్వాత ఆయిల్ అండ్ గ్యాస్, సెల్యులార్ సర్వీసులు మొదలైన విభాగాల్లోకి విస్తరించారు. అయితే, టెలికమ్యూనికేషన్స్‌ను మూసివేయాల్సి రావడం, కీలకమైన ఎలక్ట్రానిక్స్ మార్కెట్లో





పోటీ పెరిగిపోవడంతో కంపెనీ కుదేలైంది. అప్పుల భారం పెరిగిపోవడంతో 2018లో రూ. 31,000 కోట్ల బాకీలను రాబట్టుకునేందుకు సంస్థను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముందు నిలబెట్టాయి బ్యాంకులు, ఆర్థిక సంస్థలు. వీడియోకాన్‌ను టేకోవర్ చేసేందుకు 2021లో రూ. 2,692 కోట్లు మాత్రమే ఇస్తామంటూ ఒకే ఒక్క సంస్థ (ట్విన్‌స్టార్ టెక్నాలజీస్) బిడ్ వేసింది. అయితే, అది కూడా వివాదాస్పదం కావడంతో ఈ ఏడాది కొత్తగా మళ్లీ బిడ్లను ఆహ్వానించారు.

## లూనా మళ్లీ వస్తోంది

**త్వరలో మార్కెట్లోకి ఈ–లూనా**

న్యూఢిల్లీ: చిన్న బండి లూనా గుర్తుంది కదూ. ఒకప్పుడు ప్రాచుర్యంలో ఉన్న ఈ మోపెడ్ కొద్ది రోజుల్లో



ఎలక్ట్రిక్ లూనా రూపంలో వస్తోంది. కినెటిక్ గ్రీన్ ఎనర్జీ, పవర్ సొల్యూషన్స్ దీనిని ప్రవేశపెట్టనుంది. చాసిస్, ఇతర విడిభాగాల తయారీ ఇప్పటికే మొదలైందని కినెటిక్ గ్రూప్ ప్రకటించింది. నెలకు 5,000 యూనిట్ల తయారీ సామర్థ్యంతో ప్రత్యేక యూనిట్ సైతం అహ్మద్‌నగర్ ప్లాంటులో ఏర్పాటైంది. లూనా అమ్మకాల ద్వారా వచ్చే 2–3 ఏళ్లలో ఏటా రూ.30 కోట్ల ఆదాయం సమకూరుతుందని కినెటిక్ ఇంజినీరింగ్ ఎండీ ఆజింక్యా ఫిరోదియా తెలిపారు.

# క్రిస్మస్ తర్వాత శాంటాక్లాజ్ ర్యాలీ

- కోవిడ్ భయాల నుంచి తేరుకున్న మార్కెట్
- 4 రోజుల నష్టాల నుంచి గట్టెక్కిన సూచీలు
- ఫార్మా షేర్లకు మాత్రమే అమ్మకాలు
- సెన్సెక్స్ 721 పాయింట్లు ప్లస్
- మళ్లీ 18వేల పైకి నిఫ్టీ




ముంబై: క్రిస్మస్ పండుగ తర్వాత రోజు స్టాక్ మార్కెట్లో శాంటాక్లాజ్ ర్యాలీ కనిపించింది. కోవిడ్ భయాలతో గతవారం అమ్మకాల ఒత్తిడికి లోనైన దేశీయ మార్కెట్ సోమవారం భారీ లాభాలను ఆర్జించింది. ఇటీవల మార్కెట్ పతనంతో కనిష్టాలకు దిగివచ్చిన షేర్లకు డిమాండ్ లభించింది. అధిక వెయిటేజీ ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లు ఒకటిన్నర శాతం రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు ట్రేడింగ్‌పై పెద్దగా ప్రభావాన్ని చూపలేదు. ఉదయం సెన్సెక్స్ 90 పాయింట్ల స్వల్ప నష్టంతో 59,845 వద్ద, నిఫ్టీ 23 పాయింట్ల పతనంతో 17,830 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే ప్రతికూలాంశాలేవీ లేకపోవడంతో సూచీలు స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 989 పాయింట్లు దూసుకెళ్లి 60,834 వద్ద, నిఫ్టీ 277 పాయింట్లు బలపడి 18,084 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. ఆఖర్లో స్వల్ప లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో చివరికి సెన్సెక్స్ 721 పాయింట్ల లాభంతో 60,566 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 208 పాయింట్లు పెరిగి 18,015 వద్ద నిలిచింది. సెన్సెక్స్ సూచీలో 30 షేర్లలో ఐదు మాత్రమే నష్టపోయాయి. దీంతో స్టాక్ సూచీల నాలుగురోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లు రాణించాయి. ముఖ్యంగా ఫైనాన్స్, ఇంధన, ఐటీ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. విస్తృత స్థాయిలో మార్కెట్లో చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్స్‌లు వరుసగా 3.13%, 2.31 శాతం చొప్పున ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.498 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1286 కోట్ల ఈక్విటీలను కొనుగోలు చేశారు. ఆసియా అరశాతం చొప్పున లాభపడ్డాయి. డాలర్ మార్కెట్లో రూపాయి విలువ 17 పైసలు బలపడి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ ఒకశాతానికి పైగా ర్యాలీ చేయడంతో స్టాక్ మార్కెట్లో రూ. 5.79 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం విలువ రూ.277.91 లక్షల కోట్లకు చేరింది.

■ రాయ్ దంపతులు ఎన్‌డీటీవీలోని తమ వాటాను అదానీకి విక్రయించనుండటంతో 5% బలపడి రూ. 358 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకిన ఎన్‌డీటీవీ, చివరికి 1% లాభంతో రూ.343 వద్ద స్థిరపడింది.

# యాడ్వెంట్ చేతికి సువెన్ ఫార్మా

- 50.1 శాతం వాటా కొనుగోలుకి సై
- ఒప్పందం విలువ రూ. 6,313 కోట్లు
- షేరుకి రూ. 495 ధరలో ఓపెన్ ఆఫర్





ముంబై: దేశీ హెల్త్‌కేర్ కంపెనీ సువెన్ ఫార్మాస్యూటికల్స్‌లో మెజారిటీ వాటాను గ్లోబల్ పీఈ దిగ్గజం యాడ్వెంట్ ఇంటర్నేషనల్ సొంతం చేసుకోనుంది. ప్రమోటర్లు జాస్తి కుటుంబం నుంచి 50.1 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు యాడ్వెంట్ అధికారికంగా ప్రకటించింది. ప్రమోటర్ల నుంచి 12.75 కోట్ల షేర్లను కొనుగోలు చేసేందుకు యాడ్వెంట్ రూ. 6,313 కోట్లు వెచ్చించనున్నట్లు సువెన్ బీఎస్‌ఈకి తెలియజేసింది. దీనిలో భాగంగా సువెన్ వాటాదారులకు యాడ్వెంట్ ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించనున్నట్లు పేర్కొంది. షేరుకి రూ. 495 ధరలో పబ్లిక్ నుంచి 26 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. వెరసి పబ్లిక్ నుంచి 6,61,86,889 షేర్ల కోసం యాడ్వెంట్ రూ. 3,276 కోట్లకుపైగా ఇన్వెస్ట్ చేయనుంది. ప్రస్తుతం సువెన్‌లో జాస్తి కుటుంబీకులకు మొత్తం 60 శాతం వాటా ఉంది. తాజా డీల్‌తో ఈ వాటా 9.9 శాతానికి పరిమితంకానుంది.

**విలీనానికి ఆసక్తి**

పోర్ట్‌ఫోలియో కంపెనీ కోహేన్స్‌ను సువెన్‌లో విలీనం చేసేందుకున్న అవకాశాలను అన్వేషించనున్నట్లు యాడ్వెంట్ పేర్కొంది. తద్వారా విలీనం సంస్థ ఎండ్ టు ఎండ్ కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, తయారీ దిగ్గజంగా ఆవిర్భవించనున్నట్లు తెలియజేసింది. వీటితోపాటు ఏపీఐ తయారీని సైతం కలిగి ఉన్న కంపెనీ ఫార్మా, స్పెషాలిటీ కెమికల్ మార్కెట్లలో సర్వీసులందించనున్నట్లు వివరించింది. ఐదారు నెలల్లో డీల్ పూర్తయ్యే వీలున్నట్లు సువెన్ ఫార్మా ఎండీ జాస్తి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వ్యూహాత్మక అవకాశాలు, వాటాదారులకు లబ్ధి చేకూర్చడం వంటి అంశాల ఆధారంగా విలీన అంశాన్ని బోర్డు చేపట్టనున్నట్లు తెలియజేశారు. షేర్ల మార్పిడి తదితరాలపై కసరత్తు జరుగుతున్నట్లు చెప్పారు. కాగా.. మిగిలిన 9.9% ప్రమోటర్ల వాటాను 18 నెలలపాటు విక్రయించకుండా లాకిన్ పీరియడ్ వర్తిస్తుందని జాస్తి చెప్పారు. వాటాదారులతోపాటు ఈ వాటాకు తగిన విలువ చేకూరే వరకూ విక్రయించే యోచన లేదని స్పష్టం చేశారు.

**2020లో విభజన..**

మాతృ సంస్థ సువెన్ లైఫ్ సైన్సెస్ నుంచి 2020లో సువెన్ ఫార్మాస్యూటికల్స్ విడివడింది. గత నాలుగేళ్లలో ఆదాయం 20 శాతం స్థాయిలో వృద్ధి చూపింది. 43 శాతానికి మించిన నిర్వహణ లాభ మార్జిన్లు సాధిస్తోంది. ఇక 2021–22లో కోహేన్స్ రూ. 1,280 కోట్ల టర్నోవర్ అందుకుంది. 2007 నుంచీ దేశీయంగా దృష్టి పెట్టిన యాడ్వెంట్ విభిన్న రంగాలకు చెందిన 14 కంపెనీలలో 3.2 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది.

**ఈ వార్తల నేపథ్యంలో సువెన్ ఫార్మా షేరు దాదాపు 5% పతనమై రూ. 473 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 520–470 మధ్య ఊగిసలాడింది.**

### ముఖ్య సలహాదారుగా..

డీల్ పూర్తయ్యాక కంపెనీ ఎండీ పదవి నుంచి తప్పుకోనున్నట్లు జాస్తి తెలియజేశారు. అయితే ప్రధాన సలహాదారుగా కన్సల్టెన్సీ సర్వీసులను అందించనున్నట్లు వెల్లడించారు. హెల్త్‌కేర్‌లో లోతైన నైపుణ్యం, అంతర్జాతీయంగా వృత్తి నిపుణులుగల యాడ్వెంట్ తమకు అనుగుణమైన కీలక భాగస్వామిగా పేర్కొన్నారు. తద్వారా సువెన్ తదుపరి దశ వృద్ధిలోకి ప్రవేశిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కోహేన్స్‌తో విలీనం ద్వారా విభిన్న సర్వీసులు సమకూర్చగలుగుతామని, ఇది రెండు సంస్థలకూ లబ్ధిని చేకూర్చుతుందని వివరించారు. సువెన్ కొనుగోలు ద్వారా బిలియన్ డాలర్ల(సుమారు రూ. 8,600 కోట్లు) విలువైన గ్లోబల్ కంపెనీకి తెరతీసే వీలున్నట్లు యాడ్వెంట్ ఎండీ పంకజ్ పట్వారీ పేర్కొన్నారు. సువెన్ సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా సీడీఎంవో విభాగంలోని గ్లోబల్ కంపెనీలలో ఒకటిగా తీర్చిదిద్దనున్నట్లు తెలియజేశారు.

---

## భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# విద్య, ఉద్యోగ సమాచారం

### టీబీ నియంత్రణ కార్యాలయం, ఏలూరులో10 పోస్టులు

ఏలూరులోని జిల్లా క్షయ నియంత్రణ కార్యాలయం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **పోస్టుల వివరాలు:** సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్–02, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్–01, డీఆర్–టీబీ సెంటర్ స్టాటిస్టికల్ అసిస్టెంట్–01, ఆర్‌ఎన్ టీసీపీ ల్యాబ్ టెక్నీషియన్/మైక్రోస్కోపిస్ట్–05,ట్యూబర్క్యులోసిస్ హెల్త్ విజిటర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, డ్రైవింగ్ లైసెన్స్ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును టీబీ నియంత్రణ అధికారి, జిల్లా టీబీ నియంత్రణ కార్యాలయం, రూమ్ నెం.77, జీజీహెచ్ క్యాంపస్, ఎన్‌ఆర్ పేట్, ఏలూరు చిరునామకు పంపించాలి.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.12.2022
» **వెబ్‌సైట్:** westgodavari.ap.gov.in

### టీఎస్‌పీఎస్సీలో 185 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. వెటర్నరీ–పశుసంవర్ధక శాఖలో 185 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(క్లాస్–ఎ–బి)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మల్టీజోన్–1, మల్టీజోన్–2లో ఖాళీలను భర్తీ చేయనుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 185
» **పోస్టుల వివరాలు:** వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(క్లాస్–ఎ)–170, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(క్లాస్–బి)–15.
» **వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(క్లాస్–ఎ): అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(వెటర్నరీ సైన్సెస్, యానిమల్ హజ్బెండరీ) లేదా తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి.
» **వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(క్లాస్–బి): అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(వెటర్నరీ సైన్సెస్, యానిమల్ హజ్బెండరీ), పోస్టు గ్రాడ్యుయేషన్ లేదా పీజీ డిప్లొమా(మైక్రోబయాలజీ /పారాసిటాలజీ/ఎపిడెమియాలజీ/వైరాలజీ/ఇమ్యునాలజీ/పాథాలజీ)లేదా మాస్టర్స్ డిగ్రీ(వెటర్నరీ సైన్స్) లేదా ఎంపీఎస్సీ(వెటర్నరీ పబ్లిక్ హెల్త్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.54,220 నుంచి రూ.1,33,630 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్) ఆధారంగా ఎంపికచేస్తారు. పేపర్–1లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్, పేపర్–2లో వెటర్నరీ సైన్స్ సబ్జెక్టుల్లో ప్రశ్నలుంటాయి. పేపర్–1లో 150 ప్రశ్నలకు 150 మార్కులు, పేపర్–2లో 150 ప్రశ్నలకు 300 మార్కులు. మొత్తం 450 మార్కులకు పరీక్ష ఉంటుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 30.12.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకుచివరితేది:** 19.01.2023
» **రాతపరీక్ష తేదీలు:** 15.03.2023. 16.03.2023.
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

### టీఎస్‌పీఎస్సీలో 22 హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 22
» **అర్హత:** బీఎస్సీ(హార్టికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.51,320 నుంచి రూ.1,27,310 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.01.2022.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.01.2023.
» **పరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్) నిర్వహణ తేది:** 04.04.2023
» **వెబ్‌సైట్:** tspsc.gov.in


### అస్సాం రైఫిల్స్‌లో 95 రైఫిల్ మ్యాన్ పోస్టులు

షిల్లాంగ్(మేఘాలయ)లోని అస్సాం రైఫిల్స్.. కారుణ్య నియామకాల కింద వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 95
» **పోస్టుల వివరాలు:** రైఫిల్‌మ్యాన్ జనరల్ డ్యూటీ (జీడీ)–81, హవల్దార్ క్లర్క్–01, వారెంట్ ఆఫీసర్ ఆర్‌ఎం–01, వారెంట్ ఆఫీసర్ డ్రాఫ్ట్స్‌మెన్–01, రైఫిల్‌మ్యాన్ ఆర్మరర్–01, రైఫిల్‌మ్యాన్ ఎన్‌ఏ–01, రైఫిల్‌మ్యాన్ బీబీ–02,రైఫిల్‌మ్యాన్ కార్ప్–01, రైఫిల్‌మ్యాన్ కుక్–04, రైఫిల్‌మ్యాన్ సఫాయ్–01, రైఫిల్‌మ్యాన్ డబ్ల్యూఎం–01.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టరేట్ జనరల్, అస్సాం రైఫిల్స్, షిల్లాంగ్, మేఘాలయ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.01.2023.
» **రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేది:** 11.02.2023.
» **వేదిక:** హెడ్‌క్వార్టర్స్, డైరెక్టరేట్ జనరల్ అస్సాం రైఫిల్స్, షిల్లాంగ్, మేఘాలయ.
» **వెబ్‌సైట్:** assamrifles.gov.in

# బీటెక్‌తో త్రివిధ దళాల్లో కొలువులు

**బీటెక్ అభ్యర్థులకు త్రివిధ దళాల్లో ప్రత్యేక కొలువులు అందుబాటులో ఉన్నాయి. వీటికోసం ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీలు వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేస్తాయి. ముఖ్యంగా కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్) -అసిస్టెంట్ కమాండెంట్స్(ఏసీ), ఇండియన్ ఆర్మీ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు తదితరాల గురించి తెలుసుకుందాం..**



ఇంజనీరింగ్ స్పెషల్

#### కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

• బీటెక్ విద్యార్థులకు త్రివిధ దళాల్లో కొలువు కల్పించే పరీక్ష.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్. ఇండియన్ మిలిటరీ అకాడమీ, నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకు ఉద్యోగాలకు నిర్వహించే ఈ పరీక్షలో.. నేవల్ అకాడమీ అభ్యర్థులు తప్పనిసరిగా బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన ఉంది.

• బీటెక్ అభ్యర్థులు నేవల్ అకాడమీతోపాటు బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా పేర్కొనే మిగిలిన మూడు విభాగాలకూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. రాత పరీక్ష రెండు విధాలుగా ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

• రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్‌ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. ఇది అన్ని అకాడమీల అభ్యర్థులకు ఉమ్మడిగా అయిదు రోజులపాటు జరుగుతుంది. ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి టెస్టులను 6రోజులపాటు నిర్వహిస్తారు. అన్నింటిలోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే త్రివిధ దళాల్లో కొలువు ఖాయం అవుతుంది.

#### సీఏపీఎఫ్-ఏసీ

• సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్) -అసిస్టెంట్ కమాండెంట్స్(ఏసీ)..బీటెక్ విద్యార్థులు పోటీ పడేందుకు అవకాశం ఉన్న మరో మార్గం. కేంద్ర సాయుధ దళాలుగా పేర్కొనే.. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్‌ఎఫ్); సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్); సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్); ఇండో–టిబెటన్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ); సశస్త్ర సీమాబల్(ఎస్‌ఎస్‌బీ)లో.. అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగాలకు యూపీఎస్సీ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. ఈ ప్రక్రియ మొత్తం మూడు దశల్లో జరగుతుంది. అవి..రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, పర్సనాలిటీ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ. తొలిదశ రాత పరీక్ష రెండు పేపర్లలో(జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్–250 మార్కులు; జనరల్ స్టడీస్, ఎస్సే, కాంప్రహెన్షన్–450 మార్కులు) ఉంటుంది. పేపర్-2ను డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు.

• పార్ట్–ఎ(జనరల్ స్టడీస్), పార్ట్–బి(ఎస్సే అండ్ కాంప్రహెన్షన్).. రెండు విభాగాలుగా పేపర్-2 ఉంటుంది. పార్ట్–ఎలో ఎస్సే కొశ్చన్స్ అడుగుతారు. పార్ట్–బీలో 120 మార్కులకు ప్రెసిస్ రైటింగ్, రిపోర్ట్ రైటింగ్, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై ప్రశ్నలు ఉంటాయి. రెండు రాత పరీక్షల తర్వాత ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టును నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపితే.. చివరగా 150 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

#### ఇండియన్ ఆర్మీ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు

ఆర్మీలో ప్రవేశించాలనుకునే బీటెక్ అభ్యర్థులకు చక్కటి మార్గం..టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు. ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సైతం దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. బీటెక్‌లో అభ్యర్థుల మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకుని ముందుగా షార్ట్ లిస్ట్ రూపొందిస్తారు. ఆ జాబితాలో చోటు దక్కించుకున్న అభ్యర్థులకు ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో విజయం సాధించిన వారికి ఇండియన్ మిలిటరీ అకాడమీలో ఏడాదిపాటు శిక్షణ ఇస్తారు. దీన్ని కూడా విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆర్మీలో లెఫ్టినెంట్ హోదాతో పర్మినెంట్ కమిషన్ లభిస్తుంది.

#### ఇండియన్ నేవీ.. యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్ (యూఈఎస్)

నేవీలో నేరుగా క్యాంపస్ నుంచే అడుగు పెట్టేందుకు మార్గం..యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్. యూఈఎస్ ద్వారా పర్మనెంట్ కమిషన్, షార్ట్ సర్వీస్ కమిషన్‌లలో నియామకాలు చేపడతారు. ఏడాదికి ఒకసారి ఈ ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. నేవీ అధికారుల బృందాలు దేశంలోని అత్యుత్తమ ఇన్‌స్టిట్యూట్‌లను సందర్శించి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి. వాటిలో ప్రతిభ చూపిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు. మెకానికల్, మెరైన్, ఏరోనాటికల్, ఏరోస్పేస్, ఆర్కిటెక్చర్, ఆటోమొబైల్, సివిల్, నావల్ ఆర్కిటెక్చర్ తదితర 18 బ్రాంచ్‌లలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. నాలుగో సెమిస్టర్ వరకు 60 శాతం మార్కులు పొంది ఉండాలి.

#### నేవీ.. గ్రాడ్యుయేట్ ఎంట్రీ స్కీమ్

• ఇండియన్ నేవీలో బీటెక్ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న స్కీమ్ ఇది. పైలట్ (ఎంఆర్); పైలట్(ఎఎంఆర్);అబ్జర్వర్;ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్; జనరల్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్(జీఎస్ఎక్స్); హైడ్రో విభాగం; నేవల్ ఆర్కిటెక్ట్; ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ; లాజిస్టిక్స్; ఎడ్యుకేషన్; నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టర్ కేడర్‌లలో కొలువులు భర్తీ చేస్తారు.

• పైలట్ పోస్టులకు బీటెక్‌తోపాటు కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగుండాలి.

• జనరల్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, హైడ్రోగ్రఫీ ఆఫీసర్ పోస్టులకు బీఈ/బీటెక్ ఉత్తీర్ణత అర్హతగా నిర్దేశిస్తారు.

• ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆఫీసర్ పోస్టులకు 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ (కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఐటీ) లేదా బీఎస్సీ(ఐటీ) లేదా ఎంటెక్(కంప్యూటర్ సైన్స్) లేదా ఎమ్మెస్సీ(కంప్యూటర్స్) లేదా బీసీఏ/ఎంసీఏ ఉత్తీర్ణతను అర్హతగా పేర్కొంటారు.

• లాజిస్టిక్ ఆఫీసర్ పోస్టులకు బీఈ/బీటెక్/ఎంబీఏ/ఎంసీఏ/ఎంఎస్సీ(ఐటీ)లలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత లేదా బీఎస్సీ/బీకామ్/బీఎస్సీ(ఐటీ)తో పాటు ఫైనాన్స్ /లాజిస్టిక్స్/సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్/మెటీరియల్ మేనేజ్‌మెంట్‌లలో పీజీ డిప్లొమా ఉండాలి.

• నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ పోస్టులకు మెకానికల్/సివిల్ /ఏరోనాటికల్/మెటలర్జీ/నావల్ ఆర్కిటెక్చర్ స్పెషలైజేషన్లతో బీఈ/బీటెక్‌లలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన వారిని అర్హులుగా పేర్కొంటారు.

• ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్ పోస్టులకు బీఈ/బీటెక్ ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివిన అభ్యర్థులు అర్హులు.

• ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులకు ద్వితీయ శ్రేణితో పోస్ట్ గ్రాడ్యుయేషన్(మ్యాథ్స్ /ఫిజిక్స్/కెమిస్ట్రీ/ఇంగ్లిష్/కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణత లేదా ఇంజనీర్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/మెకానికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణత లేదా ఎకనామిక్స్/హిస్టరీ/పొలిటికల్ సైన్స్‌లో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపిక ప్రక్రియలో భాగంగా రాత పరీక్ష నిర్వహిస్తారు. రాత పరీక్షలో విజయం సాధించిన వారికి ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ నిర్వహించి నియామకాలు ఖరారు చేస్తారు.

#### నేవీ ఇంజనీరింగ్ ఆఫీసర్

ఇంజనీర్ ఆఫీసర్(జనరల్ సర్వీస్), సబ్–మెరైన్ టెక్నికల్ ఆఫీసర్, నావల్ ఆర్కిటెక్ట్ ఆఫీసర్, ఎలక్ట్రికల్ ఆఫీసర్(జనరల్ సర్వీస్), ఎలక్ట్రికల్ ఆఫీసర్ (సబ్–మెరైన్) పోస్టులను నేవీలో భర్తీ చేస్తారు. దీనికి బీటెక్‌లో సంబంధిత స్పెషలైజేషన్‌లో ఉత్తీర్ణులై ఉండాలి. బీటెక్‌లో మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి..వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

#### ఎయిర్‌ఫోర్స్.. ఏఎఫ్‌క్యాట్

• ఎయిర్‌ఫోర్స్‌లోనూ పలు అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సొంతంగా చేపట్టే నియామక ప్రక్రియ ఏఎఫ్‌క్యాట్(ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్)లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఫ్లయింగ్ బ్రాంచ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో పలు టెక్నికల్ కొలువులకు ఈ పరీక్ష ద్వారా పోటీ పడొచ్చు. ఫ్లయింగ్ బ్రాంచ్‌లో అడుగు పెట్టాలనుకుంటే.. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఇంటర్మీడియెట్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లలో 60 శాతం మార్కులు సొంతం చేసుకోవాలి. లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

• గ్రౌండ్ డ్యూటీకి సంబంధించి..గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్) విభాగంలో చేరాలనుకుంటే.. ఇంటర్మీడియెట్‌లో 50 శాతం మార్కులతోపాటు ఇంజనీరింగ్ బీటెక్/ఎంటెక్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు ఈ విభాగానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

#### రెండు దశల ఎంపిక ప్రక్రియ

• ఏఎఫ్‌క్యాట్ ఎంపిక ప్రక్రియ రెండు దశలుగా ఉంటుంది. తొలిదశలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన వారికి తదుపరి దశ ఎస్‌ఎస్‌బీ ప్రక్రియ జరుగుతుంది. ఎస్‌ఎస్‌బీలో విజయం సాధించిన అభ్యర్థులకు సైకలాజికల్ టెస్ట్, ఫ్లైయింగ్ బ్రాంచ్‌కు ఎంపికైన వారికి కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్(సీపీఎస్ఎస్) టెస్టు ఉంటుంది.

ఏఎఫ్‌క్యాట్ పరీక్షను 100 ప్రశ్నలతో 300 మార్కులకు జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ ఇన్ ఇంగ్లిష్; న్యూమరికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్; మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్ విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల అభ్యర్థులకు.. ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ పేరుతో మెకానికల్; కంప్యూటర్ సైన్స్; ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ సబ్జెక్ట్స్‌లో 50 ప్రశ్నలతో 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు తాము ఆసక్తి చూపిన బ్రాంచ్‌కు సరితూగే సబ్జెక్ట్‌తో ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది.

• వీటిలోనూ విజయం సాధిస్తే.. మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇలా అన్నింటిలోనూ చూపిన ప్రతిభ ఆధారంగా తుది జాబితా రూపొందించి.. పర్మనెంట్ కమిషన్‌తో కొలువు ఖరారు చేస్తారు.


ప్రకాశం జిల్లా ఒంగోలు మిలటరీ కాలనీలో వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


తిరుపతి జిల్లా ఆకలివలసలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి


బాపట్ల జిల్లా గుద్దికాయలంకలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు


అనకాపల్లి పట్టణంలోని శ్రీరాంనగర్‌లో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి

మన ప్రభుత్వం

## క్లుప్తంగా...

### ఉపాధ్యాయుల బదిలీల తుది జాబితా ప్రచురించొద్దు

- పాఠశాల విద్యాశాఖకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల బదిలీల విషయంలో తుది జాబితాను ప్రచురించవద్దని పాఠశాల విద్యా శాఖను హైకోర్టు సోమవారం ఆదేశించింది. ప్రాథమిక సీనియారిటీ జాబితాపై ఉపాధ్యాయుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునే అంశానికి మాత్రమే ప్రస్తుతం పరిమితం కావాలని స్పష్టంచేసింది. తుది జాబితా ప్రచురించే విషయంలో తమ ఆదేశాల కోసం వేచి చూడాలని తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 4కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలకు జారీ చేసిన జీవో 187 లోపభూయిష్టంగా ఉందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. బదిలీలకు రూపొందించిన మార్గదర్శకాలు సహేతుకంగా లేవన్నారు. అధికారులు ఈ మార్గదర్శకాలను యాంత్రికంగా రూపొందించినట్లు కనిపిస్తోందని తెలిపారు.

### అంబేడ్కర్ విగ్రహం తనిఖీ బాధ్యతలు వి.ఆర్.సిద్ధార్థ కాలేజీకి

పెనమలూరు: ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో నిర్మిస్తున్న బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని మూడోపార్టీగా తనిఖీచేసే బాధ్యతలను కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరులోని వి.ఆర్.సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీకి ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారామ్ తమకు సోమవారం లేఖ రాసినట్లు ఆ కళాశాల సివిల్ విభాగం డీన్ బావినేని పాండురంగారావు తెలిపారు.

### జ్యుడిషియల్ అకాడమీలో నియామకాలు

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో ఏర్పాటు చేస్తున్న జ్యుడిషియల్ అకాడమీలో పలువురికి పోస్టింగ్‌లు ఇస్తూ ఏపీ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న హరిహరనాథశర్మను అదనపు డైరెక్టర్‌గా కూడా నియమించింది. శ్రీకాకుళంలోని రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.చక్రపాణిని ఒకటో సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్‌గా, గుంటూరులోని ఐదో జిల్లా సెషన్స్ జడ్జి ఆర్.శ్రీలతను రెండో సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్‌గా, విజయవాడలోని నాలుగో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డాక్టర్ వై.బిందుమాధవిని డిప్యూటీ డైరెక్టర్‌గా, గుంటూరు జిల్లా చిలకలూరిపేటలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.సత్యలక్ష్మీప్రసన్నను అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనును అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. వీరంతా డైరెక్టర్‌కు రిపోర్ట్ చేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) సునీత ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తెలంగాణ

### ఎమ్మెల్యేలకు ఎర కేసు సీబీఐకి

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలకు ఎర కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం కీలక ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసు విచారణ నిమిత్తం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 63ను రద్దుచేసింది. సిట్‌గానీ, దర్యాప్తు అధికారిగానీ.. ఇక మీదట ఈ కేసులో ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. కేసు పూర్తి వివరాలను సీబీఐకి అందజేయాలని సిట్‌కు స్పష్టం చేసింది.

### రూ. 50 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: కొత్త సంవత్సర వేడుకల కోసం పెద్దమొత్తంలో మత్తు పదార్థాలు రవాణా చేసేందుకు సిద్ధమైన ముఠా గుట్టును రట్టు చేశారు డీఆర్‌ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు. నగర శివారులోని చెంగిచెర్ల, ఐడీఏ ఉప్పల్‌లోని రహస్య ప్రయోగశాలల్లో (పాత కెమికల్ ల్యాబ్స్‌లో) భారీ మొత్తంలో డ్రగ్స్ తయారు చేస్తున్నట్టు గుర్తించామని డీఆర్‌ఐ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈనెల 21 నుంచి చేపట్టిన సెర్చ్ ఆపరేషన్‌లో రూ. 50 కోట్ల విలువ చేసే 25 కిలోల మెఫెడ్రోన్ పట్టుబడిందని, ఏడుగురు నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్టు వారు పేర్కొన్నారు. డ్రగ్స్ తయారీ ముఠా కీలక సూత్రధారి, డబ్బులు సమకూరుస్తున్న ఫైనాన్సర్‌ను గోరఖ్‌పూర్‌లో అరెస్టు చేసినట్టు తెలిపారు.

# మార్చి 15 నుంచి ఇంటర్ పరీక్షలు

- 15 నుంచి ఫస్ట్ ఇయర్, 16 నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం
- ఏప్రిల్ 4తో ముగియనున్న పరీక్షలు
- ఏప్రిల్ 15 నుంచి ప్రాక్టికల్స్
- జేఈఈ మెయిన్‌తో ఇబ్బంది లేకుండా ప్రాక్టికల్స్ మార్పు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్మీడియెట్–2023 పబ్లిక్ పరీక్షలు మార్చి 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. మార్చి 15 నుంచి ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు, మార్చి 16 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి. నైతికత, మానవ విలువలు పరీక్షను ఫిబ్రవరి 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, పర్యావరణ విద్య పరీక్షను ఫిబ్రవరి 24న ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 15 నుంచి ప్రారంభమవుతాయి. వీటిని ఏప్రిల్ 15 నుంచి 25 వరకు, ఏప్రిల్ 30, మే 10వ తేదీలలో రోజుకు రెండు సెషన్లలో నిర్వహిస్తారు. ఆదివారాలతో కలుపుకొని ఆయా రోజుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. జనరల్, వొకేషనల్ గ్రూపుల విద్యార్థులందరికీ ఇదే షెడ్యూల్‌లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు.

**ప్రాక్టికల్స్‌కు జంబ్లింగ్ విధానం:** ప్రాక్టికల్ పరీక్షలను ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. దీనిలో జంబ్లింగ్ విధానాన్ని అనుసరిస్తారు.

### షెడ్యూల్ ప్రకారం ఇంటర్మీడియెట్-2023 పరీక్షల తేదీలు ఇలా..

| తేదీ | ఫస్టియర్ | తేదీ | సెకండ్ ఇయర్ |
|---|---|---|---|
| 15-03-2023 | ద్వితీయ భాష పేపరు-1 | 16-03-2023 | ద్వితీయ భాష పేపరు-2 |
| 17-03-2023 | ఇంగ్లీషు పేపరు-1 | 18-03-2023 | ఇంగ్లీష్ పేపరు-2 |
| 20-03-2023 | మ్యాథమెటిక్స్ పేపరు-1ఏ, | 21-03-2023 | మ్యాథమెటిక్స్ పేపరు-2ఏ, |
| - | బోటనీ పేపరు-1, | - | బోటనీ పేపరు-2 |
| - | సివిక్స్ పేపరు-1, | - | సివిక్స్ పేపరు-2 |
| 23-03-2023 | మ్యాథమెటిక్స్ పేపరు-1బి, | 24-03-2023 | మ్యాథమెటిక్స్ పేపరు-2బి |
| - | జువాలజీ పేపరు-1, | - | జువాలజీ పేపరు-2, |
| - | హిస్టరీ పేపరు-1 | - | హిస్టరీ పేపరు-2 |
| 25-03-2023 | ఫిజిక్స్ పేపరు-1, | 27-03-2023 | ఫిజిక్స్ పేపరు-2, |
| - | ఎకనామిక్స్ పేపరు-1 | - | ఎకనామిక్స్ పేపరు-2 |
| 28-03-2023 | కెమిస్ట్రీ పేపరు-1 | 29-05-2023 | కెమిస్ట్రీ పేపరు-2 |
| - | కామర్స్ పేపరు-1 | - | కామర్స్ పేపరు-2 |
| - | సోషియాలజీ పేపరు-1 | - | సోషియాలజీ పేపరు-2 |
| - | ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపరు-1 | - | ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపరు-2 |
| 31-03-2023 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపరు-1 | 01-04-2023 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపరు-2 |
| - | లాజిక్ పేపరు-1 | - | లాజిక్ పేపరు-2 |
| - | బ్రిడ్జికోర్సు మ్యాథ్స్ పేపరు-1(బైపీసీ) | - | బ్రిడ్జికోర్సు మ్యాథ్స్ పేపరు-2 (బైపీసీ) |
| 03-04-2023 | మోడ్రన్ లాంగ్వేజ్ పేపరు-1 | 04-04-2023 | మోడ్రన్ లాంగ్వేజ్ పేపరు-2 |
| - | జాగ్రఫీ పేపరు-1 | - | జాగ్రఫీ పేపరు-2 |

### జేఈఈ మెయిన్ పరీక్షల కారణంగా ఏప్రిల్‌లో ప్రాక్టికల్స్

ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు సాధారణంగా జనవరి ఆఖరు లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి నెలాఖరులోపు పూర్తి చేసేవారు. ఈ ఏడాది జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఇంటర్ ప్రాక్టికల్స్‌ను ఏప్రిల్ రెండో వారంలో నిర్వహించాలని నిర్ణయించారు. జేఈఈ మెయిన్ తొలి సెషన్ పరీక్షలు జనవరి 24 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ షెడ్యూల్ ప్రకటించింది. ఫిబ్రవరి 1, 2, 3 తేదీలను రిజర్వుగా కేటాయించింది. రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి 12 వరకు నిర్వహించడంతోపాటు 13, 15 తేదీలను రిజర్వులో ఉంచింది. జేఈఈ మెయిన్ పరీక్షల తేదీలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఇంటర్మీడియెట్‌బోర్డు ఈసారి ప్రాక్టికల్, ఇతర పరీక్షల షెడ్యూల్‌ను రూపొందించింది.



### 7,8, 9 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

- వెనుకబడిన విద్యార్థులకు స్కూల్ అయిపోయాక కూడా బోధన
- వారిలో అభ్యసన సామర్థ్యాలు పెంచడమే లక్ష్యం
- పాఠశాల విద్యా కమిషనర్, సమగ్ర శిక్షా ఎస్పీడీ సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహించనుంది. చదువులో వెనుకబడిన 6, 7, 8 తరగతుల విద్యార్థులకు స్కూలు వేళలు అయిపోయాక ఈ తరగతులు నిర్వహిస్తుంది. ఈ మేరకు విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించేందుకు లిప్(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్) ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు సురేష్‌కుమార్ తెలిపారు. సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సమగ్ర శిక్షా, యూనిసెఫ్, సిప్స్, సేవ్ ద చిల్డ్రన్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్త ఆధ్వర్యంలో సిప్స్(సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ సిస్టమ్)తో ఈ మేరకు అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం ప్రకారం డిగ్రీలోపు విద్యార్థులను సామాజిక అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలనే నిబంధన ఉందని, దాని ప్రకారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి, బీసీడీఈ (బోర్డు ఫర్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్)సహకారం కూడా తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆ సంస్థల సహకారం ఉంటే 6, 7, 8వ తరగతి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచడం మరింత సులభమవుతుందని చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేసి వారి ద్వారా పిల్లల్లో ఉన్న అభ్యసన అంతరాలను తొలగించడానికి కృషి చేస్తామన్నారు. సిప్స్ డైరెక్టర్ డాక్టర్ వల్లి మానిక్కం, సమగ్ర శిక్షా రాష్ట్ర అదనపు పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నోటీసులకు మార్గదర్శి సమాధానం ఇవ్వాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

అనుబంధ వ్యాజ్యాలపై గత వారం ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి తన నిర్ణయాన్ని రిజర్వ్ చేశారు. సోమవారం తన నిర్ణయాన్ని వెలువరించారు. తన ఉత్తర్వుల్లో చిట్‌ఫండ్ చట్ట నిబంధనలను ఉదహరించారు.

**అనుమతి లేకుండా చిట్ నిర్వహించడానికి వీల్లేదు**

'ఈ చట్టంలో ప్రతి దశలోనూ చందాదారు ప్రయోజనాలను పరిరక్షించేందుకు జాగ్రత్తలు పొందుపరిచారు. చిట్ ప్రతి దశను సంబంధిత రిజిస్ట్రార్‌కు ఫోర్‌మెన్ (చిట్ నిర్వాహకుడు) తెలియజేసి తీరాలి. సంబంధిత అధికారి అనుమతి లేకుండా ఫోర్‌మెన్ చిట్‌ను నిర్వహించకూడదు. ఆ చిట్‌పై అధికారికి పూర్తి నియంత్రణ ఉంటుంది. మార్గదర్శి 1962 నుంచి చిట్స్ వ్యాపారం చేస్తోంది. మార్గదర్శి తరపు సీనియర్ న్యాయవాది వాదన ప్రకారం వారి చందాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు లేదు. ఒకవేళ వ్యాపార నిర్వహణలో ఏవైనా అవకతవకలు ఉంటే వాటిని సరిదిద్దుకునేందుకు అధికారులు నోటీసులు ఇవ్వాలి. అలాంటి నోటీసులేవీ ఇవ్వలేదు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని, మార్గదర్శికి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నా. ప్రస్తుతానికి మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగవేతదారు కాదు. సోదాల్లో బయటపడిన లోపాలను సరిదిద్దుకోవాలంటూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ లోపాలకు మార్గదర్శి వివరణ ఇవ్వాల్సిందే. చిట్ ప్రారంభానికి ముందే ఫోర్‌మెన్ చిట్ స్థూల మొత్తంలో 50 శాతాన్ని రిజిస్ట్రార్ వద్ద డిపాజిట్ చేయాలి. ఆ మొత్తాన్ని బ్యాంకు గ్యారెంటీ రూపంలో చూపాలి' అని జస్టిస్ సుబ్బారెడ్డి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**నోటీసుల్లో రిజిస్ట్రార్లు చూపిన కొన్ని అవకతవకలు**

- ప్రస్తుతం కొనసాగుతున్న, గతంలో రద్దయిన ఏ చిట్ గ్రూప్‌నకు ప్రైజ్‌మనీ సెక్యూరిటీని చిట్‌ఫండ్ చట్ట నిబంధనల ప్రకారం ఫోర్‌మెన్ సమర్పించలేదు.
- వ్యక్తిగత చిట్ గ్రూపు ఆస్తి అప్పుల పట్టీలు, వ్యయాల రశీదులు సమర్పించలేదు. చిట్ రద్దయిన నిర్దిష్ట కాల వ్యవధిలో వ్యక్తిగత చిట్ గ్రూపు ఆస్తి, అప్పుల పట్టీలు, వ్యయాల రశీదులు సమర్పించడం తప్పనిసరి.
- భవిష్యత్తు చందా నుంచి ఏదైనా మొత్తాన్ని ఉపసంహరించినప్పుడు ఆ మొత్తాన్ని చిట్ ఒప్పందంలో పేర్కొన్న గుర్తింపు పొందిన బ్యాంకులో డిపాజిట్ చేయాలి. ఈ డిపాజిట్ మొత్తాన్ని భవిష్యత్తు చందా కోసం తప్ప ఏ ఇతర అవసరం కోసం ఉపసంహరించకూడదు. అయితే మార్గదర్శి ఆ మొత్తాన్ని ఒప్పందంలో పేర్కొన్న బ్యాంకులో కాకుండా, మార్గదర్శి కార్పొరేట్ ఆఫీసు బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు సోదాల్లో బయటపడింది. ఇలా కార్పొరేట్ ఆఫీసు ఖాతాలో జమ చేస్తున్న మొత్తాన్ని ఏ అవసరాలకు వాడుతున్నారో తెలపాలి.
- చందాలు, ప్రైజ్‌మనీ తదితరాలను ఏం బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నారో ఆ బ్యాంకు ఖాతాల నంబర్లను చిట్ ఒప్పందంలో పేర్కొనడంలేదు.
- చందాదారులకు చెల్లించాల్సిన ప్రైజ్‌మనీని అనాథరైజ్డ్ డిపాజిట్లుగా బ్యాంకు ఖాతాలో అలాగే ఉంచారు.

**అవకతవకలకు సమాధానం ఇవ్వకుండా హైకోర్టుకు**

సోదాల్లో బయటపడిన ఈ అవకతవకలను ప్రస్తావిస్తూ వీటికి సంబంధించి రికార్డులను, సమాచారాన్ని ఇవ్వాలని మార్గదర్శి సిబ్బందిని కోరినా వారు ఇవ్వలేదు. పైగా, అధికారులు చట్ట ప్రకారం వ్యవహరించడంలేదంటూ మార్గదర్శి హైకోర్టును ఆశ్రయించింది.

## రాష్ట్రంలో 5జీ




### తొలుత విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుమల కొండపై..

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 5జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రిలయన్స్ జియో ట్రూ 5జీ పేరిట ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలుత విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుమల కొండపై 5జీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని, ఏడాదిలోగా రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు 5జీ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని జియో ప్రకటించింది. విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తప్పనిసరిగా మారిందని చెప్పారు. గిరిజన ప్రాంతాలకు త్వరితగతిన 5జీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇప్పటికే జియో రాష్ట్రంలో 4జీ నెట్‌వర్క్ విస్తరణ కోసం రూ.26 వేల కోట్లు వెచ్చించగా, 5జీ కోసం రూ.6,500 కోట్లు వ్యయం చేసిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్త విస్తరణకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

### ఆర్థికాభివృద్ధిలో డిజిటల్ టెక్నాలజీ పాత్ర కీలకం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో డిజిటల్ టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తోందని చెప్పారు. దీన్ని సమర్థంగా వినియోగించుకోవటం ద్వారా రాష్ట్రంలో పలు పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ, ఈ–క్రాప్ నమోదు విషయాల్లో సాంకేతికతను వివరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా పాఠాలను బోధించడంతోపాటు త్వరలోనే అన్ని క్లాసుల్లో డిజిటల్ బోర్డులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి కుటుంబానికి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించడంతోపాటు త్వరలో వీడియో కన్సల్టేషన్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీ వినియోగం వల్ల మంచి, చెడు రెండూ ఉన్నప్పటికీ టెక్నాలజీ అభివృద్ధిని అడ్డుకోలేమని పేర్కొన్నారు. జియో ఏపీ సర్కిల్ సీఈవో ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రతి ఐదు స్మార్ట్‌ఫోన్లలో మూడింటిలో జియోను వినియోగిస్తున్నారని, రాష్ట్ర డేటా మార్కెట్‌లో 55 శాతం వాటాతో జియో మొదటిస్థానంలో ఉందని చెప్పారు. జనవరి నాటికి తిరుపతి పట్టణానికి, డిసెంబర్ నాటికి రాష్ట్రమంతా విస్తరిస్తామని ఆయన తెలిపారు.

## అక్రమ ఆయుధాల సుపారీ గ్యాంగ్ అరెస్ట్

- మధ్యప్రదేశ్ నుంచి ఆయుధాలు.. మహారాష్ట్ర నుంచి గంజాయి
- హత్యలు, నకిలీ నోట్ల దందా
- ఆరుగురి అరెస్ట్.. 18 ఆయుధాల స్వాధీనం
- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి వెల్లడి


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

**స్వాధీనం చేసుకున్న ఆయుధాలు**

- బెరెట్టా పిస్టల్ 1 (15 రౌండ్లతో 9ఎం.ఎం. సెమీ ఆటోమేటిక్ పిస్టల్)
- 9ఎంఎం పిస్టల్స్ 3
- 0.32 ఎంఎం పిస్టల్స్ 11
- రివాల్వర్ 1
- తపంచాలు 2
- 95 రౌండ్ల బుల్లెట్లు, 6 అదనపు మ్యాగజైన్‌లు

సాక్షి, అమరావతి: అక్రమ ఆయుధాల తయారీ, విక్రయాలతోపాటు నకిలీ నోట్ల దందా నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాను ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన ముఠా అనంతపురం, బళ్లారి కేంద్రాలుగా వివిధ రాష్ట్రాల్లో కిరాయి హత్యలకు పాల్పడుతూ, నకిలీ నోట్ల ముద్రణ, చలామణి చేస్తున్నట్టు గుర్తించారు. ఈ గ్యాంగ్‌కు చెందిన ఆరుగురు సభ్యులను అరెస్ట్ చేయడంతోపాటు వారి నుంచి 18 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

**తీగ లాగితే..**

అనంతపురం జిల్లాలో నకిలీ నోట్లు చలామణి చేస్తున్న కొందర్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. అంతర్ రాష్ట్ర అక్రమ ఆయుధాల ముఠా వ్యవహారం బయటపడింది. దాంతో అనంతపురం జిల్లా పోలీసులతో స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ ఏర్పాటు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు. బెంగళూరుకు చెందిన రౌడీషీటర్లు జంషీద్, ముబారక్, అమీర్ పాషా, రియల్ అబ్దుల్ షేక్ మహారాష్ట్రలోని సిర్పూర్ నుంచి గంజాయి, మధ్యప్రదేశ్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ వారిని అరెస్ట్ చేసి 12 అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ టీమ్ వారిని విచారించి మరింత కీలక సమాచారాన్ని రాబట్టింది. అనంతరం మధ్యప్రదేశ్‌లోని బర్వానీ జిల్లాలో హిరేహాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఆయుధాల తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించింది. ఆయుధాల తయారీదారుడు, డీలర్ రాజ్‌పాల్‌సింగ్ తోపాటు ఆయుధాల సరఫరాదారుడిగా ఉన్న సుతార్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 6 అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆయుధాల డీలర్ల నుంచి కొనుగోలు చేసిన ఆయుధాలతో బెంగళూరుకు చెందిన ముఠా సభ్యులు కర్ణాటకలో వివిధ ప్రాంతాల్లో హత్యలు, దోపిడీలకు పాల్పడుతున్నట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. రాజ్‌పాల్‌సింగ్ దేశంలోని వందలాది ప్రాంతాలకు అక్రమ ఆయుధాలు సరఫరా చేస్తున్నట్టు కూడా బయటపడింది. నిందితులు ఆరుగురిపై గంజాయి అక్రమ రవాణా, నకిలీ నోట్ల రాకెట్, అక్రమ ఆయుధాలు, కిరాయి హత్యలు తదితర అభియోగాలపై ఏపీ, కర్ణాటక, మధ్యప్రదేశ్, గోవాలలో పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ముఠా నెట్‌వర్క్‌పై మరిన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

**అసాంఘిక శక్తులను ఉపేక్షించేదే లేదు**



సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఈ క్రమంలో అనంతపురం జిల్లా పోలీసులు కీలక కేసును ఛేదించారు. బెంగళూరుకు చెందిన కిరాయి హంతకుల ముఠా అనంతపురం–బళ్లారి కేంద్రాలుగా కొంతకాలంగా నకిలీ నోట్లు, అక్రమ ఆయుధాల దందా నిర్వహిస్తున్నట్టు గుర్తించాం. అక్రమ ఆయుధాల తయారీదారు, డీలర్‌తోపాటు అంతర్ రాష్ట్ర ముఠాకు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసి 18 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాం.

– కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, డీజీపీ

## భర్తను హత్య చేయించిన మహిళా ఎస్‌ఐ

- డ్రైవర్‌తో వివాహేతర సంబంధం
- ఆమెకు కొడుకు సహకారం
- తమిళనాడులో దారుణం

హోసూరు: తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని, భర్తను హత్య చేయించిన మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన తమిళనాడు క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. క్రిష్ణగిరి జిల్లా కల్లావి ప్రాంతానికి చెందిన సెందిల్ కుమార్ (48) హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసి అక్రమాలకు పాల్పడడంతో చాలా ఏళ్ల కిందటే ఉద్యోగం పోయింది. ట్యాక్సీ నడుపుకుంటూ ఉండేవాడు. అతని భార్య చిత్ర (44) సింగారపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తుంది. వీరికి జగదీష్‌కుమార్ (19) అనే కొడుకున్నాడు. గత సెప్టెంబర్ 16వ తేదీ సెందిల్‌కుమార్ ఆకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై అతని తల్లి భాగ్యం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన అతని కొడుకు జగదీష్‌కుమార్, అతని కారు డ్రైవర్ కమల్‌రాజ్ (37)కోర్టులో లొంగిపోయి సెందిల్‌కుమార్‌ను హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపగా సబ్ ఇన్‌స్పెక్టర్ చిత్రకు– కారు డ్రైవర్ కమల్‌రాజ్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు తేలింది. ఇది తెలిసి భర్త ఇరువురినీ నిలదీయగా కుటుంబ కలహాలు మొదలయ్యాయి. సమీపంలోని పావకల్ గ్రామానికి చెందిన జ్యోతిష్యురాలు సరోజ (38)తో చర్చించగా రూ. 10 లక్షలు ఇస్తే, తాను కూలీలతో నీ భర్తను హత్య చేయిస్తానని చెప్పింది. సరేనని చిత్ర ఆ మొత్తాన్ని సరోజకు అందజేసింది. పథకం ప్రకారం సెందిల్‌ను కిడ్నాప్ చేసిన రోజే హతమార్చి శవాన్ని పొదల్లో పడేశారు. తనపై అనుమానం రాకూడదనే భయంతో కొడుకు జగదీష్‌కుమార్, ప్రియుడు కమల్‌రాజ్‌ను కోర్టులో లొంగిపోవాలని సూచించానని చిత్ర తెలిపింది. చివరకు జ్యోతిష్యురాలు సరోజను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో చిత్ర పాత్ర కూడా బయటపడింది. మొత్తం నలుగురినీ పోలీసులు అరెస్టు చేశారు. పొదల నుంచి కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని వెలికితీసి ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న కూలీల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.